సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 244
శుక్రవారం 19-5-2023
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'


కోహ్లి ధమాకా..
హైదరాబాద్‌పై 8 వికెట్ల తేడాతో బెంగళూరు ఘన విజయం - 12లో


ఎస్‌బీఐ లాభం జూమ్
83 శాతం వృద్ధితో రూ. 16,695 కోట్లు.. షేరుకు రూ. 11.30 డివిడెండ్ - 13లో


రాణాను భారత్‌కు అప్పగించండి
ముంబై ఉగ్రదాడిలో ప్రధాన నిందితుడైన తహవుర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా న్యాయస్థానం అంగీకరించింది.
వివరాలు 6లో ▸


'ది కేరళ స్టోరీ' బ్యాన్‌పై సుప్రీం స్టే
'ది కేరళ స్టోరీ' సినిమా ప్రదర్శనపై నిషేధం విధిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు స్టే విధించింది.
వివరాలు 6లో ▸


జల్లికట్టుకు జై
ఎద్దులు, దున్నలు, గేదెలతో నిర్వహించే జల్లికట్టు, ఎడ్ల పందేలు, కంబళ వంటి జంతు క్రీడల నిర్వహణకు సుప్రీం అనుమతినిచ్చింది.
వివరాలు 6లో ▸



న్యాయశాఖ నుంచి రిజిజు అవుట్
కొలీజియంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న కిరణ్ రిజిజును కేంద్ర న్యాయ శాఖ మంత్రి బాధ్యతల నుంచి మోదీ సర్కార్ తప్పించింది.
వివరాలు 6లో ▸

కోతల్లేని కరెంట్..

రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేనంతగా పెరిగిన వినియోగం

రోజుకు 248 మి. యూనిట్లు దాటిన వాడకం.. గత ఏడాది కంటే 27.51% అధిక డిమాండ్

- అయినా ఎక్కడా కోతల్లేకుండా నిరంతరాయంగా సరఫరా
- ప్రస్తుత ప్రభుత్వ ముందు చూపు వల్లే ఇది సాధ్యం
- థర్మల్ కేంద్రాల్లో సరిపడా బొగ్గు నిల్వలు
- జెన్ కో థర్మల్ కేంద్రాల్లో వంద శాతం విద్యుత్ ఉత్పత్తి
- రాష్ట్రంలో లభిస్తున్న విద్యుత్‌కు తోడు మార్కెట్‌లో కొనుగోలు
- వెరసి పది నిమిషాల కోతలకూ తావు లేకుండా ఏర్పాట్లు
- డిమాండ్ పెరిగి.. సాంకేతిక కారణాల వల్లే అక్కడక్కడ ట్రిప్
- నిమిషాల వ్యవధిలో సరిచేస్తున్న అధికారులు, సిబ్బంది
- గత ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలతో అల్లాడిన ప్రజలు
- అధికారికంగానే కోతలు.. పరిశ్రమలకు పవర్ హాలిడేలు
- ఆ రోజులు మరిచి దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా


విద్యుత్ వెలుగుల్లో విజయవాడ

నాడు చీకటి రోజులు

2లో

గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 'పట్టణాల్లో ఉదయం 6 గంటల నుంచి 11 వరకు.. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 వరకు.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే పగలంతా విద్యుత్ సరఫరా ఉండదు' అని అధికారికంగా ప్రకటనలు జారీ అయ్యేవి. 'ఎండా కాలం కదా.. పవర్ కట్ మామూలే' అని అప్పటి పాలకులు దబాయించే వారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలిసేది కాదు. వంటింట్లో మిక్సీలు తిరక్క గృహిణులు, హాల్లో ఫ్యాన్ తిరక్క పిల్లలు, ఆఫీసుల్లో ఏసీలు పని చేయక ఉద్యోగులు, జిరాక్స్ సెంటర్ల వద్ద విద్యార్థుల పాట్లు అన్నీ ఇన్నీ కాదు. విద్యుత్ ఎప్పుడొస్తుందా అని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సి వచ్చేది. ఆ రోజులను గుర్తు చేస్తే చాలు ప్రజలు కథలు కథలుగా చెబుతారు.

బ్రాండ్ ఏపీ

నేడు వెలుగు జిలుగులు

ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న పదానికి తావు లేకుండా సీఎం వైఎస్ జగన్ ముందు చూపుతో వ్యవహరించారు. గృహాలకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఏ రీతినా సమస్య లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం బొగ్గు నిల్వలు సరిపడా ఉండేలా చూసుకోవడంతో పాటు బయటి మార్కెట్‌లోనూ విద్యుత్ కొనుగోలు చేశారు. సరఫరాలో నాణ్యత పెరిగేలా వ్యవస్థాగత మార్పులు చేశారు. ఈ ఏడాది ఇదివరకెన్నడూ లేనంతగా అనూహ్యంగా డిమాండ్ పెరగడంతో అక్కడక్కడ ఓవర్ లోడ్‌తో ట్రిప్ కావడం తప్పించి ఏ సమస్యా లేకుండా శ్రద్ధ పెట్టారు. అలాంటి చోట్ల నిమిషాల వ్యవధిలోనే మరమ్మతులు చేసేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. తద్వారా ఇళ్లలో, కార్యాలయాల్లో ఎక్కడా 'విద్యుత్ కోత' అన్నమాటే వినిపించడం లేదు. ఫ్యాన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు నిరంతరాయంగా పని చేస్తున్నాయి.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్

- అధికారికంగా ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్టానం.. సీఎల్పీ నేతగా సిద్ధరామయ్య ఏకగ్రీవ ఎన్నిక
- గవర్నర్‌ను కలిసిన నేతలు.. ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత
- రేపు మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణ స్వీకారం

6లో


కర్ణాటక కాంగ్రెస్ నేతలు డీకే శివకుమార్, సిద్ధరామయ్య ఆలింగనం

త్వరితగతిన సీఆర్డీఏ పరిధిలో
ఇళ్ల నిర్మాణం

గృహ నిర్మాణ శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం

- పట్టాలు పంపిణీ చేసిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలి
- నిరుపేదలకు త్వరగా ఇళ్లు కట్టించి అప్పగించడంపై ప్రత్యేక శ్రద్ధ
- ఇళ్లు సమకూరిస్తే వారి జీవితాలు త్వరగా బాగుపడతాయి
- గత 45 రోజుల్లో హౌసింగ్ కోసం రూ.1,085 కోట్ల ఖర్చు
- 3.70 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- రూఫ్ లెవల్, ఆపై దశల్లో 5.01 లక్షల ఇళ్లు
- రూ.35 వేల చొప్పున రూ.3,886.76 కోట్ల రుణాలు



సాక్షి, అమరావతి: క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ) పరిధిలో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ పూర్తి కాగానే నిర్మాణాలు మొదలు పెట్టాలన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై సమీక్ష నిర్వహించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో అధికారులు పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పేదలకు ఎంత త్వరగా పక్కా ఇళ్లను సమకూరిస్తే వారి జీవితాలు అంత త్వరగా బాగు పడతాయన్నారు. సీఆర్డీఏ పరిధిలో పేదలకు పంపిణీ చేస్తున్న స్థలాల్లో వేగంగా పనులు చేపట్టాలని చెప్పారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ సాధ్యమైనంత త్వరగా ఇళ్లు కట్టించి అప్పగించడమే లక్ష్యంగా

మిగతా 2వ పేజీలో ▶

వలంటీర్లకు వందనం నేడు

- వరుసగా మూడో ఏడాది అవార్డులు
- సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు ప్రదానం
- 2,33,719 మందికి రూ.243.34 కోట్ల నగదు పురస్కారాలు.. నేడు ప్రారంభించనున్న సీఎం జగన్
- ఇప్పటి వరకు రూ.705.68 కోట్ల మేర పురస్కారాలు



సాక్షి, అమరావతి: ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వారికి వందనం చెబుతూ వరుసగా మూడో ఏడాది గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ఇచ్చే కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుడుతున్నారు. విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. తూర్పున సూర్యుడు ఉదయించకముందే.. ఆదివారం అయినా, పండగైనా, సెలవు రోజైనా..

మిగతా 2వ పేజీలో ▶

దిగజారుడు జర్నలిజానికి
పరాకాష్ట..

ఆంధ్రజ్యోతిపై సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం ధ్వజం

- సీబీఐ ఎస్పీ నన్ను కలిసినప్పుడు గుండెపోటు పదమే చర్చకు రాలేదు
- నేను చెప్పని అంశాలను చెప్పినట్లు ఆంధ్రజ్యోతి ఎలా రాస్తుంది?
- సెక్షన్ 161 కింద సమాచారం అడిగారు.. దానికి ఎలాంటి న్యాయపరమైన విలువ ఉండదు
- నా సంతకాలు తీసుకోలేదు.. వీడియోగ్రఫీ చేయలేదు
- మీడియా సమాంతర దర్యాప్తు, ప్రభావితం చేసేలా కథనాలు సరి కాదని 'సుప్రీం' తీర్పులున్నాయి
- మేనిఫెస్టో సమావేశాన్ని వివేకా హత్యతో ముడిపెట్టడం దారుణం
- సీబీఐ కూడా ఇలాంటి తప్పుడు వార్తలను ఖండించాలి
- లేదంటే దర్యాప్తు సంస్థ విశ్వసనీయత దెబ్బతింటుంది



> నేను సీబీఐ ఎస్పీకి చెప్పని వాటిని కూడా చెప్పినట్లుగా ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించడం దిగజారుడు జర్నలిజానికి పరాకాష్ట. వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి చెందారని వైఎస్ జగన్ నాతో అన్నారని నేను సీబీఐకి వెల్లడించినట్లు వెలువడ్డ కథనం పచ్చి అబద్ధం.
> - అజేయ కల్లం

సాక్షి, అమరావతి: మేనిఫెస్టో కమిటీ సమావేశానికి, హత్య కేసుకు సంబంధం ముడిపెడుతూ కథనాలను ప్రచురించటాన్ని బట్టి ఆంధ్రజ్యోతి ఏ స్థాయికి దిగజారిందో అర్థం అవుతోందని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకా గుండెపోటుతో మృతి చెందినట్లు వైఎస్ జగన్ తనకు చెప్పారంటూ ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్త పచ్చి అబద్ధమని అజేయ కల్లం ఖండించారు. అంతకుముందే మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగిందని, అందులో పాల్గొన్న వారిని విచారించాలంటూ గతంలో ఓ కథనం వెలువరించిందని, అందులో భాగంగానే

మిగతా 3వ పేజీలో ▶



సుప్రీంకోర్టు జడ్జిగా నేడు జస్టిస్ మిశ్రా ప్రమాణ స్వీకారం

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీకే మిశ్రా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం ఇటీవల ఇద్దరు న్యాయమూర్తులను నియమించాలంటూ పేర్లు సిఫార్సు చేసిన విషయం విదితమే. ఈ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారని న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ గురువారం అర్ధరాత్రి ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జస్టిస్ పీకే మిశ్రా, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్‌లతో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రధాన ధర్మాసనం కోర్టులో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

ఏం చేస్తారు? పీక్కుంటారా?

3లో

- ఎస్.కోట సభలో చంద్రబాబు దిగజారుడు వ్యాఖ్యలు
- ఉత్తరాంధ్రలో అన్ని ప్రాజెక్టులను తానే ప్రారంభించానంటూ అసత్యాలు

సమాధులతో పోలుస్తావా?

- చంద్రబాబును దేశ బహిష్కరణ చేసినా తప్పు లేదు: సజ్జల
- పేదలంటే ఎందుకంత చులకన?
- టీడీపీ హయాంలో ఒక్క సెంటు స్థలం ఎక్కడైనా ఇచ్చావా?
- రాష్ట్రంలో షెడ్యూలు ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి

- వివరాలు 3లో



న్యూస్‌రీల్

విశాఖ వేదికగా మిలాన్.. మెరుపులు



అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాలకు విశాఖ మరోసారి వేదిక కాబోతోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మిలాన్–2024 నిర్వహణకు తూర్పు నౌకాదళం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 50 దేశాలతో భారీ స్థాయిలో విన్యాసాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది.
వివరాలు 14లో ▸

ప్రతిభ చూపిన విద్యార్థులు.. 'జగనన్న ఆణిముత్యాలు'



ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుని టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట ప్రభుత్వం సత్కరించనుంది. ఈ అవార్డుల వేడుకను నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనుంది.
వివరాలు 2లో ▸

తెలంగాణలో 111 జీవో ఎత్తివేత



ఒకప్పుడు హైదరాబాద్ దాహార్తిని తీర్చిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణకు వాటి ఫుల్ ట్యాంక్ లెవల్ నుంచి 10 కిలోమీటర్ల పరిధి వరకు అన్ని రకాల నిర్మాణాలను నిషేధిస్తూ గతంలో జారీ చేసిన 111 జీవోను ఎత్తివేస్తూ తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది.
వివరాలు 14లో ▸

ముంపు బారిన న్యూయార్క్!



అమెరికాలో ముఖ్యమైన నగరమైన న్యూయార్క్ ఇప్పుడు ముంపు ముప్పును ఎదుర్కొంటోంది. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్ర తీరంలో ఉన్న న్యూయార్క్ ఏటా 2 మిల్లీమీటర్ల మేర కుంగిపోతున్నట్లు యూనివర్సిటీ ఆఫ్ రోడ్ ఐలాండ్ సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడయ్యింది.
వివరాలు 6లో ▸



ప్రతిభ చూపిన విద్యార్థులు..
'జగనన్న ఆణిముత్యాలు'

రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సన్మానం

- అన్ని స్థాయిల్లోనూ నగదు పురస్కారాలు అందజేత
- 25న నియోజకవర్గం, 27న జిల్లా స్థాయిలో సన్మాన వేడుక
- 31న రాష్ట్ర స్థాయిలో సీఎం చేతుల మీదుగా సన్మానం
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ
- పదో తరగతిలో టాప్–3 స్థానాల్లో ఉన్నవారికి పురస్కారాలు
- ఇంటర్‌లో ప్రతి గ్రూప్‌లో టాపర్‌కి సత్కారం
- టాపర్స్‌లో సమాన మార్కులతో ఎంతమంది ఉన్నా అందరూ అర్హులే
- టెన్త్‌లో 1,246 మంది, ఇంటర్‌లో 1,585 మంది విద్యార్థులు అర్హత



సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుని పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్)' పేరిట ప్రభుత్వం సత్కరించనుంది. ఈ అవార్డుల వేడుకను నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో నడుస్తున్న పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో 2023 మార్చి, ఏప్రిల్ పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు అవార్డులతో ప్రభుత్వం సన్మానించనుంది. ఇంటర్ స్థాయిలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల వారీగా అత్యధిక మార్కులు సాధించిన వారిని సత్కరించనుంది. విద్యా రంగంలో పలు సంస్కరణలను అమలు చేస్తున్న ప్రభుత్వం.. విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ వేడుక నిర్వహిస్తోంది. మూడు స్థాయిల్లోనూ విద్యార్థులకు నగదు పురస్కారం, మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఇవ్వనుంది. సంబంధిత పాఠశాలకు మెమెంటోతో పాటు ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించనున్నారు.

మార్కుల ఆధారంగా పదో తరగతిలో నియోజకవర్గం స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు 602 మంది ఉండగా, జిల్లా స్థాయిలో 606 మంది, రాష్ట్ర స్థాయిలో టాప్–3 మార్కులు సాధించిన విద్యార్థులు 38 మంది మొత్తం 1246 మంది ఉన్నారు. ఇంటర్మీడియట్ స్థాయిలో టాప్–1 మార్కులు సాధించిన వారు నియోజకవర్గం స్థాయిలో 750 మంది, జిల్లా స్థాయిలో 800 మంది, రాష్ట్ర స్థాయిలో 35 మంది మొత్తం 1,585 మంది విద్యార్థులు ఉన్నారు.

25న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సత్కారం

అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 25న సన్మాన వేడుక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత మే 23న సన్మానించాలని భావించినా అదే రోజు ఏపీఈఏపీ సెట్ ఉన్నందున ఇంటర్ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా 25వ తేదీకి మార్చారు. నియోజకవర్గంలో అందరికీ అనువైన మండల కేంద్రంలో ఈ వేడుక నిర్వహిస్తారు. ఆ మండల విద్యాశాఖ అధికారి వేడుక నిర్వహణకు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో ప్రతి గ్రూప్‌లో టాపర్లను సత్కరిస్తారు. పదో తరగతి టాపర్లకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు నగదు అందజేస్తారు. ఇంటర్మీడియట్‌లో టాపర్లకు రూ.15 వేలు చొప్పున నగదు అందజేస్తారు.

27న జిల్లా స్థాయి వేడుక

జిల్లా స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను ఈ నెల 27న జిల్లా కేంద్రాల్లో సన్మానిస్తారు. ఈ వేడుకకు జిల్లా విద్యా శాఖాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, ఏపీ మోడల్, బీసీ రెసిడెన్షియల్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, కేజీబీవీ.. (ప్రభుత్వ, జెడ్పీ, మునిసిపల్ పాఠశాలలు ఒకే మేనేజ్‌మెంట్) విద్యార్థులు ఒక్కో మేనేజ్‌మెంట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సన్మానిస్తారు.

పదో తరగతి విద్యార్థికి మొదటి స్థానంలో నిలిచినవారికి రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు నగదు అందిస్తారు. ఇంటర్‌లో గ్రూప్‌నకు ఒక్కరు చొప్పున టాపర్లకు ఒక్కొక్కరికి రూ.50 వేలు నగదు అందిస్తారు.

31న రాష్ట్ర స్థాయి వేడుక

రాష్ట్ర స్థాయిలో 'జగనన్న ఆణిముత్యాలు' సన్మాన వేడుక ఈనెల 31న విజయవాడలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానిస్తారు. పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సత్కరిస్తారు. ఇందులో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ మేనేజ్‌మెంట్ స్కూళ్లలో చదివి అత్యధిక మార్కులు సాధించిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి సత్కారం అందుకుంటారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.లక్ష, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు బహుమతి అందిస్తారు. ఇంటర్‌లో గ్రూప్‌నకు ఒక్కరు చొప్పున నాలుగు గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురికి రూ.లక్ష చొప్పున అందిస్తారు.

విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఫలితాలను మెరుగుపరచడం, వారిని భావి ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో అద్భుతమైన సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకంటే 3 రెట్లు అధికంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఖర్చు చేస్తోంది. పాఠశాలకు వెళ్లే పిల్లల తల్లుల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు 'జగనన్న అమ్మ ఒడి' పథకం అమలు చేస్తోంది. ఇందుకోసం అర్హులైన తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం జమ చేస్తోంది. గత మూడేళ్లలో జగనన్న అమ్మ ఒడి పథకం కోసం ప్రభుత్వం రూ.19,617.6 కోట్లు ఖర్చు చేసింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు 'మన బడి నాడు–నేడు' పథకం కింద రూ.13 వేల కోట్లు వెచ్చించింది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగేలా గత మూడేళ్లుగా పాఠశాలలు ప్రారంభించే సమయంలో 'జగనన్న విద్యా కానుక' కింద బ్యాగ్, అన్ని రకాల పుస్తకాలు, స్టిచింగ్ చార్జీతో కలిపి 3 జతల యూనిఫారాలు, బెల్టు, బూట్లు, సాక్స్‌లు అందిస్తోంది. అంతేగాక, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, దుస్తులు మార్చుకునే గదులు, వాష్‌బేసిన్లు, టాయిలెట్ నిర్వహణ నిధిని ఏర్పాటు చేసింది. ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, అన్ని పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించింది. మూడో తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్లను నియమించింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఒకే తేదీన ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్లు నిర్వహించడం గమనార్హం. ఇక 'జగనన్న గోరుముద్ద' పథకం కింద పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం కింద ప్రత్యేక మెనూతో ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తోంది. వారానికి ఐదు రోజులు గుడ్లు, చిక్కీలు పిల్లలకు అందజేస్తోంది. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు రాగిజావను వారానికి మూడు సార్లు అందించడం విశేషం. ఇప్పుడు కొత్తగా 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

దేశంలో కనీవినీ ఎరుగని నిర్ణయం



విద్యపై అత్యధిక ప్రేమ చూపే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్ప దేశంలో మరొకరు లేరు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు ఏ రాష్ట్రంలోనూ లేవు. 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట విద్యార్థులను సత్కరించడం గొప్ప విషయం. టాప్ స్కోరర్లలో సమాన మార్కులు ఎంతమంది సాధించినా వారందరినీ 'జగనన్న ఆణిముత్యాలు' కింద సత్కరించి, నగదు బహుమతులు అందజేస్తాం.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

త్వరితగతిన సీఆర్డీఏ పరిధిలో ఇళ్ల నిర్మాణం

▶ మొదటి పేజీ తరువాయి

కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం గత 45 రోజుల్లో రూ.1,085 కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే 3.69 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. రూఫ్ లెవల్, ఆపై దశలో ఉన్న ఇళ్ల త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. మరో 8.64 లక్షల ఇళ్లు బేస్‌మెంట్ ఆపై దశల్లో ఉన్నాయన్నారు. వీటి పనులనూ వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. గత సమీక్షలో సీఎం జారీ చేసిన ఆదేశాలను అమలు చేశామని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' స్పెషల్ ఆఫీసర్లను కూడా వైఎస్సార్, జగనన్న కాలనీల్లో నియమించి, ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణానికి వాడే వస్తువుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నామని వివరించారు.

బ్యాంకుల నుంచి త్వరితగతిన రుణాలు

ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు మరింత భరోసాగా బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఇలా ఇప్పటి వరకూ 11.03 లక్షల మందికి పావలా వడ్డీతో రూ.35 వేల చొప్పున రుణాలిప్పించామని.. రూ.3,886.76 కోట్ల మేర రుణాలు మంజూరు అయ్యాయని తెలిపారు. సీఆర్డీఏలో ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, భూమి చదును చేసే పనులు చేశామన్నారు. ఈ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మాణం పూర్తయిన 5,024 టిడ్కో ఇళ్లను కూడా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఏపీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్ జైన్, శ్రీలక్ష్మి, విజయానంద్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సాయి ప్రసాద్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సత్యనారాయణ, సీసీఎల్ఏ సెక్రటరీ ఇంతియాజ్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వెంకటరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం నేడు

▶ మొదటి పేజీ తరువాయి

వర్షం పడుతున్నా.. అవాంతరాలను లెక్కచేయక ప్రతి నెలా మొదటి తేదీనే వలంటీర్లు చిరునవ్వుతో సామాజిక పింఛన్లు అందజేస్తున్నారు. ఠంచన్‌గా అవ్వాతాతల గడప వద్దకు వచ్చి, తలుపు తట్టి, ఆప్యాయంగా పలకరించి వైఎస్ జగన్ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లను అందించడంతో పాటు వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించడం, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చేయి పట్టుకొని నడిపిస్తూ, ప్రతి 50 ఇళ్లకు ఒక బిడ్డగా ఉంటూ వైఎస్ జగన్ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్నారు. లంచాలు, వివక్షకు తావులేకుండా సేవా భావంతో సేవలందిస్తున్న వలంటీర్లకు సెల్యూట్ చేస్తూ వారి సేవలను గుర్తించి, ప్రభుత్వం వారికి ప్రోత్సాహకంగా మూడేళ్లుగా ఈ సత్కారం చేస్తున్న విషయం తెలిసిందే.

పనితీరే ప్రామాణికం

- అవినీతికి తావు లేకపోవడం, సచ్ఛీలత, ఇంటింటి సర్వే, పెన్షన్ల పంపిణీ, హాజరు, యాప్‌ల వినియోగం, నవరత్నాల అమల్లో భాగస్వామ్యం, రేషన్ డోర్ డెలివరీ, పెన్షన్ కార్డు, రైస్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయించడం తదితర అంశాల్లో వలంటీర్ల పని తీరే ప్రామాణికంగా అవార్డులకు ఎంపిక చేశారు.
- రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,33,719 మందికి రూ.243.34 కోట్ల నగదు పురస్కారాలు అందజేస్తారు. నేడు అందిస్తున్న ఈ సొమ్ముతో కలిపి ఇప్పటి వరకు వలంటీర్లకు వైఎస్ జగన్ ప్రభుత్వం మొత్తం రూ.705.68 కోట్లు పురస్కారాల కోసం వెచ్చించింది.
- గ్రామ/వార్డు వలంటీర్లు తమ పరిధిలోని 50–100 కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నందుకు.. గ్రామ, వార్డు సచివాలయాలకు, ప్రజలకు మధ్య మంచి సంధానకర్తలుగా వ్యవహరించినందుకు, పారదర్శకంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో సహాయకారిగా వ్యవహరించినందుకు ఈ పురస్కారాలను అందజేస్తోంది. జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ననుసరించి ఎప్పుడు ఏ పథకం అమలవుతుందో ప్రజలకు వివరించి అర్హులతో దరఖాస్తు చేయిస్తున్నందుకు సత్కారం చేస్తోంది.

సేవా సైన్యానికి సలాం

మే 19వ నుంచి అన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లకు అవార్డుల ప్రదానం మొదలవ్వనుంది. కనీసం ఏడాదిగా సేవలందిస్తున్న వలంటీర్లకు, వారు అందించిన సేవల ఆధారంగా 3 కేటగిరీల్లో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

సేవా వజ్ర

సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.30,000 బహుమతి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన మొదటి ఐదుగురు వలంటీర్లకు.. మొత్తంగా 175 నియోజకవర్గాల్లో 875 మందికి.

సేవా రత్న

సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.20,000 బహుమతి. ప్రతి మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురు చొప్పున, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 10 మంది చొప్పున టాప్–1 ర్యాంకు సాధించిన వలంటీర్లకు.. మొత్తంగా 4,220 మందికి.

సేవా మిత్ర

సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.10,000 బహుమతి. రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది పాటు ఎటువంటి ఫిర్యాదులు, వివాదాలు లేకుండా పని చేసిన వలంటీర్లు 2,28,624 మందికి.

కవాసకీ వ్యాధి బాధితుడికి రూ.లక్ష ఆర్థిక సాయం

సీఎం ఆదేశాల మేరకు చెక్కు అందజేసిన ప్రకాశం జిల్లా కలెక్టర్



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: అరుదైన మల్టీసిస్టం ఇన్‌ఫ్లమేటరీ సిండ్రోమ్(కవాసకీ వ్యాధి)తో బాధపడుతున్న బాలుడి తల్లిదండ్రులకు సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ గురువారం రూ.లక్ష చెక్కు అందజేశారు. ఐదో విడత వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు జమ కార్యక్రమానికి సీఎం జగన్ ఈనెల 16న బాపట్ల జిల్లా నిజాంపట్నానికి వచ్చారు. ఆ సమయంలో ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన హృదయరంజన్, ఉషారాణి దంపతులు సీఎంను కలిసి తమ కుమారుడి అనారోగ్య పరిస్థితిని వివరించారు. సీఎం జగన్ స్పందిస్తూ.. ప్రభుత్వం తరఫున తగిన వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు. తక్షణ ఆర్థిక సాయంగా రూ.లక్ష అందించాలని అధికారులను ఆదేశించారు.

అమరావతిలో శరవేగంగా లేఅవుట్ల అభివృద్ధి




లే అవుట్లను పరిశీలిస్తున్న కమిషనర్

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని పేదల కోసం సీఆర్డీఏ పరిధిలో కేటాయించిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' లే అవుట్లను వేగంగా పూర్తిచేయాలని సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. రెండు జిల్లాలోని అర్హులైన నిరుపేదలకు నిడమర్రు, కృష్ణాయపాలెం, నవులూరు, ఐనవోలు, మందడం, కురగల్లు, యర్రబాలెం, పిచ్చుకలపాలెం, బోరుపాలెం, నెక్కల్లు, అనంతవరం ప్రాంతాల్లో 1,402.58 ఎకరాల్లో 25 లేఅవుట్లను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 51,392 మంది లబ్ధిదారులకు శరవేగంగా ప్లాట్లు సిద్ధం చేస్తున్నారు. పిచ్చుకలపాలెంలో జరుగుతున్న పనులను గురువారం వివేక్‌యాదవ్ పరిశీలించారు.

కోతల్లేని కరెంట్

వ్యవసాయానికి 18.49 లక్షల వ్యవసాయ సర్వీసులకు పగటి పూటే 9 గంటలు నిరంతర విద్యుత్ అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో 7 వేల మెగా వాట్ల కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. దీంతోపాటు రూ.1700 కోట్లతో ఫీడర్లను అప్‌గ్రేడ్ చేసింది. తద్వారా 30 ఏళ్ల పాటు రైతులకు ఉచిత విద్యుత్‌కు ఎలాంటి ఢోకా లేకుండా ఏర్పాటు చేసింది. పరిశ్రమలకూ ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తోంది.





సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ, ఎక్కడా కోతలన్నదే లేకుండా సరఫరా సవ్యంగా సాగుతోంది. ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పెరగడం, ఎండలు మండిపోతుండటం వల్ల విద్యుత్ వినియోగం అమాంతం పెరిగింది. అయినా కాసేపు కూడా విద్యుత్ కోత లేకుండా నిరంతరాయంగా సరఫరా జరిగేలా సీఎం వైఎస్ జగన్ ముందు చూపుతో వ్యవహరించారు. గత సంవత్సరం గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే ఇప్పుడు 27.51 శాతం అధికంగా ఉంది. ఉష్ణోగ్రత 46 డిగ్రీలు దాటుతోంది. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఫలితంగా ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటి గృహోపకరణాలు నిరంతరం పని చేస్తున్నాయి. ఎక్కువ సమయం ఇంట్లోనే గడపడం వల్ల మిక్సీలు, గ్రైండర్లు, టీవీలు, కంప్యూటర్ల వినియోగం కూడా అధికంగానే ఉంటోంది. మరోవైపు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం రాకార్డు స్థాయిలో పెరిగిపోయింది. రోజువారీ డిమాండ్ 248.985 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గత ఏడాది ఇదే సమయానికి 195.266 మిలియన్ యూనిట్లుగా ఉండింది. రోజులో పీక్ డిమాండ్ 12,482 మెగావాట్లుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 9308 మెగావాట్లు మాత్రమే. అంటే 34.10 శాతం పెరిగింది. పగటి పూట సగటు పీక్ డిమాండ్ 10,374 మెగావాట్లు, సాయంత్రం వేళల్లో 9,582 మెగావాట్లకు చేరుకుంది. అయినప్పటికీ గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా, డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సంస్థలు వినియోగదారులకు నిరంతరం కరెంట్ సరఫరా చేస్తున్నాయి. ఇలా దేశంలోనే ఎక్కడా జరగడం లేదని, రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తోందని చెప్పడానికి ఇదొక పెరామీటర్‌గా చెప్పవచ్చని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

వాస్తవాలు మరచి దుష్ప్రచారం

ఎక్కడా విద్యుత్ కోతలు లేకపోయినప్పటికీ చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేలా ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వం హయాంలో విద్యుత్ సరఫరా దుస్థితిని వ్యూహాత్మకంగా విస్మరిస్తోంది. గంటల తరబడి కోతలు విధించారనే విషయాన్ని దాస్తోంది. అప్పట్లో వేసవిలో కరెంటు పరిస్థితి చెప్పనలవి కాదు. వేసవిలో కాకుండా కూడా కోతలు విధించిన రోజులున్నాయి. పరిశ్రమలకైతే ఏకంగా పవర్ హాలిడేలు ఇచ్చారు. వారంలో మూడు రోజులు పరిశ్రమలన్నింటికీ తాళం వేయాల్సి వచ్చేది. జిరాక్స్ మిషన్లు, పిండి మరలు, కూల్ డ్రింక్స్ దుకాణాలు, కూలింగ్ వాటర్ ప్లాంట్లు గంటల తరబడి పని చేయక చిరు వ్యాపారులు నష్టాలు చవిచూశారు. విద్యుత్ కోతల గురించి మాట్లాడితే అప్పటి ప్రభుత్వ పెద్దలు, మంత్రులు దబాయించే వారు. 'ఎండా కాలం.. ఆ మాత్రం విద్యుత్ కోత ఉండదా.. ఇప్పుడే కొత్తగా కోతలు విధిస్తున్నా.. ఇది వరకు కోతల్లేవా' అని ఎదురు దాడికి దిగేవారు. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ సీఎం జగన్ ప్రభుత్వం కోత అన్నదే లేకుండా విద్యుత్ సరఫరా చేస్తుంటే ఎల్లో మీడియాకు కడుపు మండుతోంది. వంకర బుద్ధి చూపిస్తూ.. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో విద్యుత్ పోయిన ప్రాంతాలను చూపుతూ దుష్ప్రచారం చేస్తోంది.

ముందు చూపుతో విద్యుత్ కొనుగోలు

ప్రస్తుతం ఏపీజెన్కో థర్మల్ నుంచి 89.981 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 5.414 మి.యూ, సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్ల నుంచి 43.012 మి.యూ, సెయిల్, హెచ్‌పీసీఎల్, గ్యాస్ వంటి ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ల నుంచి 28.510 మి.యూ, సోలార్ నుంచి 25.605 మి.యూ, విండ్ నుంచి 11.591 మి.యూ, ఇతర మార్గాల్లో 1.496 మిలియన్ యూనిట్లు చొప్పున విద్యుత్ సమకూరుతోంది. అయితే ఇది మాత్రమే సరిపోవడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్ సగటు రేటు రూ.7.537 చొప్పున రూ.33.936 కోట్లతో 45.023 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ప్రతి రోజూ కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ విధంగా డిమాండ్‌ను అందుకోలేక భారీగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. జార్ఖండ్‌లో 4.62 మి.యూ, హర్యానాలో 2.64 మి.యూ, ఉత్తరప్రదేశ్‌లో 2.03 మి.యూ, కర్ణాటకలో 1.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఏర్పడింది.

రాష్ట్రంలో విద్యుత్ లభ్యత

ఉత్పత్తి	ఉత్పత్తి సామర్థ్యం (మెగావాట్లు)	విద్యుత్ సరఫరా (మిలియన్ యూనిట్లు)
వీటీపీఎస్	1,760	20.38
ఆర్‌టీపీపీ	1,650	33.37
ఎస్‌డీఎస్‌టీపీఎస్	2,400	36.18
హిందూజా,సెయిల్	1,865	28.51
సెంట్రల్	1,980	43.10
హైడల్	1,773	5.40
సోలార్	3,756	25.60
విండ్	3,639	11.60
ఇతరం	232	1.49
మార్కెట్ కొనుగోళ్లు	----	43.37
మొత్తం	19055	249

గత ప్రభుత్వ హయాంలో కోతలిలా

ఏడాది	మిలియన్ యూనిట్లు
2014-15	2202.07
2015-16	20.98
2016-17	34.89
2017-18	10.06
2018-19	6.50

సరిపడా బొగ్గు నిల్వలు

దేశంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 70 శాతం థర్మల్ నుంచే వస్తోంది. ఇందులో ఇప్పుడు వినియోగిస్తున్న బొగ్గుకు దాదాపు 40 శాతం నుంచి 50 శాతం అదనంగా బొగ్గును సమకూర్చుకోవాలని, విదేశీ బొగ్గును 6 శాతం దిగుమతి చేసుకుని స్వదేశీ బొగ్గుతో కలిపి వాడుకోవాలని కేంద్రం చెప్పింది. అందుకు అనుగుణంగా రైల్వే ర్యాక్స్‌ను పెంచాలని ఏపీజెన్‌కో, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని, రైల్వేను కోరాయి. 14 రైల్వే ర్యాకులు సరిపోవడం లేదని, వీటితో పాటు మరో ఆరు ర్యాకులు పెంచాలని అడిగాయి. దీంతో మరో మూడు ర్యాకులు అదనంగా వచ్చాయి. వీటి ద్వారా మహానది కోల్ ఫీల్డ్స్ నుంచి, సింగరేణి కాలరీస్ నుంచి బొగ్గును తీసుకువస్తున్నారు. ఫలితంగా ప్రస్తుతం వీటీపీఎస్‌లో 83,479 మెట్రిక్ టన్నులు, ఆర్టీపీపీలో 30,001 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నంలో 29,000 మెట్రిక్ టన్నులు, హిందూజా వద్ద 19200 మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి.

యుద్ధ ప్రాతిపదికన వీటీపీఎస్ పునరుద్ధరణ

సోలార్ ఉత్పత్తి చాలా తక్కువగా ఉన్నప్పుడు, థర్మల్ జనరేటర్లు పీక్ లోడ్‌లో పని చేస్తున్నప్పుడు వీటీపీఎస్ వద్ద జనరేటర్‌లు ఈ నెల 17వ తేదీ రాత్రి 7 గంటలకు ట్రిప్ అయ్యాయి. పవన, సౌర విద్యుత్ ఉత్పత్తి ఆ రోజు వాతావరణం, సమయం మీద ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం రిజర్వాయర్ మట్టం తక్కువగా ఉన్నందున శ్రీశైలంలో హైడల్ ఉత్పత్తి అందుబాటులో లేదు. గ్యాస్ పరిమితి కారణంగా గ్యాస్ స్టేషన్ల నుంచి ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్‌ను కొనుగోలు చేసి మరీ ప్రజలకు అందించారు. అదే సమయంలో వీటీపీఎస్‌లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు.

ప్రతి ఇంటికీ నిరంతర విద్యుత్



పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ సరఫరాలో తలెత్తే సాధారణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నాం. ఎండ విపరీతంగా ఉండటం వల్ల ఇన్సులేటర్లు, సీటీఎస్ వంటి పరికరాలు కాలిపోయి సబ్‌స్టేషన్, లైన్లు దెబ్బతింటున్నాయి. వాటి వల్ల ఏర్పడే బ్రేక్‌డౌన్‌లను వెంటనే పరిశీలించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

– కె.విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

నాలుగు గంటల్లోనే పునరుద్ధరించాం



విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్‌లోని 1,550 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 6 థర్మల్ ప్లాంట్ యూనిట్లలో ఏర్పడ్డ సాంకేతిక సమస్యను కేవలం 4 గంటల రికార్డు సమయంలో పరిష్కరించి ఉత్పత్తిని పునరుద్ధరించాం. రాష్ట్రంలో పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తీర్చడానికి థర్మల్ ఉత్పత్తి యూనిట్ల నుండి 100 శాతం ఉత్పత్తిని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ఏపీ జెన్‌కో పని చేస్తోంది. మరో పది రోజుల్లో 800 మెగావాట్ల వీటీపీఎస్ యూనిట్–3ని ప్రారంభించడానికి చర్యలు చేపట్టాం.

– కేవీఎస్ చక్రధర్ బాబు, ఎండీ, ఏపీజెన్‌కో

కోతల్లేకుండా ఇదే ప్రథమం



మాది పాలిమర్ ప్రాసెసింగ్ యూనిట్. రోజుకు 500 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగిస్తుంటాం. అయినప్పటికీ ఈ వేసవిలో ఏ రోజూ విద్యుత్ కొరత రాలేదు. ప్రతి రోజూ 12 గంటలకు తక్కువ కాకుండా మా యూనిట్ పని చేస్తుంది. ఒక్కో రోజు 24 గంటలూ నడుపుతుంటాం. ఎప్పుడూ విద్యుత్ సరఫరాకు ఇబ్బంది రాలేదు. గతంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండేవి. గంటల తరబడి మిషన్లు ఆపితే తిరిగి అవి వేడెక్కేందుకు చాలా సమయం పట్టేది. మధ్యలో ఆగిపోవడం వల్ల సరుకు పాడయ్యేది. ఇప్పుడు ఆ బాధలే లేవు.

– ఐ.సురేష్ బాబు, పారిశ్రామికవేత్త, విశాఖపట్నం జిల్లా

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు



నేను 300 ఎకరాల చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నాను. ఏ మాత్రం విద్యుత్ సరఫరా ఆగినా చాలా ఇబ్బంది పడిపోతాం. గతంలో అలాగే చాలా నష్టపోయాం. అప్పట్లో కరెంటు కోతలు ఎక్కువగా ఉండేవి. జనరేటర్లు పెట్టుకునే వాళ్లం. డీజిల్ మోటార్లతో నీరు తోడుకునేవాళ్లం. దానివల్ల పెట్టుబడి ఖర్చులు ఎక్కువయ్యేవి. చేతికొచ్చేది ఏమీ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆక్వాకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ను సబ్సిడీతో అందించడంతో పాటు విద్యుత్ కోతలు లేకుండా మా వంటి రైతులకు మేలు చేస్తోంది.

– నరసింహారావు, ఆక్వా రైతు, ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా

క్లుప్తంగా...

ఎన్టీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం



ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్‌లో 7 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం అధిక ఉష్ణోగ్రతతో సీటీ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం తలెత్తి 6 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఒక యూనిట్ మాత్రమే నడిచింది. ఇంజినీర్ల బృందం గంటల వ్యవధిలో సమస్య పరిష్కరించి 7 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చేశారు. గురువారం సాయంత్రం 7 గంటలకు 7 యూనిట్లలో 1,760 మెగావాట్లకు గాను 1,673.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు.

గంగిరెడ్డి 'బెయిలు' షరతులపై పిటిషన్ వెకేషన్ బెంచ్‌కి

సునీత పిటిషన్‌పై సీజేఐ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ఎర్ర గంగిరెడ్డి బెయిలు రద్దుచేస్తూ హైకోర్టు పేర్కొన్న షరతును సవాల్ చేస్తూ సునీత నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ విచారిస్తుందని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పేర్కొన్నారు. ఎర్ర గంగిరెడ్డి డీఫాల్ట్ బెయిలు రద్దుచేస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. అయితే.. జూన్ 30లోగా దర్యాప్తును పూర్తిచేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో జూలై 1న గంగిరెడ్డిని బెయిలుపై విడుదల చేయాలని హైకోర్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ జె.బి.పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సమయంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల పట్ల సీజేఐ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎర్ర గంగిరెడ్డికి, సీబీఐకి నోటీసులు జారీచేస్తూ వారం రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ వెకేషన్ బెంచ్ చేపడుతుందని సీజేఐ పేర్కొన్నారు.

ఏం చేస్తారు? పీక్కుంటారా?: చంద్రబాబు




ఎస్.కోటలో చంద్రబాబు సభ జరుగుతుండగా రోడ్డుపై దూరంగా కూర్చున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'ప్రతిరోజూ చెబుతున్నారు నా మీద కేసు పెడతామని, ఏం చేస్తారు? పీక్కుంటారా? అంటూ చంద్రబాబు దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. తనను భయపెడుతున్నారని చెప్పారు. అమరావతి రైతులపై కేసులు పెట్టి బెదిరిస్తున్నారన్నారు. 'రాష్ట్రానికి ఇదేమి ఖర్మ' కార్యక్రమంలో భాగంగా గురువారం విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటించారు. తొలుత విశాఖ జిల్లా పెందుర్తి నుంచి కొత్తవలస మీదు ఎస్.కోట చేరుకున్నారు. నిత్యావసర వస్తువుల ధరలను దారుణంగా పెంచారంటూ రాష్ట్ర ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కారు. మానవత్వం ఉన్న ముఖ్యమంత్రి ఎవరైనా అయితే ఒక్కసారి మాత్రమే కరెంట్ చార్జీలు పెంచుతారని, కానీ.. ఈ ముఖ్యమంత్రి (వైఎస్ జగన్) 8 సార్లు పెంచారంటూ ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి రక్తం తాగే ముఖ్యమంత్రి అని, ఆరోగ్యం పాడుచేసే ముఖ్యమంత్రి అని ఆరోపించారు. తన పాలనలో ఇసుకను ఎవరు తీసుకెళ్లినా అడగలేదని, ఇప్పుడు లారీకి రూ.70వేలు పెట్టి కొనాల్సి వస్తోందని అన్నారు. ఉత్తరాంధ్రలో తాను ప్రాజెక్టులు తెస్తే ఇప్పుడీ ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు.

కేజ్ కల్చర్‌ను తీసుకొచ్చింది టీడీపీనే

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో తొలిసారిగా కేజ్ కల్చర్‌ని టీడీపీ ప్రభుత్వమే తీసుకొచ్చిందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా వేపగుంటలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో మత్స్యకారులు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో చంద్రబాబు గురువారం మధ్యాహ్నం ముఖాముఖి నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్ జగన్ పేదలందరికీ ఒకే చోట ఇళ్లు ఇస్తామని చెప్పి.. అమరావతి ప్రాంతాన్ని మురికి కొంపగా తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేదల ఇళ్లపై చంద్రబాబు మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. ముఖాముఖి జరుగుతున్న సమయంలో కార్యకర్తలు బయటకు వెళ్లిపోతుండగా చంద్రబాబు వారిపై రుసరుసలాడారు.

నవలి రిజర్వాయర్ మళ్లీ తెరపైకి..



తుంగభద్ర డ్యామ్

పూడికవల్ల 133 నుంచి 105.78 టీఎంసీలకు తగ్గిన తుంగభద్ర డ్యామ్ నిల్వ సామర్థ్యం

- తగ్గిన నిల్వ సామర్థ్యం మేరకు నవలి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తామన్న కర్ణాటక
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల తీవ్ర అభ్యంతరం
- నేటి సర్వసభ్య సమావేశంలో చర్చించనున్న తుంగభద్ర బోర్డు

సాక్షి, అమరావతి: తుంగభద్ర డ్యామ్‌లో పూడికవల్ల తగ్గిన నీటినిల్వ సామర్థ్యం మేరకు.. డ్యామ్‌కు ఎగువన నవలి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతివ్వాలని తుంగభద్ర బోర్డుకు మరోసారి కర్ణాటక సర్కార్ ప్రతిపాదించింది. నవలి రిజర్వాయర్‌ను నిర్మిస్తే తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కర్ణాటక ప్రతిపాదనను తోసిపుచ్చాయి. కానీ, కర్ణాటక సర్కార్ మళ్లీ చేసిన ఆ రిజర్వాయర్ ప్రతిపాదనపై హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించనున్న 219వ సర్వసభ్య సమావేశంలో చర్చించాలని తుంగభద్ర బోర్డు చైర్మన్ డీఎం రాయ్‌పురే నిర్ణయించారు. కొత్త నీటి సంవత్సరం (2023–24)లో తుంగభద్ర డ్యామ్‌లో నీటి పంపిణీ ప్రధాన అజెండాగా తుంగభద్ర బోర్డు సమావేశమవుతోంది. రాయ్‌పురే అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణల ఈఎన్‌సీలు సి.నారాయణరెడ్డి, మురళీధర్ పాల్గొననున్నారు.

దామాషా పద్ధతిలో నీటి పంపిణీ..

అంతర్రాష్ట్ర ప్రాజెక్టు తుంగభద్ర డ్యామ్‌ను 133 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 1953లో నిర్మించారు. డ్యామ్ వద్ద 75 శాతం నీటి లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్.. కర్ణాటకకు 151.49, ఆంధ్రప్రదేశ్‌కు 72, తెలంగాణకు 6.51 టీఎంసీలను కేటాయించింది. పూడిక పేరుకుపోవడంవల్ల డ్యామ్‌లో నీటినిల్వ 105.78 టీఎంసీలకు తగ్గింది. దాంతో నీటి లభ్యత కూడా తగ్గింది. ఈ నేపథ్యంలో డ్యామ్‌లో నీటి లభ్యత ఆధారంగా మూడు రాష్ట్రాలకు దామాషా పద్ధతిలో జలాలను తుంగభద్ర బోర్డు పంపిణీ చేస్తోంది.

వాటా జలాలను వాడుకోవడం పేరుతో..

డ్యామ్‌లో పూడిక పేరుకుపోవడంవల్ల మూడు రాష్ట్రాలు ఏటా సగటున 167–175 టీఎంసీలకు మించి వాడుకోలేకపోతున్నామని కర్ణాటక సర్కార్ చెబుతోంది. పూడిక తీయడానికి రూ.12,500 కోట్లు వ్యయమవుతుందని లెక్కలువేస్తోంది. దీనికి బదులు తుంగభద్ర డ్యామ్‌కు ఎగువన నది నుంచి వరద కాలువ తవ్వి నవలి వద్ద కొత్తగా 52 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తామని చెబుతోంది. దీంతోపాటు విఠల్‌పుర చెరువు సామర్థ్యాన్ని 4.52 టీఎంసీలకు, శివపుర చెరువు సామర్థ్యాన్ని 1.56 టీఎంసీలకు పెంచి ఎడమ కాలువ కింద ఆయకట్టును స్థిరీకరిస్తామని.. తుంగభద్ర డ్యామ్‌లో నిల్వఉన్న నీటితో మిగతా వాటా జలాలను వాడుకోవచ్చునని కర్ణాటక ప్రతిపాదిస్తోంది. ఈ రిజర్వాయర్ పనులకు రూ.9,500 కోట్ల వ్యయం అవుతుందని.. దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలు భరించాలని తుంగభద్ర బోర్డు సమావేశాల్లో కోరుతూ వస్తోంది.

వ్యతిరేకిస్తున్న రెండు రాష్ట్రాలు..

నవలి రిజర్వాయర్‌ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యతిరేకిస్తున్నాయి. అప్పర్ భద్ర, సింగటలూరు ఎత్తిపోతల ద్వారా ఇప్పటికే కేటాయించిన నీటికంటే అధికంగా కర్ణాటక వాడుకుంటోందని.. నవలి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తే తమ హక్కులకు విఘాతం కలుగుతుందని స్పష్టంచేస్తున్నాయి. తుంగభద్ర హెచ్చెల్సీ (ఎగువ కాలువ)కు సమాంతరంగా వరద కాలువ తవ్వి.. వరద రోజుల్లో వాటా (32.5 టీఎంసీలు) తరలిస్తామని.. డ్యామ్‌లో నిల్వ నీటిని మూడు రాష్ట్రాలు పంచుకోవడం ద్వారా పూర్తిస్థాయిలో వాటా జలాలను వాడుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెబుతూ వస్తోంది.

అక్రమాలకు పాల్పడిన ఇద్దరు వైద్యుల సస్పెన్షన్

సాక్షి, అమరావతి: హాజరు విషయంలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు వైద్యులపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) సస్పెన్షన్ వేటు వేశారు. కడప జీజీహెచ్ ఆర్థో విభాగంలో పనిచేసే అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మహిధర్ రెడ్డి, డాక్టర్ హనుమంతు కృత్రిమ వేలిముద్రలను తయారు చేసి పక్క వారితో బయోమెట్రిక్ హాజరును వేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై సూపరింటెండెంట్ విచారణ చేపట్టారు. ఇందులో ప్రాథమికంగా ఆరోపణలు రుజువవ్వడంతో వైద్యులను సస్పెండ్ చేసినట్టు డీఎంఈ డాక్టర్ నరసింహం తెలిపారు. తదుపరి చర్యల్లో భాగంగా విచారణకు ఆదేశించామన్నారు. విజయవాడ జీజీహెచ్‌లోను ఏడాదిగా బయోమెట్రిక్ హాజరు వేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వైద్యురాలిని ఏలూరుకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

లోకేశ్‌కు ఎంఆర్‌ఐ స్కానింగ్

నంద్యాల టౌన్: యువగళం పాదయాత్రలో భాగంగా నంద్యాలకు చేరుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు గురువారం ఉదయం పట్టణంలోని మ్యాగ్న ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్‌లో వైద్యులు ఎంఆర్‌ఐ స్కానింగ్ చేశారు. పాదయాత్రలో భాగంగా కొంత కాలంగా కుడి భుజం నొప్పితో బాధపడుతున్న ఆయన వైద్యుల సూచన మేరకు స్కానింగ్ చేయించుకున్నట్టు టీడీపీ నేతలు తెలిపారు.

మండుతున్న సూరీడు

- రాష్ట్రంలో కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు
- గురువారం కసుమూరులో 45.1 డిగ్రీలు నమోదు
- నేడు కూడా ఎండలు ఎక్కువే
- వడగాడ్పులూ వీస్తాయి
- వృద్ధులు, బాలలు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



నిర్మానుష్యంగా ఉన్న అనంతపురంలోని రామ్‌నగర్ బ్రిడ్జి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భానుడు భగభగలాడుతున్నాడు. అధిక ఉష్ణోగ్రతలకు తోడు వేడిగాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరులో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు, శ్రీకాకుళం, వైఎస్సార్ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. అత్యల్పంగా విశాఖపట్నం (గంభీరం)లో 38.9, కోనసీమ అంబేడ్కర్ జిల్లా(అంగర)లో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం, వల్లూరు మండలంలో తీవ్ర వడగాడ్పులు వీచాయని, మరో 27 మండలాల్లో వడగాడ్పులు వీచాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం 29 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉండనుంది. అనకాపల్లి జిల్లాలో 5, గుంటూరులో ఒకటి, కాకినాడలో ఒకటి, ఎన్టీఆర్ జిల్లాలో 2, పల్నాడులో 2, మన్యంలో 5, విజయనగరంలో 5, వైఎస్సార్ జిల్లాలో 8 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. శనివారమూ 33 మండలాల్లో వడగాడ్పులు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

నేడు 44 నుంచి 45 డిగ్రీల వరకు

శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 42 నుంచి 43 డిగ్రీలు, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 40 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండనున్నాయి. గర్భిణులు, చిన్నారులు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు వహించాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.



గురువారం అత్యధిక ఉష్ణోగ్రతలు ఇలా..

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	కసుమూరు	45.1
పల్నాడు	విజయపురి సౌత్	45.0
శ్రీకాకుళం	కొత్తూరు	45.0
వైఎస్సార్	కొంగలవీడు	45.0
ప్రకాశం	ఉప్పలపాడు	44.6
తిరుపతి	రేణిగుంట	44.6
కర్నూలు	మంత్రాలయం	44.5
నంద్యాల	అహోబిలం	44.5
అన్నమయ్య	ఖంబలకుంట	43.8
ఎన్టీఆర్	చిల్లకల్లు	43.4

దిగజారుడు జర్నలిజానికి పరాకాష్ట

▶ మొదటి పేజీ తరువాయి

మళ్లీ పచ్చి అబద్ధాలను ప్రచురించిందన్నారు. ఏదో ఒకవిధంగా ముఖ్యమంత్రి జగన్ పేరును లాగాలనే ప్రయత్నం మినహా ఆంధ్రజ్యోతి కథనాల్లో వాస్తవాలు లేవని స్పష్టం చేశారు. విశ్వసనీయ వర్గాలంటూ తప్పుడు సమాచారంతో ఆ పత్రిక విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. సీబీఐ తనను విచారించిందంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తను గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అజేయ కల్లం తీవ్రంగా ఖండించారు. కొద్దిరోజుల క్రితం సీబీఐ ఎస్పీ తన ఇంటికి వచ్చి ఐదు నిమిషాలు మాట్లాడి సమాచారం తీసుకున్నారని, ఆ సమయంలో గుండెపోటు అంశం చర్చకే రాలేదని, దాని గురించి అడగలేదని అజేయ కల్లం వెల్లడించారు. వైఎస్ వివేకానందరెడ్డి మృతి చెందిన రోజు యాదృచ్ఛికంగా పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతోందన్నారు. తమకు కాలేజీలో పాఠాలు బోధించిన గురువు, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మేనిఫెస్టో రూపకల్పనలో సహాయం చేయాలని కోరడంతో సమావేశానికి వెళ్లానని అజేయ కల్లం తెలిపారు. సమావేశం జరుగుతుండగా కొంతసేపటికి 'వివేకానందరెడ్డి గారు నో మోర్..' అని ఇంగ్లీషులో చెప్పడంతో ఇక లేచి వచ్చేశామన్నారు. అదే విషయాన్ని సీబీఐ ఎస్పీకి చెప్పానన్నారు. 'మీరు స్వచ్ఛందంగా అంగీకరిస్తే రికార్డు చేసుకుంటామని సీబీఐ ఎస్పీ కోరారు. సెక్షన్ 161 కింద సమాచారాన్ని అడిగారు. అయితే ఆ సమాచారం, రికార్డుకు ఎటువంటి న్యాయపరమైన విలువ ఉండదు. సంతకాలు తీసుకోలేదు' అని అజేయ కల్లం పేర్కొన్నారు. 'సాంకేతికంగా ఎటువంటి విలువ ఉండదు. ఎవిడెన్స్‌గా పనికిరాదు. ఆ సెక్షన్ కింద కొన్ని అంశాలు యాడ్ చేసుకోవచ్చు, కొన్ని అంశాలు తొలగించవచ్చు' అని అజేయ కల్లం తెలిపారు.

గుండెపోటు మాటే చర్చకు రాలేదు..

అసలు గుండె పోటు అనే పదమే సీబీఐ ఎస్పీని కలుసుకున్న సందర్భంగా చర్చకు రాలేదని అజేయ కల్లం స్పష్టం చేశారు. కేసు దర్యాప్తులో ఉన్న సమయంలో రహస్యంగా ఉండాల్సిన తమ ఇద్దరి సంభాషణ సమాచారం లీకుల పేరుతో ఆంధ్రజ్యోతిలో రావడం అంటే సీబీఐ విశ్వసనీయత కూడా దెబ్బతిన్నట్లేనని పేర్కొన్నారు. ఇది సీబీఐ పేరును దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. సీబీఐ ముందుకొచ్చి ఇలాంటి లీకు వార్తలను నిరోధించడంతో పాటు ఖండించాల్సి ఉందన్నారు. 'మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆ పనిమీద దృష్టి పెడతాం కానీ గడియారం చూసుకుంటూ కూర్చోం కదా! ఎవరు ఎప్పుడు బయటకు వెళ్లారో ఎలా తెలుస్తుంది? అయినా ఈ సమావేశాన్ని సీరియస్ మర్డర్ కేసుకు ముడిపెట్టి ఆంధ్రజ్యోతి తనకు కావాల్సినట్లు రాసుకోవడం కంటే అనైతికం మరొకటి ఉండదు..' అని ఆయన మండిపడ్డారు.

ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉంది

తన దగ్గర నుంచి తీసుకున్న సమాచారం చార్జిషీటు వేసేవరకు రహస్యంగా ఉండాలని, లీకుల పేరుతో తప్పుడు సమాచారం మీడియాలో ప్రచురితమైనందున ఆ వార్తను ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉందని అజేయ కల్లం పేర్కొన్నారు. తప్పుడు సమాచారంతో మీడియాలో సమాంతర దర్యాప్తు జరగకూడదని, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు మీడియాకు వివరాలు వెల్లడించరాదని సుప్రీంకోర్టు తీర్పులున్నాయన్నారు. నిందారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి కూడా అందుబాటులో లేని సమాచారాన్ని మీడియాలో లీకుల పేరుతో ప్రచురించకూడదన్నారు.

సమాంతర విచారణ తగదు..

ఏదైనా క్రిమినల్ కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడు దానికి సమాంతరంగా విచారణను ప్రభావితం చేసేలా మీడియా కథనాలను రాయకూడదు, చర్చలు పెట్టకూడదు. దర్యాప్తు సమయంలో విచారణాధికారికి సాక్షులు వెల్లడించిన అంశాలను చార్జిషీట్ వేసేవరకు బహిర్గతం చేయకూడదు. విచారణలో వెల్లడైన అంశాలను బహిర్గతం చేస్తూ కథనాలను ప్రచురిస్తే వ్యక్తిగత స్వేచ్ఛను హరించినట్లేనని పలు కేసుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులిచ్చాయి. దీన్ని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా స్వాగతించింది' అని పేర్కొంటూ ఈ సందర్భంగా అజేయ కల్లం వాటిని ఉదహరించారు.

నా భార్యకు కూడా తెలియదు..

'దర్యాప్తు అంశాలను ఇష్టానుసారం ప్రచురించేందుకు, మీడియా తమ ఇష్టం అనేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు తాజా తీర్పులున్నాయి. కనీస క్రమశిక్షణ, కోడ్ ఆఫ్ కాండక్ట్ మీడియాకు అవసరం. నేను సీబీఐ ఎస్పీకి చెప్పని అంశాలను చెప్పినట్లుగా నా ఫొటోతో పెద్ద శీర్షిక పెట్టి కథనాలు ప్రచురించటాన్ని బట్టి ఆ పత్రిక ఏ స్థాయికి దిగజారిందో తెలుస్తోంది. ఆ సమయంలో నేను, సీబీఐ ఎస్పీ మాత్రమే ఉన్నాం. మా ఇంటికి సీబీఐ ఎస్పీ వచ్చిన విషయం నా భార్యకు కూడా తెలియదు. ఆంధ్రజ్యోతిలో తప్పుడు వార్త ప్రచురించిన తర్వాతే మిగతా వారికి తెలిసింది' అని అజేయ కల్లం తెలిపారు. 'సెక్షన్ 161 కింద ఇచ్చిన సమాచారానికి న్యాయపరమైన విలువ లేదు. అయినా సాక్షిగా కూడా కాదు. తప్పుడు వార్తపై తగిన సమయంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటా' అని చెప్పారు.

పేదల ఇళ్లను సమాధులు అనడం దురహంకారం

అమ్మాజీ ధ్వజం

సాక్షి, అమరావతి: ఇళ్ల పట్టాలపై చంద్రబాబు, లోకేశ్‌ల వ్యాఖ్యలు అహంకారపూరితం అని ఏపీ స్టేట్ ఎస్సీ కార్పొరేషన్ (మాల) చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహా యజ్ఞంలా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబుకు కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. కోటి మంది నివాసం ఉండే ఆవాసాలను సమాధులు అని బాబు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. బాబు, లోకేశ్‌లు మాట్లాడితే ఆంధ్రజ్యోతిలో సెంటు కంపు అంటూ పిచ్చి రాతలు రాస్తారని విమర్శించారు.

సమాధులతో పోలుస్తావా?

చంద్రబాబును దేశ బహిష్కరణ చేసినా తప్పు లేదు: సజ్జల

సాక్షి, అమరావతి: సొంతింటి కలను సాకారం చేస్తూ పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సెంటు భూమిలో సమాధులు కట్టుకోవాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబును రాజకీయాల నుంచే కాకుండా దేశ బహిష్కరణ చేసినా తప్పు లేదని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. పేదలంటే ఎందుకంత చులకన? అని చంద్రబాబును నిలదీశారు. ఆధునిక సమాజంలో నివసిస్తున్నామనే కనీస స్పృహ లేకుండా విజ్ఞత కోల్పోయి పేదలపై అక్కసు వెళ్లగక్కారని ధ్వజమెత్తారు. ఓ రాజకీయ పార్టీకి అధ్యక్షుడిగా, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు లాంటి వ్యక్తి ఉండటం రాష్ట్రం దురదృష్టమన్నారు. చరిత్రలో తన చీకటి అధ్యాయాన్ని తానే రాసుకున్న వ్యక్తిగా చంద్రబాబు నిలిచిపోతారని చెప్పారు. సజ్జల గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదల సొంతింటి స్వప్నం కలగానే మిగిలిపోతోందన్నారు. దివంగత వైఎస్సార్ దేశంలోనే రికార్డు స్థాయిలో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి గృహాలను కూడా నిర్మించారని గుర్తుచేశారు. సీఎం జగన్ ఇప్పుడు అంతకంటే మిన్నగా అక్కచెల్లెమ్మలకు మేలు చేకూరుస్తున్నారని చెప్పారు. అంతర్గత రహదారులు, విద్యుత్, మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ లాంటి అత్యాధునిక వసతులతో 17,005 కాలనీల్లో 31 లక్షల మందికి ఇంటి స్థలాలను ఇచ్చి గృహ నిర్మాణాలను వేగవంతం చేశారన్నారు. చంద్రబాబు రాజకీయంగా కోలుకోలేని దెబ్బతినడంతో సీఎం జగన్‌పై ఉన్న అక్కసు, కసి, అసూయను పేదలపై చూపుతున్నారని దుయ్యబట్టారు. సెంటు భూమిలో సమాధులు కట్టుకోవాలంటూ అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో సీఎం జగన్ పక్షాన నిలిచిన పేదలు చంద్రబాబుకు రాజకీయంగా సమాధి కట్టారని, ఈదఫా టీడీపీని పాతిపెడతారని చెప్పారు.

ఐదేళ్లలో పేదలకు సెంటు భూమైనా ఇచ్చావా?

టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో పేదలకు చంద్రబాబు ఒక్క సెంటు భూమినైనా ఇచ్చారా? అని సజ్జల నిలదీశారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇచ్చామని ప్రగల్బాలు పలుకుతున్న ఆయన ఎక్కడిచ్చారో చూపాలని సవాల్ విసిరారు. ఐకానిక్ బ్రిడ్జిలు, హైపర్ లూప్‌లు లాంటి వాటిని గ్రాఫిక్స్‌లో చూపించే చంద్రబాబు ఏనాడూ పేదలకు మంచి చేద్దామనే ఆలోచన చేయలేదన్నారు. టిడ్కో ఇళ్లను 300 ఎస్ఎఫ్‌టీలో నిర్మించి ఇస్తానని చెప్పిన చంద్రబాబు పేదలపై రూ.ఏడు లక్షల భారాన్ని మోపారని గుర్తుచేశారు. ఆ ఇళ్ల నిర్మాణాన్ని కూడా అధిక ధరలతో టెండర్లు కట్టబెట్టి భారీ ఎత్తున కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. టిడ్కో ఇళ్లకు కనీస సదుపాయాలను కూడా కల్పించలేదన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్ల టెండర్లను రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించి పేదలకు ఉచితంగా ఇళ్లను అందజేస్తున్నారని చెప్పారు. జగనన్న కాలనీలను పక్కా ప్రణాళికతో అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నామన్నారు.

స్పందన లేకే ముందస్తు జపం..

తన పర్యటనలకు, లోకేశ్ పాదయాత్రకు ప్రజల నుంచి కాదు కదా కనీసం టీడీపీ కార్యకర్తల నుంచి కూడా స్పందన లేకపోవడంతో చంద్రబాబు ముందస్తు ఎన్నికల జపం చేస్తున్నారని సజ్జల ఎద్దేవా చేశారు. షెడ్యూలు ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని, పేదల పక్షాన నిలిచిన సీఎం జగన్‌ను ప్రజలు మరోసారి అఖండ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

కృష్ణారెడ్డి అర్హతపై స్పష్టతనిస్తాం: సుప్రీంకోర్టు

దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని ప్రశ్నిస్తూ ఎం.వి.కృష్ణారెడ్డి పిటిషన్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని ప్రశ్నించడానికి వివేకానందరెడ్డి వ్యక్తిగత సహాయకుడికి అర్హత ఉందా లేదా అనేది స్పష్టం చేస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని ప్రశ్నించడానికి తనకు అర్హత ఉందంటూ దేవిరెడ్డి శంకర్ రెడ్డి దాఖలుచేసిన ప్రధాన పిటిషన్‌లో ఎం.వి.కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎం.వి.కృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్‌చౌదరి వాదనలు వినిపిస్తూ.. హత్యకేసుకు సంబంధించి పిటిషనర్ ఫిర్యాదుతోనే ఎఫ్ఐఆర్ నమోదైందని తెలిపారు. కృష్ణారెడ్డికి ప్రశ్నించే అర్హత ఉందని, దీనిపై స్పష్టత కావాలని కోరారు. అనంతరం స్పష్టత ఇస్తామని ధర్మాసనం తెలిపింది. గతంలో ఇదే అంశంపై దేవిరెడ్డి శంకర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా నిందితులకు ఈ అంశంపై ప్రశ్నించే హక్కులేదని, తగిన వ్యక్తి ప్రశ్నిస్తే పరిశీలిస్తామని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయం విదితమే.

ప్రపంచం అన్నది మూడే రోజులు. నిన్నటి విషయానికి వస్తే అది అదృశ్యమై పోయింది. రేపు అన్న దానిని మీరు ఎన్నటికీ చూడకపోవచ్చు. ఇక ఈ రోజు విషయానికి వస్తే ఇది మీదే. కాబట్టి దానిపై పని చేయండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 19 మే 2023

దీర్ఘకాలిక డిజిటల్ ప్రమాదం

కళ్ళ ముందు జరుగుతున్నవి సైతం మరెవరో శాస్త్రీయ సర్వేలతో బలంగా చెబితే మనసుకు ఎక్కుతాయి. ప్రతి చిన్నారి చేతిలో స్మార్ట్‌ఫోన్ కనిపిస్తున్న ఈ రోజుల్లో వాటి ప్రభావం ఎలా ఉంటుందన్న విషయం అలాంటిదే. ఏ వయసులో పిల్లలకు తొలిసారిగా స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ అలవాటైందనే దాన్ని బట్టి పెద్దయ్యాక వారి మానసిక ఆరోగ్యం ఉంటుందన్న తాజా నిర్ధారణ అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. అమెరికాకు చెందిన సేపియన్ ల్యాబ్స్ సంస్థ సరికొత్త ప్రపంచ సర్వే ఈ కఠిన వాస్తవాన్ని కళ్ళ ముందుంచింది. పరిమితి దాటిన డిజిటల్ స్క్రీన్‌టైమ్, పగ్గాలు లేని సోషల్ మీడియా వినియోగం వల్ల ఒంటరితనం, బాధ, కోపం, చివరకు ఆత్మహత్యను ప్రేరేపిస్తున్న ఆలోచనలు సైతం పెరుగుతున్నాయని ఇప్పటికే అనేక పరిశోధనలు, అధ్యయనాలు తేల్చాయి. తాజా సర్వే సైతం ఈ దీర్ఘకాలిక డిజిటల్ ప్రమాదాన్ని ప్రపంచం ముందుకు తెచ్చింది.

పిల్లలు కళ్ళప్పగించి చూస్తున్న డిజిటల్ తెరలు కంటికే కాదు... పెద్దయ్యే కొద్దీ మనసుకూ చేటు చేస్తున్నాయని సర్వే చేసి ఈ సంస్థ తేల్చింది. ప్రస్తుతం 18 నుంచి 24 ఏళ్ళ వయసులో ఉన్న 28 వేల మంది పాలుపంచుకున్న ఈ సర్వే ప్రకారం మగవారి కన్నా ఆడవారిపై ఈ దుష్ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. చిన్నప్పుడే డిజిటల్ తెరలకు అలవాటు పడ్డవారు ఎదుగుతున్న కొద్దీ విషయ గ్రహణ శక్తి తగ్గి, సామాజిక అలవాట్లు మారుతున్నాయి. 'ఏజ్ ఆఫ్ ఫస్ట్ స్మార్ట్‌ఫోన్ అండ్ మెంటల్ వెల్‌బీయింగ్ అవుట్‌కమ్స్' అనే శీర్షికన వెలువడ్డ ఈ అధ్యయన సారాంశం ఒకటే – స్మార్ట్‌ఫోన్ల వాడకం ఎంత నిదానిస్తే, పిల్లల మానసిక ఆరోగ్యం అంత మెరుగ్గా ఉంటుంది. లేదంటే, భ్రమల్లో బతకడం, దుడుకుగా వ్యవహరించడం, ఆత్మహత్య ఆలోచనల లాంటివి హెచ్చుతాయి. దక్షిణాసియా సహా అనేక ప్రాంతాల్లో పరిస్థితి ఇదేనట. అంటే, భారత్‌కూ ఇదే వర్తిస్తుంది.

ఇరవై కోట్ల మందికి పైగా 15 నుంచి 25 ఏళ్ళ మధ్యవారున్న దేశంలో పాఠశాలల నుంచి పని ప్రదేశాల దాకా అన్నిచోట్లా ప్రభావం చూపే అంశమిది. అందుకనే ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం లాంటి అంశాలతో పాటు స్మార్ట్‌ఫోన్ల వినియోగానికి అనుమతించే వయసుపైనా దృష్టి పెట్టాలని ఓ వాదన. భారత్‌లో నూటికి 94 ఇళ్ళలో కనీసం ఒక మొబైల్ ఫోన్ ఉందని 2019– 21 నాటి 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే'. కరోనా అనంతరం ఫోన్లతో పాటు ఇంటర్నెట్ వినియోగమూ పెరిగింది. పిల్లలు డిజిటల్ స్క్రీన్లు చూసే సమయం కరోనా కాలానికి ముందుతో పోలిస్తే, రెట్టింపు దాటింది. 2020 – 2022 మధ్య 12 నుంచి 18 ఏళ్ళ లోపు పిల్లల స్క్రీన్‌టైమ్ 52 శాతం పెరిగిందని గత నవంబర్‌లో ఓ నివేదిక తేల్చింది. మానసిక ఆరోగ్య అధ్యయనాలు అవసరమంటున్నది అందుకే.

పొరుగునే ఉన్న పాకిస్తాన్‌లో నూటికి 80 మంది యువత సగటున రోజుకు ఆరు గంటలు డిజిటల్ పరికరాలతో గడుపుతూ, స్క్రీన్‌కు బానిసవుతోందని పాకిస్తాన్ టెలికమ్యూనికేషన్ అథారిటీ తాజా అధ్యయనం. కరోనా తర్వాత జీవితం క్రమంగా సాధారణ స్థితికి చేరుకున్నా, పెరిగిన ఈ స్క్రీన్‌టైమ్ భారత్ సహా అన్నిచోట్లా ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ఒకసారి ఎక్కువ సమయం డిజిటల్ పరికరాలను వాడడం అలవాటయ్యాక ఇక ఆ వీక్షణ సమయమే ఆ వ్యక్తి 'కనీస పరిధి'గా మారుతుంది. కరోనా రెండేళ్ళలో ఇంటికే పరిమితం కావాల్సిన పరిస్థితుల్లో పిల్లలకు ఆటాపాటా, ఆన్‌లైన్ చదువులూ అంతా డిజిటల్ పరికరాలే. అలా జీవితంలో అదనపు భాగమైన స్క్రీన్‌టైమే చివరకు అత్యవసర భాగమైపోయింది. స్క్రీన్‌టైమ్‌కీ, మానసిక ఒత్తిడి, ఆందోళనలకూ లంకె ఉందని నిపుణులు ఎప్పుడో తేల్చారు. మితిమీరిన స్క్రీన్‌టైమ్‌తో శారీరకంగా, మానసికంగా అలసిపోయి, పిల్లల మానసిక స్థితి దెబ్బతింటుంది. ఏదైనా అంశంపై ఏకాగ్ర దృష్టి పెట్టి, నేర్చుకొనే సామర్థ్యం తగ్గుతుంది. పడుకొనే ముందు స్క్రీన్‌లో చూసినవి కలత నిద్రకూ కారణమవుతున్నాయి.

భారీ టెక్‌సంస్థలకూ ఈ డిజిటల్ దుష్ప్రభావాల గురించి తెలుసు. డిజిటల్ తెరలకు అతుక్కుపోయి, సోషల్ మీడియాకు బానిసలైతే ఆరోగ్యం చెడుతుందన్న సంగతి సాక్షాత్తూ ఫేస్‌బుక్ సొంత రీసెర్చ్‌లోనే తేలింది. ఇన్‌స్టాగ్రామ్ వ్యసనంగా మారిన టీనేజ్ అమ్మాయిలు మానసిక ఆరోగ్యం పాలయ్యారు. 2021లోనే ప్రసిద్ధ వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆ సంగతి పేర్కొంది. కానీ, జనంలో చైతన్యం పెంచడానికి ఆ సంస్థలు చేస్తున్నది శూన్యం. లాభాపేక్షే ధ్యేయమైన వ్యాపారాన్ని పణంగా పెట్టి, అవి అలా ముందుకొస్తాయనుకోవడం అమాయకత్వమే. చిన్నప్పుడే ఫోన్లు చేతికివ్వడమంటే, చేతులారా డిజిటల్ మత్తుమందుకు బానిసల్ని చేసినట్టే! మారాం చేస్తున్న పిల్లల్ని ఆపడానికీ, ఆడుకో వడానికీ వీడియో గేమ్స్, స్మార్ట్‌ఫోన్లు అలవాటు చేసే బుద్ధిహీనతను వదిలించుకోవడం మన చేతిలో పనే!

తల్లితండ్రులే మొదటి గురువులు గనక వారు డిజిటల్ వినియోగాన్ని నియంత్రించుకుంటే, అదే పిల్లలకూ మార్గదర్శకమవుతుంది. ఇంట్లో అందరూ కలసి మాట్లాడుకుంటూ, మమతానురాగాలు పంచుకోవడం అనేక సమస్యలకు పరిష్కారం. మారుతున్న కాలంలో డిజిటల్ స్క్రీన్లతో సంపర్కం అనివార్యమని గ్రహిస్తూనే ఎంతసేపు, ఎలాంటివి చూస్తూ, ఎవరితో డిజిటల్ స్నేహాలు చేస్తున్నామనేది ముఖ్యం. ఈ అంశాల్ని తల్లితండ్రులు, బడిలో గురువులు గమనించి, మంచి మాటలతో పిల్లల్ని వర్చ్యువల్ లోకం నుంచి వాస్తవ ప్రపంచంలోకి మరల్చాలి. సురక్షితంగా, సమర్థంగా సాంకేతికతను వాడడం ఎలాగో నేర్పాలి. పుస్తక పఠనం, ఆటల లాంటి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించాలి. లేదంటే, ఇప్పటికే బస్సుల్లో, రైళ్ళలో సహా అన్నిచోట్లా పక్కనేం జరుగుతున్నా పట్టకుండా స్మార్ట్‌ఫోన్లు చూసుకుంటూ వేరే ప్రపంచంలో విహరిస్తున్న మనుషులు నిండిన సమాజం దుర్భరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** అమావాస్య రా.8.48 వరకు తదుపరి జ్యేష్ఠ శు.పాడ్యమి, **నక్షత్రం:** భరణి ఉ.7.11 వరకు తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.7.23 నుండి 9.02 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.55 వరకు తదుపరి ప.12.22 నుండి 1.14 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.38
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఇండో–పసిఫిక్ ప్రపంచ మథనం

విశ్లేషణ



ధ్రువ జైశంకర్

ఈ నెల మనం వరుసగా కొన్ని ప్రపంచస్థాయి సదస్సులను చూడబోతున్నాం. జీ7; దక్షిణ పసిఫిక్ దేశాలతో భారత్, అమెరికా సమావేశాలు వంటివి వీటిలో ముఖ్యమైనవి. ఈ క్రమంలో కొత్త పొత్తులు, భౌగోళిక రాజకీయ పోటీ, ప్రపంచ సమస్యలను పరిష్కరించడం కోసం పథకాల వంటివి చోటు చేసుకోనున్నాయి. జీ7 సభ్యదేశాలన్నింటితో సహకారం పెరుగుతున్న సమయంలో, 2019 నుంచి అతిథిగా హాజరవుతున్న భారత్... తాజాగా జీ7 దేశాల సదస్సులో పాల్గొననుంది. క్వాడ్‌లో అమెరికా, జపాన్‌లతో; ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ (టీటీసీ) ద్వారా యూరోపియన్ యూనియన్‌తో; బ్రిటన్, కెనడాలతో భారత్ ముందస్తు వాణిజ్య చర్చలు జరుపుతోంది.

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భారత్ అంతర్జాతీయ కార్యకలాపాలు, విస్తృతార్థంలో అంతర్జాతీయ వ్యవస్థ మారుతున్న స్వభావాన్ని పట్టి చూపే పలు నాయకుల సదస్సులకు ఈ నెల సాక్షీభూతం కానుంది. మొత్తంగా అవి కొంత కాలంగా వ్యక్తమవుతున్న కొన్ని ధోరణుల కలయికను సూచిస్తాయి. వాణిజ్య, ఆర్థిక పరస్పర ఆధారిత విధానాలు, చైనా అంతర్జాతీయ పాత్ర, భారత్ అంతర్జాతీయ భాగస్వామ్యాల సాపేక్ష ప్రాధాన్యత, ప్రపంచ ప్రధాన రాజకీయ లోపాలు వంటివన్నీ నిర్మాణాత్మక మార్పు లకు లోనయ్యాయి. అయితే, ఈ పరిణామాలు నిర్దిష్ట వ్యాఖ్యాతలతో పొసగడం లేదు. అవేమిటంటే, తప్పుడు సమానత్వాలకు అతుక్కు పోతున్న భారతీయులు. న్యూఢిల్లీతో సంబంధాలను క్రమం తప్పకుండా చిన్నచూపు చూస్తున్న అమెరికన్లు, బ్రస్సెల్స్, సింగపూర్, న్యూయార్క్ వంటి ప్రాంతాల్లోని వ్యక్తులు లేదా సంస్థలు గత ఆర్థిక, రాజకీయ క్రమాన్ని తిరిగి పొందాలని కోరుకోవడం వంటివి.

ఈ వారం హిరోషిమాలో జరగనున్న జీ7 దేశాల సమావేశంలో, ప్రపంచంలోనే అతిపెద్ద అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు చెందిన నాయకులు సమావేశం కానున్నారు. 1970ల నుంచి వీరు వార్షిక ప్రాతిపదికన సమావేశమవుతూ వస్తున్నారు. జీ7 అజెండాలో, నేటికీ కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం ప్రధానాంశంగా ఉంటుంది, ఈ గ్రూప్ దేశాలు రష్యాపై ఆంక్షలతోపాటు ఉక్రెయిన్ ప్రభుత్వం వెనుక నిలబడటం తెలిసిందే. అయితే అమెరికా, కెనడాలను మినహాయిస్తే తక్కిన దేశాలు సాపేక్ష ఆర్థిక పతనం దశలో ఉంటున్నాయి. అమెరికాయేతర జీ–7 సభ్యదేశాల సామూహిక స్థూల దేశీయోత్పత్తి 1992లో ఉన్న 52 శాతం నుంచి నేటికి 23 శాతానికి పడిపోయింది. ఒక ఉమ్మడి శక్తిగా, జీ7 ఐక్యత ఈరోజు మరింత విలువైనదైనా, వాటి బలం తక్కువగా ఉంటోంది.

జీ7 సభ్యదేశాలన్నింటితో సహకారం పెరుగుతున్న సమయంలో, 2019 నుంచి అతిథిగా హాజరవుతున్న భారత్... తాజాగా జీ7 దేశాల సదస్సులో పాల్గొననుంది. క్వాడ్‌లో అమెరికా, జపాన్‌తో, ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ (టీటీసీ) ద్వారా యూరోపియన్ యూనియన్‌తో, బ్రిటన్, కెనడాలతో భారత్ ముందస్తు వాణిజ్య చర్చలు జరుపుతోంది. సంక్లిష్టభరితమైన జనాభా, స్థూల ఆర్థికపరమైన సంధికాలంలో భారత అభివృద్ధిని, ఆర్థిక భద్రతా లక్ష్యాలను వేగవంతం చేయడం కోసం ఈ యంత్రాంగాలను ప్రభావితం చేయడం ప్రధానమైన అంశంగానే ఉంటుంది.

అదే సమయంలో ఉక్రెయిన్ యుద్ధం, భారత్ జీ20 అధ్యక్ష బాధ్యతల నేపథ్యంలోనూ, అభివృద్ధి చెందిన ప్రపంచం నుంచి స్వల్ప మార్పులనే గమనిస్తున్న భారత్‌కు జాతీయ, అంతర్జాతీయ సమస్యలను లేవనెత్తే అవకాశాన్ని జీ7 సదస్సు కల్పిస్తోంది. ఈ సమస్యలు



క్వాడ్ దేశాధినేతలు (ఫైల్ ఫొటో)

ఏమిటంటే, ఇంధన, ఆహార భద్రత; సరఫరా మార్గాల స్థితిస్థాపకత, వాతావరణం; ఆర్థిక, స్వావలంబన అభివృద్ధి, అంతర్జాతీయ సంస్థల సంస్కరణ, రుణ స్థిరత్వం వంటివి. కాగా, అమెరికా వడ్డీరేట్లు అధికంగా ఉడటం, డిజిటల్ కరెన్సీలు, చెల్లింపుల్లో ఆవిష్కరణలు, నిలకడ లేని వాణిజ్య అసమతుల్యతలు, అంతర్జాతీయ ఆంక్షలు వంటివి రానున్న సంవత్సరాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చుట్టుముట్టనున్నాయి.

హిరోషిమా సదస్సును దాటి చూస్తే, భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ లు దక్షిణ పసిఫిక్ దేశాల నాయకులతో సమావేశాల కోసం పాపువా న్యూ గినియాను సందర్శిస్తారని భావిస్తున్నారు. వాటి చిన్న సైజు, చిన్నచిన్న దీవుల్లోని జనాభా కారణంగా దక్షిణ పసిఫిక్ ప్రాంతాన్ని తరచుగా చిన్నచూపు చూస్తూ వచ్చారు. కానీ ప్రపంచ భూ ఉపరితలంలో ఈ ప్రాంతం ఆరింట ఒక వంతును కలిగి ఉంది. తైవాన్, అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలపై ప్రభావం చూపే విషయంలో చైనా పోటీ పడటాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఈ ప్రాంతం కూడా భౌగోళిక రాజకీయ హాట్ స్పాట్‌గా మారుతోంది. పైగా వాతావరణ సంక్షోభం, నిలకడైన రుణ విధానాలు, మత్స్య, ఖనిజ వనరులు వంటివాటికి ఈ ప్రాంతం కీలకమైనది.

భారత్ విషయానికి వస్తే, ఫోరమ్ ఆన్ ఇండియా పసిఫిక్ ఐలాండ్ కో–ఆపరేషన్ (ఎఫ్ఐపీఐసీ) ద్వారా 2014–2017లో ప్రారంభమైన మహమ్మారి సంబంధిత విరామం – వ్యాప్తి తర్వాత పోర్ట్ మోర్స్‌బీలో జరుగనున్న సదస్సు ఒక సహజమైన కొనసాగింపు. ఈ సంవత్సరాల్లో భారత ప్రధాని ఫిజీలో 14 దక్షిణ పసిఫిక్ ప్రాంత నాయకులను కలిశారు. వారందరికీ జైపూర్‌లో ఆతిథ్యమిచ్చారు. భారతీయ అభివృద్ధి, సహాయ పథకాలను ప్రదర్శించడానికి అది ఒక అవకాశం అవుతుంది. ఫిజీ, పాపువా న్యూ గినియాలలో రుజువైనట్లే, గ్లోబల్ సౌత్‌ని ప్రభావితం చేస్తున్న కొన్ని ఉమ్మడి సవాళ్లకు ప్రస్తుత భారతీయ ప్రతిపాదనలు పరిష్కారాలు కావచ్చు. అదే సమయంలో, అమెరికా భూభాగం కాని ఒక దక్షిణ పసిఫిక్ దేశానికి బైడెన్ ప్రయాణం ఆశ్చర్యకరంగా అమెరికా అధ్యక్షుడి ప్రథమ సందర్శన కానుంది. పైగా, ఒక ముఖ్యమైన ప్రాంతంపై వాషింగ్టన్ చాలాకాలం తర్వాత దృష్టి పెట్టినట్లవుతుంది.

చివరగా, ఆస్ట్రేలియాలో క్వాడ్ సదస్సుకు ఈ నెల సాక్షీభూతం కానుంది. గ్రూప్ లీడర్లు మూడోసారి వ్యక్తిగతంగా కలవనున్నారు. అమెరికా అధ్యక్షుడు వార్షిక ప్రాతిపదికన హాజరయ్యే కొన్ని అంతర్జాతీయ గ్రూప్ సమావేశాలు ఏవంటే, జీ7, జీ20, నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) ఆసియా పసిఫిక్ ఎకనమిక్ కో ఆపరేషన్, ఈస్ట్ ఆసియా సదస్సు, ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు. ఈ చిన్న జాబితాలో క్వాడ్ కొత్త చేరిక అన్నమాట.

2021లో అధ్యక్ష స్థాయి సమావేశంగా మొదటిసారి ఉనికిలోకి వచ్చిన క్వాడ్, మూడు కార్యాచరణ బృందాలను ఏర్పర్చింది. కానీ ఇప్పుడు దీని కార్యకలాపాలు 25 కార్యాచరణ బృందాలకు విస్తరించాయి. వీటిలో కొన్ని, క్వాడ్ ఫెలోషిప్స్ వంటి కొన్ని ఫలితాలను ఇప్పటికే ప్రదర్శించాయి. మరి కొన్ని సముద్రజలాల సమస్యలు, సైబర్ సెక్యూరిటీ, అంతర్జాతీయ రుణం వంటి అంశాల్లో సన్నిహిత సహకారానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. కొన్ని కార్యాచరణ బృందాలు ఇప్పటికీ చాలా అస్థిరంగా ఉంటున్నాయి. ఇకపోతే సరఫరా చైన్లు, సంక్లిష్ట టెక్నాలజీలు వంటి ఇతర అంశాల్లో సభ్యదేశాల మధ్య ద్వైపాక్షిక ప్రయత్నాలను ముందుకు తీసుకుపోవడానికి క్వాడ్ ఒక యంత్రాంగాన్ని ఏర్పర్చింది. వీటిలో అమెరికా, భారత్‌లతో ముడి పడి ఉన్న జాతీయ భద్రతా సలహాదారు నేతృత్వంలోని టెక్నాలజీ సంభాషణ, ఐసీఈటీ వంటివి ఉన్నాయి లేదా, ఇండో–పసిఫిక్ ఎకనమిక్ ఫ్రేమ్‌వర్క్ (ఐపీఈపీ), మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ (టిపి–ఎమ్‌డిఎ) వంటి అంశాలపై దేశాల విస్తృత సమితిని తీసు కొచ్చాయి. ఇవి, మరికొన్ని ప్రయత్నాలు సిడ్నీలో జరగనున్న సదస్సు నాటికి కొంత ప్రగతిని చవి చూస్తాయి కూడా. (అయితే అమెరికా అంతర్గత వ్యవహారాల వల్ల జో బైడెన్ ఆస్ట్రేలియా పర్యటనను రద్దు చేసుకోవడంతో క్వాడ్ సమావేశం ఆఖరు నిమిషంలో వాయిదా పడింది).

ఇక ఈ నెలలో జరగనున్న ఇండో–పసిఫిక్ అత్యున్నత సమావేశం సారాంశాన్ని చూస్తే, అంతర్జాతీయ వ్యవస్థలో కొన్ని కీలకమైన ప్రకంపనలను అవి ఎత్తిచూపనున్నాయి. ఈ ధోరణులను అభినందించే విషయంలో అనేక ప్రముఖ అంతర్జాతీయ వ్యాఖ్యాతలు ఘర్షించవచ్చు. కానీ ఆర్థిక సంబంధాల నూతన పోకడలు, కొత్త రంగాలు, భౌగోళిక–రాజకీయ పోటీ రూపాలు, ఈ సమస్యలను ఎదుర్కోవడానికి కొత్త యంత్రాంగాలు సీదాసాదాగా రూపుదిద్దుకుంటున్నాయి.

వ్యాసకర్త కార్యనిర్వాహక డైరెక్టర్, ఓఆర్ఎఫ్, అమెరికా
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో...)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

'సిద్ధ'హస్తుడు



'ఇవే నా చివరి ఎన్నికలు' అని సిద్ధరామయ్య 2013లో చెప్పారు. 2018లో చెప్పారు. 2033 లో కూడా ఆయన ఇదే మాట చెప్పినా ఆశ్చర్యం లేదు. దురాశకు అంతం ఉండదు. హద్దులూ ఉండవు.

– దినకరన్ రాజమణి, జర్నలిస్ట్

రిచ్ సర్కిల్



అంతర్ముఖులు తమ శక్తిని విలువైనదిగా తలచి, దాన్ని ఎవరికి ఖర్చు చేయాలో ఎంపిక చేసుకుంటారు. అది వారి జీవితానికి గొప్పతనాన్ని, అర్థవంతమైన సంబంధాలను ఏర్పచడానికి తోడ్పడుతుంది.

– ఎల్గార్ ఇస్రాఫిల్లీ, సక్సెస్ గురు

ఒక్కరమే బతకలేం



నెల్లాళ్ల క్రితం ఒక సన్నిహిత మిత్రుడి మరణం నన్ను ఒంటరితనంలో ముంచెత్తింది. కొంతమేరకు నా ఉపశమన దీపాలుగా నా పిల్లలు నిలిచారు. కానీ నన్ను నమ్మండి, సాధారణంగా ఉత్తర యూరప్, ప్రత్యేకంగా డెన్మార్క్ ఒంటరిగా ఉండటానికి ఎంత మాత్రమూ తగిన ప్రాంతాలు కావు.

– తజీష్ ఖైర్, రచయిత

ఇలా చెయ్యండి



అధిక రక్తపోటు సమస్యను తగ్గించడంలో వెల్లుల్లి చాలా ప్రభావవంతంగా పనిచేస్తుందని నిర్ధారణ అయింది. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో 4–5 వెల్లుల్లి రెబ్బల్ని తినడం చక్కని ఫలితాన్ని ఇస్తుంది.

– నిర్వాల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు

అతిక్రమణ



హిందూ మహా సముద్రంలో చైనా పడవలు బోల్తా పడ్డాయి. 39 మంది గల్లంతయ్యారు. పెద్ద ప్రశ్న... ఆ సముద్ర జలాల్లో చైనా పడవలు ఏం చేస్తున్నట్లు? పాకిస్థానీలను మోసుకెళుతున్నాయా? లేక, కాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఇషా గుప్తాను చూసేందుకు వెళుతున్నాయా?

– ప్రధుమాన్ ఫుకాన్, ట్రావెలర్

జెన్నీ వచ్చింది!



2018 తర్వాత తొలిసారిగా జెన్నీ కిమ్ ఒక పాటను విడుదల చేస్తున్నారు. ఆమె కొత్త పాటకు మద్దతుగా మా జెన్నీ అభిమానులం అంతా నిధులు సేకరిస్తున్నాం. మీరు మద్దతు ఇవ్వకపోతే పోనివ్వండి, అంత మాత్రాన మీరు మద్దతు ఇవ్వనట్లేమీ అవదు. అన్నట్లు, నటిగా నిరుడు అరంగేట్రం చేసిన జెన్నీకి ఈ ఏడాది కాన్ ఆహ్వానం లభించింది.

– 'ఎటెడిటర్', ర్యాపర్

అప్పడొద్దన్నారు



రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో పాకిస్తాన్ నుంచి వచ్చిన హిందూ శరణార్థుల ఇళ్లను కూల్చి వేయించిన ఆ జిల్లా మేజిస్ట్రేట్ టీనాదాబీ... పౌరసత్వం లేని వారికి పునరావాసం కల్పించే విధానం ఏదీ రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేదని చెప్పడంలో అవాస్తవం ఏమీ లేదు. దురదృష్టం ఏమిటంటే, శరణార్థులకు సత్వర పౌరసత్వం కల్పించే ప్రతిపాదిత చట్టం రెండేళ్ల క్రితం భారీ హింసకు, అల్లర్లకు దారి తీయడం!

– స్వాతీ గోయెల్ శర్మ, పాత్రికేయురాలు

ఇన్‌బాక్స్

ఫ్లెక్సీ మరణం

నేతన్న ప్రతిమ దగ్గర అంబేడ్కర్ విగ్రహం వద్ద
గాంధీ విగ్రహం చెంత నాలుగు కూడళ్ల చోట
ఒక శ్రద్ధాంజలి అశ్రునివాళి
మరణించిన వారి ఫోటో ఫ్లెక్సీ ఒకటి వెలుస్తుంది

అనుబంధాలు జ్ఞాపకాలు గుండె గాయాల మచ్చలు
ఒక్కొక్కటి మనసును తడి గుడ్డను చేసి పిండినట్టు
కళ్ళల్లోంచి రాలుతున్న అశ్రువులు

తుఫాను జీవితంలో
చెట్లులా కదిలి చేతుల్లాంటి కొమ్మలు విరిగి
మనుషులు అతలాకుతలం అవుతున్నారు

కన్నతల్లి కొంగు నీడ లాంటి పచ్చని సొంత ఊరు నుంచి
పనిని వెతుక్కుంటూ వచ్చాము గిట్టుబాటు దక్కని పట్టణం
నానా విధాలుగా మన మూలుగలను పీల్చి పిప్పి చేస్తుంది

వృధా చేస్తూ టైం లేదంటూ అంతా తొందర తొందర
బతుకంతా చిందర వందర

పుట్టుకలేమో కానీ చావు దుఃఖ సమాచారాన్ని మాత్రం
మౌఖిక ప్రచారం అందరినీ చేరుతుంది

చావు ఫ్లెక్సీలను దర్శించినప్పుడల్లా
నాకు బట్ట మీద అక్షర బొమ్మ వేసే
చిత్రకారుని ఆర్తనాదం వినిపిస్తుంది

– జూకంటి జగన్నాథం

మానవాభివృద్ధినీ మనం అంగీకరించలేమా?

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

ఈ నెల ఐదున – 'కళ్యాణమస్తు' పథకం ఆరంభిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన క్లుప్త ప్రసంగంలో– 'ఈ పథకంలో వధువు విధిగా టెన్త్ క్లాస్ చదివి ఉండాలి' అనే షరతు కుటుంబం ఆడపిల్లను చదివించడానికి ప్రోత్సహించడం కోసమే'' అన్నారు. రాష్ట్రంలో పేదపిల్లల చదువుల ప్రోత్సాహానికి ఇప్పటికే పలు పథకాలు అమలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఇవి 'ఓట్ బ్యాంకు' పథకాలు అనీ, రాష్ట్ర ఖజానాను కుదేలు చేసేవనీ, 'కరోనా'నంతర కాలంలో విమర్శలు చేస్తున్నారు. ఈ రెండు విమర్శల్లోని నిజానిజాలను అటు జగన్ వ్యక్తిగత దృష్టి నుంచి, ఇటు మానవాభివృద్ధి నిర్వచనం దృష్టి నుంచి... ఇవి రెండు వేర్వేరు అంశాలుగా చూడాలి.

మొదటిది– ముఖ్యమంత్రి ఈ విషయంలో చూపుతున్న శ్రద్ధలో రాజకీయం కంటే వందేళ్ల ఆయన కుటుంబం చరిత్ర నేపథ్య ప్రభావం ఉంది. వైఎస్ రాజారెడ్డి సోదరి డా॥ రత్నమ్మ 1923లో పులివెందుల తాలూకా బలపనూరులో ఐదవ తరగతి చదివిన తర్వాత, సొంత ఊళ్ళో హైస్కూల్ లేకపోవడంతో ఆమె తండ్రి జమ్మలమడుగు మిషన్ స్కూల్లో ఆమెను చేర్చారు. అలా పై చదువుల్లోకి వెళ్లి మెడిసిన్ చదివాక, జమ్మలమడుగు మిషన్ హాస్పిటల్లో పనిచేశారు. సర్వీస్ మధ్యలో విదేశాల్లో 'గైనిక్' పీజీ చేసివచ్చాక, పదిమంది తోబుట్టువులు ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఆమె– 'ట్యూబెక్టమీ' ఆపరేషన్ చేయించుకున్నారు. కడప జిల్లాలో 1954 నాటికి అది మొదటి కుటుంబ నియంత్రణ ఆపరేషన్. ఇదంతా ఇప్పటికి వందేళ్ల నాటి చరిత్ర.

ఇక రెండవది– మానవాభివృద్ధి నిర్వచనం దృష్టి నుంచి చూస్తే... ప్రపంచీకరణ తర్వాత ఐరాస ఉపాంగం అయిన యూఎన్‌డీపీ 17 'సస్టెయినబుల్ డెవలప్మెంట్ గోల్స్' (ఎస్‌డీజీ)ను 2030 నాటికి లక్ష్యాలుగా నిర్దేశించి, అంశాల వారీగా వాటిని సమీక్షిస్తున్నది. కనుక, ఇది ఏమాత్రం ఇప్పుడు స్థానిక అంశం కాదు. ఢిల్లీలో మన 'నీతి ఆయోగ్' స్థాయిలోనే కాకుండా, పలు విదేశీ యూనివర్సిటీల్లో కూడా వీటిపై నిరంతరాయంగా అధ్యయనం జరుగుతున్నది. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో 'పాపులేషన్–హెల్త్–జాగ్రఫీ' ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్‌వీ సుబ్రహ్మణ్యన్ అదే యూని



వర్సిటీలో–'ఇండియా పాలసీ ఇన్‌సైట్స్ ఇనీషియేటివ్' చీఫ్ ఇన్వెస్టిగేటర్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన–'ఇండియా, ఇట్స్ ఎస్‌డీజీ ప్లెడ్జ్ గోల్ అండ్ ది స్ట్రాటజీ టు అప్లై' శీర్షికతో వెలువరించిన వ్యాసం చూస్తే... 'ఇందు కోసమా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్త్రీ కేంద్రిత సంక్షేమంపై ఇంత శ్రద్ధ చూపుతున్నది' అని ఆలోచనలో పడతాం.

హార్వర్డ్ యూనివర్సిటీలో మనదేశంలోని 707 జిల్లాలు ప్రాతిపదికగా జరుగుతున్న పరిశీలనలో 2016–2021 మధ్య– ఐదేళ్లలోపు పిల్లల మరణాలు, మెరుగైన మరుగుదొడ్ల వసతి, కౌమార బాలికల గర్భిణీ శాతం, పేదరికం (మల్టీ డైమెన్షియల్ పావర్టీ) స్త్రీల బ్యాంక్ అకౌంట్స్ సంఖ్య వంటివి ఆ సమీక్షకు తొలి ప్రాధమ్యాలుగా ఉన్నాయి. ఒకప్పుడు 'పేదరికం' ఒక అంశంగా సమీక్షించే దశ నుంచి, మూడు అంశాలను కలిపి ఇప్పుడు దాన్ని– 'మల్టీ డైమెన్షియల్ పావర్టీ'గా చూస్తున్నారు. అవి – 1. ఆరోగ్యం 2. విద్య 3. జీవన ప్రమాణాలు (వంట ఇంధనం, శానిటేషన్, తాగునీరు, విద్యుత్తు, గృహవసతి, అసెట్స్).

మారిన పరిస్థితులు ఇలా ఉన్నప్పుడు, అభివృద్ధిని వదిలేసి సంక్షేమమా అంటున్నవారి చూపు ఎటువంటిది అనే ప్రశ్న ఉదయించడం సహజం. అమలులో ఉన్న జీవన ప్రమాణాల సూచీ మేరకు, 'ప్రజల' పేదరికం తగ్గించడం ఎన్నికయిన ప్రభుత్వానికి రాజ్యాంగపరమైన బాధ్యత. 'యూఎన్‌డీపీ' నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు 2030 నాటికి సాధించాలి అనే షరతు మీదే ప్రపంచ బ్యాంకు, ఇతర ఆర్థిక సంస్థలు నుంచి మనతో సహా పలు దేశాలకు ఆర్థిక సహకారం అందుతున్నది. విమర్శకులు ఈ విషయాన్నీ గమనంలో ఉంచుకోవాలి.


ఉద్యోగులు, పెన్షనర్లు, మానవాభివృద్ధి పథకాల అమలు పట్ల సానుకూల వైఖరి కనపర్చకపోవడం, అవి తమకు అందే వేతన ప్రోత్సాహకాలకు అడ్డు అని భావించడం కొత్త ధోరణి. ఇక 'ప్రైవేట్ సెక్టార్' ఉద్యోగులకు తాము పనిచేస్తున్న కంపెనీల ఉనికి వెనుక ప్రభుత్వాలు కల్పించిన మౌలిక వసతులు, 'సబ్సిడీలు' ఉన్నవనే విషయాన్ని మరుస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జీవిక ప్రశ్నార్థంగా మిగిలిన వర్గాల విషయంలో తమ 'స్టాండ్' ఏమిటని ఎవరికి వారు జవాబు వెతుక్కోవడమే మిగిలిన పరిష్కారం.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

ముద్రలు

సీతా రామ లక్ష్మణులు వనవాసం చేస్తున్న సమయం. దట్టమైన అరణ్య మార్గాల గుండా సంచరిస్తున్నారు. ఒక ప్రదేశం నుండి వెళ్తున్నపుడు లక్ష్మణుడు తన మనసులో 'ఈ వనవాసం సీతా రాములకు అనివార్యం. నేనెందుకు వీరి వెంట ఉంటూ ఇన్ని బాధలు పడాలి' అనుకున్నాడు. ఇలా అనుకుంటూ ఆ ప్రదేశం దాటగానే తన ఆలోచనలకు సిగ్గుపడ్డాడు.

రామునికి ఆ విషయాన్ని చాలా బాధతో చెప్పాడు. రాముడు నవ్వి తమ్ముడూ! ఇప్పుడు మనం దాటి వచ్చిన ప్రదేశం రాక్షస నివాసం. రాక్షసులతో ఉంటే మాత్రమే కాదు, వారు సంచరించే



తావులు కూడా వారి స్వభావాన్ని మనలో నింపుతాయి. ఇప్పుడు ఋషుల వాటికకు చేరువయ్యాం. అందుకే నీ ఆలోచనల్లో పశ్చాత్తాపం కనిపించింది అన్నాడు.

మనతో ఉన్న మనుషుల స్వభావాలు మనపై ముద్రలు వేస్తాయి. అంతే కాదు, చెడ్డ మనుషులు ఉన్న ప్రాంతాల్లో తిరిగితే చెడు ఆలోచనలు, మంచి మనుషులు ఉన్న ప్రాంతంలో ఉంటే అందుకు తగిన మంచి ఆలోచనలు మనలో కలుగుతాయి. వ్యక్తులే కాదు వారున్న పరిసరాలు కూడా మనపై ముద్రలు వేస్తాయి అని ఈ ఘట్టం ద్వారా రామాయణం మనకు చెబుతోంది.

– శివలెంక ప్రసాదరావు

మూషిక జింక.. లగెత్తడమే ఇక

పెద్దగా శబ్దం వినబడితే గుండె పగిలి మరణించే జీవి

జింకల జాతిలోనే అతి చిన్న ప్రాణులివి	పాపికొండల అభయారణ్యంలో 500కు పైగా సంచారం	వెదురు ఎలుకగా పిలుస్తున్న గిరిపుత్రులు



పాపికొండల్లో వీటి సంఖ్య 500 పైనే

అరుదైన మూషిక జింకల సంచారం పాపికొండలు అభయారణ్యంలో ఎక్కువగానే ఉన్నట్టు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో దట్టమైన అరణ్యం ఉండటం.. వెదురు కూపులు ఎక్కువగా ఉండటంతో 500కు పైగా మూషిక జింకలు ఇక్కడ నివసిస్తున్నట్టు అంచనా. అభయారణ్యంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు మూషిక జింకల జాడ చిక్కినట్టు చెప్పారు.

బుట్టాయగూడెం: ఒకప్పుడు మూషిక మొహం.. జింక దేహంతో అలరారిన పురాతన కాలం నాటి అతి చిన్న మూషిక జింకలు (మౌస్ డీర్) పాపికొండలు అభయారణ్యంలో సందడి చేస్తున్నాయి. అంతరించిన జంతువుల జాబితాలో కలిసిపోయిన ఆ బుల్లి ప్రాణులు ప్రపంచ జింక జాతుల్లో అతి చిన్నవి. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం సుమారు 25 లక్షల నుంచి 30 లక్షల సంవత్సరాల క్రితమే పుట్టిన మూషిక జింక శరీర అమరికలో ఇప్పటివరకు ఎటువంటి మార్పులు జరగలేదట. అందుకే వీటిని సజీవ శిలాజంగా పరిగణిస్తారు. భారత ఉప ఖండంలో మాత్రమే కనిపించే మూషిక జింకల సంచారం పాపికొండలు అభయారణ్యంలోనూ ఉన్నట్టు వైల్డ్‌లైఫ్ అధికారులు గుర్తించారు. జానెడు పొడవు.. రెండు నుంచి మూడు కిలోల బరువుండే మూషిక జింకల సంరక్షణకు ఫారెస్ట్, వైల్డ్‌లైఫ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



ట్రాప్ కెమెరాలకు చిక్కిన మూషిక జింక

శబ్దం వినబడితే ప్రాణం హరీ!

మూషిక జింకలను స్థానిక గిరిజనులు వెదురు ఎలుకలని పిలుస్తారు. వీటికి భయం ఎక్కువ. పెద్ద శబ్దాలు విన్నా.. ఏవైనా జంతువులు దాడి చేసేందుకు వచ్చినా.. ఎవరైనా వీటిని పట్టుకున్నా భయంతో గుండె పగిలి మరణిస్తాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగానే మూషిక జింకలు రాత్రి వేళల్లో మాత్రమే అడవిలో సంచరిస్తాయని పేర్కొంటున్నారు. ఇవి ఎక్కువగా వెదురు కూపుల్లోనే నివసిస్తుంటాయి. అడవిలో రాలిన పువ్వులు, పండ్లు, ఆకుల్ని తింటాయి. ఉసిరి, మంగ కాయలు, పుట్ట గొడుగులు, పొదల్లోని లేత ఆకులను ఇష్టంగా తింటాయి. మూషిక జింకల గర్భధారణ కాలం ఆరు నెలలు. ఒక ఈతలో ఒకట్రెండు పిల్లలను మాత్రమే కంటుంది. మళ్లీ వెంటనే సంతానోత్పత్తికి సిద్ధం కావడం వీటి ప్రత్యేకత. చిరుతలు, అడవి కుక్కలు, అడవి పిల్లులు, గద్దలు ఈ మూషిక జింకలను వేటాడుతూ ఉంటాయి. వీటికి తోడు అడవుల నరికివేత, అడవిలో కార్చిచ్చు, వేటగాళ్ల ముప్పు వంటివి మూషిక జింకల ఉనికికి ప్రమాదంగా పరిణమిస్తున్నాయి.

సంతతి పెరుగుతోంది



అరుదైన మూషిక జింకలు పాపికొండలు అభయారణ్యంలో ఉన్నాయి. ఇవి ఇతర ప్రాంతాల్లో అంతరించిపోయే జీవులుగా ఉన్నా.. వీటి సంతతి ఇక్కడ పెరుగుతున్నట్టు కనిపిస్తోంది. ట్రాప్ కెమెరాల్లో కూడా ఈ మూషిక జింకలు చిక్కాయి. ఇవి సంచరించే ప్రాంతాల్లో జన సంచారం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దీంతో వీటి ఉనికి బాగా పెరుగుతున్నట్టు గుర్తించాం.

– దావీదురాజు నాయుడు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పోలవరం, ఏలూరు జిల్లా

జగనన్నకు బహుజనుల జేజేలు

- 963వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధానిలో పేదలకు 54 వేల ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టిన జగనన్నకు బహుజనులు జేజేలు పలికి బ్రహ్మరథం పడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 963వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో పెడుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతుల నోట్లో మట్టికొట్టి చంద్రబాబు తప్పు చేశాడని, సెంటు భూమి సమాధి కట్టుకోవడానికి చాలదని వ్యంగ్యంగా మాట్లాడుతున్న చంద్రబాబు 14 సంవత్సరాల పాలనలో ఎంతమంది పేదలకు ఎన్ని సెంట్లు చొప్పున కేటాయించాడో చెప్పాలన్నారు. చంద్రబాబు, అచ్చెన్నాయుడు మాట్లాడుతున్న మాటలు పేదలను కించపరిచేలా ఉన్నాయని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన బహుజన పరిరక్షణ సమితి నాయకులు మిఠాయిలు పంచిపెట్టి సందడి చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, బేతపూడి రాజేంద్ర కుమార్, నూతక్కి జోషి, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, భోగిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటలు




ఆలయం వెలుపల భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటలు పడుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూలు కొనసాగుతున్నాయి. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలతో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఆహారం, పాలు, తాగునీరు అందించేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలోనే గురువారం మధ్యాహ్నానికి 70,000 మందికి పైగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూల్లో 80,000 మందికి పైగా అన్నప్రసాదాలు అందించారు. క్యూల్లో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు 50 వేల మంది యాత్రికులు దర్శనం చేసుకున్నారు. అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ఎస్‌డీ, దివ్య దర్శనం టోకెన్లు ఉన్నవారు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో కొత్తగా 3 కళాశాలలు

- రెండు ఇంజినీరింగ్ కాలేజీలు, ఒక ఫార్మసీ కళాశాల
- విద్యార్థుల నమోదు శాతంతో సంబంధం లేకుండా నూతన కోర్సులకు అనుమతి
- బీఈ, బీటెక్‌లలో గరిష్ట సీట్ల సంఖ్య 300 నుంచి 360కి పెంపు
- ఇక నుంచి కంప్యూటర్ సైన్సెస్ కోర్సులు సైతం కోర్ బ్రాంచ్‌లుగా పరిగణింపు



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో నూతనంగా రెండు ఇంజినీరింగ్ కళాశాలలు, ఒక ఫార్మసీ కళాశాల మంజూరయ్యాయి. చిత్తూరు, రాయచోటిలో ఒక్కొక్క ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులో ఒక ఫార్మసీ కళాశాల ఏర్పాటు కానున్నాయి. ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. నూతన జాతీయ విద్యావిధానం–2020ని దృష్టిలో ఉంచుకుని అనుమతుల ప్రక్రియలో వెసులుబాటుతోపాటు కొన్ని మార్పులు చేసింది. ప్రొఫెషనల్ కోర్సులపై ఉన్న మారిటోరియాన్ని ఎత్తేసింది. దీంతో కొత్తగా ఇంజినీరింగ్ కళాశాలలు, సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో రెండు ఇంజినీరింగ్, ఒక ఫార్మసీ కళాశాల మంజూరయ్యాయి. ఇప్పటికే జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో 98 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలుండగా.. తాజాగా ఆ సంఖ్య 100కు చేరింది. ఫార్మసీ కళాశాలల సంఖ్య కూడా 34కు చేరింది. ఏఐసీటీఈ తాజా నిర్ణయం మేరకు బీటెక్ కోర్సుల్లో బీఈ, బీటెక్ గరిష్ట సీట్ల సంఖ్యను 300 నుంచి 360కి పెంచారు. నూతన నిబంధనల ప్రకారం కంప్యూటర్ అప్లికేషన్ ప్రోగ్రామ్‌లలో ఇన్‌టేక్‌ను 180 నుంచి 300 వరకు పెంచుకునే అవకాశం కల్పించారు. తక్కిన 60 సీట్లు.. 30 సీట్లు చొప్పున సివిల్, మెకానికల్ వంటి కోర్ గ్రూప్‌లలో భర్తీ చేసుకోవచ్చు. కంప్యూటర్ సైన్సెస్ ప్రోగ్రామ్‌ను సైతం తాజాగా కోర్ గ్రూప్‌గా పరిగణించారు. విద్యార్థుల నమోదు శాతంతో సంబంధం లేకుండా అభివృద్ధి చెందుతున్న విభాగాలలో నూతన కోర్సులను ప్రారంభించేందుకు అనుమతించనున్నారు.

యూసీఎస్ బకాయిలు చెల్లిస్తేనే ఎన్‌వోసీ

వర్సిటీకి చెల్లించాల్సిన యూనివర్సిటీ కామన్ సర్వీసెస్ (యూసీఎస్) ఫీజుల బకాయిలు చెల్లిస్తేనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) జారీచేస్తామని జేఎన్‌టీయూ (ఏ) ఉన్నతాధికారులు గతంలో స్పష్టం చేశారు. వర్సిటీ ఆయా ఇంజినీరింగ్ కళాశాలలకు ఎన్‌వోసీ జారీచేస్తేనే ఏఐసీటీఈ 2023–24 విద్యా సంవత్సరానికి గుర్తింపు ఇస్తుంది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ(ఏ) ఎన్‌వోసీ జారీకి యూసీఎస్ బకాయిలతో ముడిపెట్టింది. వర్సిటీ పరిధిలోని 98 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే 88 కాలేజీలు యూసీఎస్ బకాయిలు చెల్లించాయి. 10 ఇంజినీరింగ్ కళాశాలలు రూ.1.50 కోట్ల బకాయిలున్నాయి. వీటికి కూడా బకాయిలు చెల్లిస్తేనే ఎన్‌వోసీ ఇవ్వాలని వర్సిటీ అధికారులు నిర్ణయించారు.

పోర్టల్‌లో వివరాలు

ఏఐసీటీఈ నుంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయా ఇంజినీరింగ్ కళాశాలలు వర్సిటీ అనుబంధ హోదాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కళాశాలకు సంబంధించిన వివరాలన్నీ పోర్టల్‌లో నమోదు చేస్తారు. వాటి ఆధారంగా వర్సిటీ నిజనిర్ధారణ కమిటీలను నియమిస్తుంది. కమిటీ నివేదిక ఆధారంగానే ఆయా ఇంజినీరింగ్ కళాశాలలకు ఎన్ని సీట్లు కేటాయించాలనే అంశంపై స్పష్టత రానుంది. ప్రస్తుతం ఏపీ ఈఏపీసెట్ జరుగుతోంది. పరీక్ష పూర్తయి ర్యాంకులు ప్రకటించి కౌన్సెలింగ్ షెడ్యూల్ వచ్చేలోపు సీట్ల కేటాయింపు పూర్తికావాల్సి ఉంది.

అన్ని వసతులు ఉన్న కళాశాలలకే గుర్తింపు

బోధన ప్రమాణాలు, మౌలిక వసతులు, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉన్న కళాశాలకే అనుబంధ గుర్తింపు జారీచేస్తాం. నిబంధనలకు లోబడి ఇంజినీరింగ్ సీట్లు కేటాయిస్తాం. గత ఐదేళ్ల పురోగతి, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కొలువులు తదితర అంశాలను బేరీజు వేసి కళాశాల స్థితిగతులను అంచనావేస్తాం. అన్ని రకాల సదుపాయాలున్న ఆయా ఇంజినీరింగ్ కళాశాలలనే పరిగణనలోకి తీసుకుంటాం.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

గోవిందరాజస్వామి ఆలయం మహా సంప్రోక్షణ ఆపండి

హైకోర్టులో అత్యవసర పిటిషన్ • విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి : తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి దేవస్థానం గర్భగుడి విమాన గోపురంపై బంగారు పూతతో కూడిన రాగి రేకులను ఏర్పాటు చేసే విషయంలో అక్రమాలు జరిగాయని, వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు అడ్వొకేట్ కమిషన్‌ను నియమించాలని కోరుతూ హైకోర్టులో గురువారం లంచ్‌మోషన్ రూపంలో అత్యవసర పిటిషన్ దాఖలైంది. గోవిందరాజ స్వామి దేవస్థానంలో ఈ నెల 21న తలపెట్టిన మహా సంప్రోక్షణ వాయిదా వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ తిరుపతికి చెందిన తుమ్మా ఓంకార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి విచారణ జరిపారు. ఇదే వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే రెండు వ్యాజ్యాలు దాఖలయ్యాయని, వాటిపై కోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదని టీటీడీ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.సత్యనారాయణ ప్రసాద్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యాజ్యాల్లో కౌంటర్లు కూడా దాఖలు చేశామన్నారు. పూర్తి వివరాలు సమర్పించేందుకు విచారణను వాయిదా వేయాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. టీటీడీ కౌంటర్‌తో పాటు ఇతర అంశాలనూ పరిశీలిస్తామని న్యాయమూర్తి తెలిపారు. అంతకు ముందు పిటిషనర్ తరఫు న్యాయవాది జేవీ ఫణిదత్ వాదనలు వినిపిస్తూ.. ఆగమ శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా విమాన గోపురానికి బంగారుపూత పూసిన రాగి రేకులు అమర్చడం వల్ల గోపురం దెబ్బతింటుందని చెప్పారు. ఇందులో అక్రమాలు జరిగాయని, రాగి రేకులకు బంగారు పూతకు బదులు బంగారు రంగు వేస్తున్నారని, వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు అడ్వొకేట్ కమిషన్‌ను నియమించాలని కోరారు. మహా సంప్రోక్షణ పూర్తయితే గర్భగుడిని ఎక్కి విమాన గోపురాన్ని పరిశీలించే అవకాశం ఉండదన్నారు. అందువల్ల మహా సంప్రోక్షణను నిలిపివేయాలని కోరారు.



ఏసీబీకి పట్టుబడ్డ అబ్బూరు వీఆర్వో

- మ్యుటేషన్‌కు రూ.లక్ష డిమాండ్
- ఇప్పటికే రూ.59 వేలు తీసుకున్న వైనం
- మరో రూ.40 వేలు తీసుకుంటుండగా పట్టివేత

సాక్షి, అమరావతి/సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామ సచివాలయంలో గ్రామ రెవెన్యు అధికారి (వీఆర్వో) నేతగాని వినోద్ ఓ రైతు నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా గురువారం మధ్యాహ్నం అవినీతి నిరోధక శాఖ అధికారులు (ఏసీబీ) పట్టుకున్నారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ కుమార్ కథనం మేరకు.. అబ్బూరు గ్రామానికి చెందిన మానుకొండ నరసింహారావు వరుసకు మేనత్త అయిన వెంకాయమ్మ భూముల మ్యుటేషన్ కమ్ టైటిల్ డీడ్ కోసం దరఖాస్తు చేశారు. దీనికి గానూ అబ్బూరు వీఆర్వో నేతగాని వినోద్ రూ.లక్ష లంచం డిమాండ్ చేసి రూ.59 వేలు తీసుకుని.. మిగిలిన డబ్బు కోసం వేధిస్తున్నాడు. దీంతో నరసింహారావు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. దీంతో గురువారం నరసింహారావు నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా వీఆర్వో వినోద్‌ను గుంటూరు అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వినోద్‌ను అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరిచారు. దాడుల్లో అవినీతి నిరోధక శాఖ సీఐలు నాగరాజు, రవిబాబు, అంజిబాబు, మన్మథ సురేష్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్‌మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



వీఆర్వో వినోద్

యువత భవితకు మానసిక నిపుణుల సేవలు అవసరం

ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిని సత్కరిస్తున్న హేమచంద్రారెడ్డి, డాక్టర్ బాబ్జి తదితరులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా.. వారి భవిష్యత్తును చక్కదిద్దేందుకు మానసిక వైద్యుల అవసరం ఎంతో ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో 'తెలుగు సినిమాల్లోని మనసు పాటలు–విశ్లేషణ' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మద్యపానం, క్రికెట్ బెట్టింగ్, అపరిపక్వ ప్రేమ వ్యవహారాలతో ఆత్మహత్యలు వంటి ఘటనలు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యామండలి తరఫున నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సైకియాట్రిస్టులు కూడా ముందుకు వస్తే.. వారితో కలిసి యువత భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు మరిన్ని శిక్షణా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, డాక్టర్ సమరం, సైకియాట్రిక్ సొసైటీ విజయవాడ చాప్టర్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నవీన్, డాక్టర్ పవన్, డాక్టర్ విశాల్, డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ మాజీ జేడీ ఫొటో చూపి ఘరానా మోసం

- పూజారి ఇంట్లో నగదు, బంగారం అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు.. గుంటూరు జిల్లాలో ఘటన



సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణతో దిగిన మోసగాడి ఫొటో

తాడేపల్లిరూరల్: తాము ఏసీబీ నుంచి వచ్చామని చెబుతూ సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో కలిసి దిగిన ఫొటో చూపించి ఇంట్లో ఉన్న బంగారం, నగదు, చెక్కులను బలవంతంగా తీసుకెళ్లారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం కంతంరాజు కొండూరులో గురువారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. బాధితుడైన పూజారి తారకనాథ్‌శర్మ దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. తెల్లవారుజామున 5.30 సమయంలో తారకనాథ్‌శర్మ ఇంటి బయట నుంచి మీతో మాట్లాడాలంటూ ఫోన్ చేశారు. బయటకు రాగానే ముగ్గురు వ్యక్తులు.. తాము ఏసీబీ నుంచి వచ్చామంటూ సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో ఉన్న ఫొటో చూపారు. ఆ వెంటనే పూజారి, ఆయన భార్య, కుమారుల చేతుల్లోంచి సెల్ ఫోన్‌లు లాక్కుని స్విచ్ఛాఫ్ చేశారు. ఇంట్లో బీరువాలో ఉన్న రూ.50 వేలు, బంగారు రుద్రాక్షమాల, చెవి దుద్దులు, చెక్కు బుక్ తీసుకున్నారు. పూజారి పేర్న ఉన్న చెక్‌బుక్ నుంచి రెండు చెక్కులు తీసుకుని ఒక దాని మీద రూ.లక్ష అమౌంట్ వేసి సంతకం పెట్టించుకున్నారు. మరో ఖాళీ చెక్కుపై సంతకం పెట్టించుకున్నారు. పూజారి కుమారుడివి రెండు చెక్కులు తీసుకుని ఆ రెంటిపైనా రూ.100 అని రాసి సంతకాలు పెట్టించుకున్నారు. ఎందుకని ప్రశ్నించగా.. బ్యాంక్ అకౌంట్ తనిఖీ చేయడానికని చెప్పారు. తమ దగ్గర తీసుకున్న వస్తువులకు రశీదులు ఇవ్వాలని కోరాగా.. మమ్మల్నే ప్రశ్నిస్తారా.. మీ సంగతి తేలుస్తాం.. అంటూ కారులో పారిపోయారని పూజారి చెప్పారు. 7989908508 సెల్ నుంచి ఫోన్ వచ్చిందని, నంబర్ సేవ్ చేసి చూడగా.. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో మా ఇంటికి వచ్చిన ముగ్గురిలో ఓ వ్యక్తి ఫొటో వాట్సాప్‌లో కనిపిస్తోందని చెప్పారు. గత ఆదివారం జాతకం చెప్పించుకోవాలంటూ ఇదే నంబర్ నుంచి తనకు ఫోన్ వచ్చిందని పూజారి చెప్పారు. ఘటనపై మంగళగిరి సీఐ నాగభూషణం విచారణ నిర్వహిస్తున్నారు.

దుర్గగుడి ఏఈవో వెంకటరెడ్డిపై సస్పెన్షన్ వేటు



ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఏఈవో వెంకటరెడ్డి (సీసీరెడ్డి)పై ఈవో భ్రమరాంబ గురువారం సస్పెన్షన్ వేటు వేశారు. కాంట్రాక్టర్‌కు సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఈవో నిరాకరించగా, సదరు కాంట్రాక్టర్ ఏఈవో వెంకటరెడ్డి ద్వారా సర్టిఫికెట్ పొందారు. సర్టిఫికెట్‌పై ఈవో సంతకం బదులుగా ఏఈవో సంతకం పెట్టడమే కారణంగా తెలుస్తోంది. ఈ వ్యవహారం ఈవో దృష్టికి వెళ్లగా దానిపై ఏఈవో వెంకటరెడ్డిని వివరణ కోరారు. దీనిపై ఏఈవో వెంకటరెడ్డి ఈవోకు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం.

విశాఖ-కాచిగూడ సూపర్ ఫాస్ట్ రైలు పొడిగింపు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విశాఖపట్నం–కాచిగూడ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 20 నుంచి మహబూబ్‌నగర్ వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు కాచిగూడ–విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(12862) 20వ తేదీన మహబూబ్‌నగర్‌లో సాయంత్రం 4.10 గంటలకు బయల్దేరుతుంది. 6.10కి కాచిగూడ చేరుకుని సాయంత్రం 6.20కి బయల్దేరి, మరుసటిరోజు ఉదయం 6.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు(12861) విశాఖలో సాయంత్రం 6.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.45కి కాచిగూడ చేరుకుంటుంది. తిరిగి 6.55కి బయల్దేరి ఉదయం 9.20 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటుంది.

మల, మూత్ర ద్వారం లేని గొర్రె పిల్ల జననం

విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహణ



శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ జి.పద్మనాభం బృందం

అనంతపురం అగ్రికల్చర్: మల, మూత్ర ద్వారం లేకుండా పుట్టిన గొర్రె పిల్లకు పశు వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. అనంతపురం జిల్లా నార్పల మండలం నిలువురాయిలో పి.కృష్ణయ్య అనే గొర్రెలకాపరికి చెందిన ఓ గొర్రెకు బుధవారం ఒక పిల్ల పుట్టింది. దానికి మల, మూత్ర ద్వారం లేకపోవడాన్ని గమనించిన కృష్ణయ్య నార్పల పశువైద్యుడిని సంప్రదించారు. ఆయన ఈ విషయాన్ని శింగనమల పశువైద్యశాల ఏడీ డాక్టర్ జి.పద్మనాభం దృష్టికి తీసుకెళ్లారు. గొర్రె పిల్లను అన్ని విధాలుగా పరిశీలించిన డాక్టర్ పద్మనాభం దానికి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఒకటిన్నర గంట పాటు శస్త్ర చికిత్స చేసి మల, మూత్ర ద్వారం ఏర్పాటు చేసి కుట్లు వేశారు. సెలైన్లు, యాంటీబయాటిక్ మందులిచ్చారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో గొర్రె పిల్ల మలం, మూత్రం విసర్జించినట్లు తెలిపారు. పిండం ఎదుగుదలలో ఉన్న సమయంలో కొన్ని జన్యుమార్పుల వల్ల ఇలాంటి అరుదైన లోపాలతో జననాలు సంభవిస్తాయని ఏడీ చెప్పారు. తక్షణం పశువైద్యులను సంప్రదిస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. శస్త్రచికిత్సలో సహకరించిన జి.పద్మనాభం, సిబ్బంది రజియాబేగం, చంద్రశేఖర్, మునీంద్రకు కృష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకాశం జిల్లాలో ఆది మానవుల అవశేషాలు

- పామూరు వద్ద నాసవాగు, మన్నేరు పరిసర ప్రాంతాల్లో పరిశోధనలు
- లక్ష సంవత్సరాల కిందటి అవశేషాల గుర్తింపు
- పరిశోధనలు చేస్తున్న ఆర్కియాలజీ శాస్త్రవేత్తలు, విద్యార్థులు



యంత్రాలతో సర్వే నిర్వహిస్తున్న శాస్త్రవేత్తల బృందం

పామూరు : ప్రకాశం జిల్లాలో ఆది మానవులు, వైల్డ్‌జాతి ఆవులు, గుర్రాల అవశేషాలు గుర్తించినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్కియాలజీ మహరాజ సామాజీరావ్ యూనివర్సిటీ, వడోదర, గుజరాత్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, టీమ్ లీడర్ దేవర అనిల్‌కుమార్ తెలిపారు. పామూరు మండలం నాసవాగు, మన్నేరు పరిసర ప్రాంతాల్లో సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలో గత 20 రోజులుగా ఆర్కియాలజీ విభాగం ఆధ్వర్యంలో గుజరాత్‌కు చెందిన యూనివర్సిటీ పీజీ విద్యార్థులు, మరో ఇద్దరు సైంటిస్టులు పరిశోధనలు జరుపుతున్నారు. 2010లో జిల్లాకు చెందిన ప్రొఫెసర్ కొండా శ్రీనివాసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన సలహాలు, సూచనలతో తాము పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌జీఆర్ఐ) హైదరాబాద్ వారి ద్వారా జీపీఆర్ సర్వే నిర్వహింపజేసి వారు సూచించిన ప్రాంతంలో పరిశోధనలు కొనసాగిస్తున్నట్లు అనిల్‌కుమార్ చెప్పారు. పరిశోధనల్లో ఆదిమానవుల అవశేషాలు, రాతియుగం నాటి పనిముట్లు, జంతువుల అవశేషాలు సేకరించామన్నారు. వాటి వయసు ఓఎస్ఎల్ డేటా ప్రకారం సుమారు 75 వేల నుంచి లక్ష సంవత్సరాలకు పైబడి ఉంటుందని తెలిపారు. వైల్డ్ జాతికి చెందిన బోస్ నమాడికస్(ఆవు), ఈక్వస్ నమాడికస్(గుర్రం), ఉడుము జాతి జంతువుల అవశేషాలు గుర్తించామన్నారు. ఇవి సుమారు 20 వేల ఏళ్ల కిందట అంతరించిపోయినట్టు తెలిపారు. పరిశోధనల్లో దొరికిన అవశేషాలను ఆస్ట్రేలియాకు పంపగా ఈ విషయం బహిర్గతమైందని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్నవి మచ్చికజాతని అనిల్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం అవి అంతరించిపోవడానికి కారణాలు, ఆదిమానవులు ఇక్కడ నివసించిన కాలం, ఇతర అంశాలపై పూర్తిస్థాయిలో పరిశోధనలు చేస్తున్నట్టు చెప్పారు. దీనికి సంబంధించి ఇద్దరు సైంటిస్టులు డాక్టర్ ఆనంద్‌పాండే, సక్రమ్‌లు ఈ ప్రాంతానికి వచ్చి తమకు సలహాలు, సూచనలిచ్చి సర్వే చేయాల్సిన ప్రాంతాలను సూచించినట్టు అనిల్‌కుమార్ వివరించారు.

ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు

క్వారీ గుంతల చెరువులోకి ఈతకు దిగిన విద్యార్థులు



రాజేష్(ఫైల్)



నిఖిల్(ఫైల్)

సింహాచలం: విశాఖ జిల్లా పెందుర్తి మండలం నరవలో గురువారం క్వారీ గుంతల చెరువులో ఈతకు దిగిన ఇంజినీరింగ్ విద్యార్థులు మళ్ల రాజేష్ (17), బండారు నిఖిల్ (17) గల్లంతయ్యారు. వీరు నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ రెండో సంవత్సరం చదువుతున్నారు. పరీక్ష రాసి మధ్యాహ్నం రెండుగంటల సమయంలో మరో ముగ్గురు విద్యార్థులతో కలిసి కళాశాలకు సమీపంలో ఉన్న క్వారీ గుంతల చెరువు వద్దకు వెళ్లారు. రాజేష్, నిఖిల్ చెరువులో దిగగా మిగతా ముగ్గురు ఒడ్డున ఉన్నారు. చెరువులోకి దిగిన రాజేష్, నిఖిల్ మునిగిపోవడంతో మిగిలినవారు కళాశాలకు పరుగున వెళ్లి సిబ్బందికి చెప్పారు. కళాశాల సిబ్బంది సమాచారంతో వచ్చిన పెందుర్తి పోలీసులు గజఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. సాయంత్రం వరకు ఇద్దరి ఆచూకీ లభ్యం కాలేదు. చెరువు వద్దకు చేరుకున్న రాజేష్, నిఖిల్ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గల్లంతైన మళ్ల రాజేష్‌ది అనకాపల్లిలోని లక్ష్మీదేవి పేట. తండ్రి మృతిచెందడంతో తల్లి సునీత ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. సోదరుడి సహకారంతో రాజేష్‌ను చదివిస్తోంది. నిఖిల్‌ది గాజువాక. అతడి తండ్రి రామారావు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు.

క్లుప్తంగా

బెంగాల్‌లో 'ది కేరళ స్టోరీ' బ్యాన్‌పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: వివాదాస్పద 'ది కేరళ స్టోరీ'సినిమాకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. రాష్ట్రంలో సినిమా ప్రదర్శనపై నిషేధం విధిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై స్టే విధించింది. బెంగాల్ ప్రభుత్వ చర్యను సవాల్ చేస్తూ చిత్ర నిర్మాత వేసిన పిటిషన్‌పై ఈ మేరకు ఆదేశాలిచ్చింది. కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాల ఆధారంగా బెంగాల్ ప్రభుత్వం ప్రదర్శనను నిలిపివేయరాదని పేర్కొంది. 'తమిళనాడులో ది కేరళ స్టోరీపై నిషేధం ఏదీ లేదు. సినిమాకు సీబీఎఫ్‌సీ క్లియరెన్స్ వచ్చినందున శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే' అని స్పష్టం చేసింది. సినిమా ప్రేక్షకుల రక్షణకు చర్యలు తీసుకోవాలంది.

అమెరికాలో భారతీయ మహిళ ఘనత



న్యూయార్క్: భారత సంతతికి చెందిన ప్రతిమా భుల్లార్ మల్డొనాడో న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్(ఎన్‌వైపీడీ)లో అత్యున్నత స్థాయి అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి దక్షిణాసియా మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. గత నెలలో ఆమెకు కెప్టెన్‌గా పదోన్నతి లభించింది. క్వీన్స్‌లోని సౌత్ రిచ్‌మండ్ హిల్‌లో 102వ పోలీస్ ప్రిసింక్ట్‌కు ఆమె నేతృత్వం వహిస్తున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో ఇదే అతిపెద్ద హోదా. పంజాబ్‌లో జన్మించిన ప్రతిమ కుటుంబం ఆమెకు తొమ్మిదేళ్ల వయసప్పుడు న్యూయార్క్‌లోని క్వీన్స్‌కు వలసవెళ్లింది. 'మా నాన్న ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఎంతో కష్టపడి మమ్మల్ని పోషించారు. 2006లో ఆయన చనిపోయారు. ఆయన ఉండి ఉంటే నన్ను చూసి ఎంతో సంతోషపడేవారు'అని ప్రతిమ మీడియాతో అన్నారు.

ఇమ్రాన్ నివాసం దిగ్బంధం

లాహోర్: పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నివాసంలో దాగున్న ఉగ్రవాదుల అరెస్ట్‌కు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇమ్రాన్ నివాసంలో ఉన్న సుమారు 40 మంది ఉగ్రవాదులను 24 గంటల్లోగా అప్పగించాలంటూ పంజాబ్ ప్రభుత్వం బుధవారం గడువిచ్చిన విషయం తెలిసిందే. ఆ గడువు పూర్తి కావడంతో భారీ సంఖ్యలో పోలీసులు లాహోర్‌లో జమాన్ పార్క్ ఏరియాలో ఉన్న ఇమ్రాన్ నివాసాన్ని చుట్టుముట్టారు. ఈ నెల 9వ తేదీన సైన్యానికి చెందిన ప్రాంతాలపై దాడులకు పాల్పడినట్లు అనుమానిస్తున్న 8 మందిని జమాన్ పార్క్ ఏరియాలో నిర్బంధంలోకి తీసుకున్నట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. అయితే, ఇందులో నిజం లేదని ఇమ్రాన్ ఖండించారు.

సిద్ధూనే ముఖ్యమంత్రి

కర్ణాటక ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్

- అధికారికంగా ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్టానం
- సీఎల్పీ నేతగా సిద్ధరామయ్య ఏకగ్రీవ ఎన్నిక
- గవర్నర్‌ను కలిసిన నేతలు.. ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత
- 20న మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణం
- సిద్ధూ, శివకుమార్‌తోపాటు పలువురు మంత్రుల ప్రమాణం
- లోక్‌సభ ఎన్నికల దాకా పీసీసీ అధ్యక్షుడిగా శివకుమార్



ఢిల్లీలో తన నివాసంలో డీకే, సిద్ధరామయ్యలతో ఖర్గే

సాక్షి, బెంగళూరు/బొమ్మనహళ్లి: ఐదు రోజుల ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. కర్ణాటక నూతన ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంది. సుదీర్ఘమైన చర్చలు, బుజ్జగింపుల తర్వాత వెనుకబడిన తరగతికి చెందిన సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా, ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన శివకుమార్‌ను ఉప ముఖ్యమంత్రిగా ఖరారు చేసింది. గురువారం ఉదయం నుంచి రాత్రి దాకా పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. సీఎంగా సిద్ధరామయ్య పేరును ఢిల్లీలో అధిష్టానం ఖరారు చేయడం, సాయంత్రం బెంగళూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమై, తమ శాసనసభాపక్ష నేత(సీఎల్పీ)గా ఆయనను లాంఛనంగా ఎన్నుకోవడం, వెంటనే రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గహ్లోత్‌ను సిద్ధరామయ్య కలిసి, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయడం మెరుపు వేగంతో జరిగాయి. బెంగళూరులోని ఇందిరాగాంధీ భవన్‌లో గురువారం రాత్రి జరిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా పాల్గొన్నారు. సీనియర్ నేతలు రణదీప్‌సింగ్ సూర్జేవాలా, సుశీల్‌కుమార్ షిండే, జితేంద్ర సింగ్ హాజరయ్యారు. సీఎల్పీ కొత్త నేతగా సిద్ధరామయ్య పేరును ప్రతిపాదిస్తూ డీకే ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. పార్టీ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సిద్ధరామయ్య, డీకే శివకుమార్, ఇతర నేతలు రాష్ట్ర గవర్నర్‌ను కలిశారు. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని గవర్నర్‌కు తెలియజేశారు.

మా చేతులు ఎప్పటికీ కలిసే ఉంటాయి: సిద్ధూ

సీఎంగా, డిప్యూటీ సీఎంగా తమ పేర్లను ప్రకటించిన తర్వాత సిద్ధూ, శివకుమార్ తమ ఐక్యతను చాటారు. ఖర్గేతో భేటీ చిత్రాన్ని సిద్ధూ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. ''కన్నడిగుల ప్రయోజనాల పరిరక్షణ కోసం మా చేతులు ఎప్పటికీ కలిసే ఉంటాయి. ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తాం' అని సిద్ధూ పేర్కొన్నారు. డీకే ఇదే ఫొటోను షేర్ చేశారు.

పలువురు సీఎంలకు, విపక్ష నేతలకు ఆహ్వానం

ముఖ్యమంత్రిగా తన ప్రమాణ స్వీకారోత్సవానికి సిద్ధరామయ్య పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, భావసారూప్యం కలిగిన విపక్ష నేతలను ఆహ్వానించారు. తమిళనాడు సీఎం స్టాలిన్, జార్ఖండ్ సీఎం సోరెన్, పశ్చిమ బెంగాల్ సీఎం మమత, బిహార్ సీఎం నితీశ్, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేలను ఆహ్వానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆహ్వానం పంపలేదని తెలిసింది.

ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తాం

ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్ సూర్జేవాలా గురువారం ఉదయం మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమ పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గే నిర్ణయం మేరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడతారని తెలియజేశారు. వచ్చే లోకసభ ఎన్నికల దాకా కర్ణాటక పీసీసీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్ కొనసాగుతారని చెప్పారు. ఈ నెల 20న మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యాన్ని ఇచ్చారని, పేదలు, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పనిచేస్తుందని ఉద్ఘాటించారు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో పాటు 20 మందికిపైగా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం.

అధికారం చెరి సగం!

చెరో 30 నెలలు అధికార పంపిణీ సూత్రాన్ని ఏఐసీసీ ప్రతిపాదించినట్లు తెలిసింది. మొదటి 30 నెలలు సిద్ధరామయ్య సీఎంగా, డీకే శివకుమార్ డిప్యూటీ సీఎంగా, ఆ తర్వాత 30 నెలలు డీకే శివకుమార్ సీఎంగా, సిద్ధరామయ్య డిప్యూటీ సీఎంగా కొనసాగేలా కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. గురువారం ఉదయం కేసీ వేణుగోపాల్ తన నివాసంలో అల్పాహార విందుకు సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ను ఆహ్వానించారు. రణదీప్‌సింగ్ సూర్జేవాలాతో కలిసి ఇరువురు నేతలతో చర్చించారు. హైకమాండ్ నిర్ణయాన్ని వివరించి, అధికార పంపిణీకి ఒప్పించారు. అల్పాహార విందు భేటీ తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఒకే కారులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లారు. తద్వారా తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కలసికట్టుగా ఉన్నామనే సందేశాన్ని పంపించారు. మల్లికార్జున ఖర్గే తన నివాసంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో చర్చించారు. వారికి ఆశీస్సులు అందజేశారు. సిద్ధూ, శివకుమార్‌తో జరిగిన తన భేటీ చిత్రాన్ని ఖర్గే ట్విట్టర్‌లో షేర్ చేశారు. 6.5 కోట్ల మంది కన్నడిగులకు తాము ఇచ్చిన ఐదు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేస్తామని ఉద్ఘాటించారు. ఆ తర్వాత ఇద్దరు నాయకులు కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లారు. ఆయనతో భేటీ అయ్యారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ ఇరువురికి రాహుల్ గాంధీ సూచించారు.

సిద్ధూ.. అనుభవమే ఆభరణం

సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజాప్రతినిధుల బలం కలిసి వచ్చిన సిద్ధరామయ్య రెండోసారి కర్ణాటక ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజకీయాల్లో కొత్తలో కాంగ్రెస్‌కు వ్యతిరేకి అయిన ఆయన ఆ పార్టీ నుంచి రెండు సార్లు సీఎం కావడం విశేషం.

- మైసూరు జిల్లా సిద్ధరామనహుండి గ్రామంలో ఒక నిరుపేద రైతు కుటుంబంలో 1948 ఆగస్టు 12న జన్మించారు. రాష్ట్రంలో మూడో అతి పెద్ద సామాజిక వర్గమైన కురుబకు చెందిన నేత. లా చదివి కొన్నాళ్లు ప్రాక్టీస్ చేశారు. రైతు ఉద్యమాల్లో పాల్గొంటూ, వారి కేసుల్ని వాదిస్తూ రైతు లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు
- 1983లో రాజకీయాల్లో అడుగుపెట్టారు. జనతా పార్టీ నుంచి టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. భారతీయ లోక్‌దళ్ పార్టీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు
- అదే ఏడాది రామకృష్ణ హెగ్డే ఆధ్వర్యంలో జనతా పార్టీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు.
- ఆ తర్వాత ఎన్నికల్లో జనతాదళ్ పార్టీ నుంచి చాముండేశ్వరి నుంచి అయిదు సార్లు నెగ్గారు. మూడు సార్లు ఓడిపోయారు.
- 1996లో జనతాదళ్ పార్టీ చీలిపోయినప్పుడు, దేవేగౌడ నేతృత్వంలో జేడీ(ఎస్) చీలిక పక్షానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు
- 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. అప్పట్లోనే సీఎం కావాలన్న బలీయమైన ఆకాంక్షతో మైనార్టీలు, వెనుకబడిన వర్గాలు దళితులతో కూడిన అహిందా అనే ఫార్ములాతో ఆయా వర్గాల వారికి చేరువ కావడానికి రాష్ట్రమంతటా పర్యటించారు. సిద్ధరామయ్య చర్యతో ఇరకాటంలో పడిన హెచ్.డి. దేవెగౌడ డిప్యూటీ సీఎం పదవి నుంచి తప్పించారు.
- దీంతో 2006లో జేడీ(ఎస్)కు గుడ్‌బై కొట్టేసి కాంగ్రెస్‌లో చేరారు.
- 2013 ఎన్నికల్లో కాంగ్రెస్ నెగ్గడంతో సీఎం పదవి చేపట్టారు. రాష్ట్రంలో దేవ్‌రాజ్ తర్వాత పూర్తి కాలం సీఎంగా ఉన్నది ఈయనే
- 2019లో కాంగ్రెస్, జేడీ(ఎస్)ల నుంచి 15 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోవడంతో ప్రభుత్వం కుప్పకూలిపోయి, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. కాంగ్రెస్, జేడీ(ఎస్) ప్రభుత్వం కూలిపోవడం వెనుక సిద్ధరామయ్య హస్తం ఉందనే ఆరోపణలున్నాయి.

డీకే శివకుమార్.. ట్రబుల్ షూటర్

పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల్లో గెలిపించే బాధ్యతని తన భుజస్కంధాలపై మోసిన నాయకుడు. సీఎం పదవిపై ఆశపడి అయిదు రోజులు మొండిపట్టు పట్టినా చివరికి కాంగ్రెస్ హైకమాండ్‌కు విలువనిచ్చిన వీరవిధేయుడు.

- రాష్ట్రంలోని కనకపురలో దొడ్డలహళ్లి కెంపెగౌడ, గౌరమ్మ దంపతులకి 1962 మే 15న జన్మించారు. వొక్కలిగ సామాజిక వర్గీయుడు. కర్ణాటక రాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ పొందారు.
- 1980లో కాంగ్రెస్ విద్యార్థి విభాగం నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించి అంచెలంచెలుగా పార్టీలో ఎదిగారు
- 1989 అసెంబ్లీ ఎన్నికల్లో 27 ఏళ్ల వయసులో తొలిసారిగా సాథనూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్రతిహతంగా ఎనిమిది సార్లు విజయం సాధించారు. 1989 నుంచి 2004 వరకు సాథనూర్ నుంచి 2004 నుంచి 2023 వరకు తన స్వస్థలమైన కనకపుర నుంచి ఎన్నికయ్యారు. కనకపుర నియోజకవర్గాన్ని తనకి కంచుకోటగా మార్చుకున్నారు.
- బంగారప్ప, ఎస్.ఎం. కృష్ణ, సిద్ధరామయ్య హయాంలలో మంత్రిగా వ్యవహరించారు.
- కాంగ్రెస్ సంక్షోభ సమయాల్లో ఉన్నప్పుడు కాపాడుతూ పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2002లో మహారాష్ట్రలో విలాస్‌రావు ప్రభుత్వం విశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఎమ్మెల్యేలను కాపాడే బాధ్యతని శివకుమార్ తీసుకున్నారు.
- 2017 రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ పటేల్‌ను గెలిపించిన ఘనత శివకుమార్‌దే. అప్పుడు కూడా ఎమ్మెల్యేలందరినీ కూడగట్టి గుజరాత్ రిసార్ట్‌లో ఉంచి పటేల్ నెగ్గేలా చేశారు.
- 2018లో హంగ్ అసెంబ్లీ వచ్చినప్పుడు కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటులో కీలక భాగస్వామి అయ్యారు.
- 2018 సెప్టెంబర్‌లో శివకుమార్‌పై ఈడీ కేసులు నమోదయ్యాయి.
- 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడి పగ్గాలు అందుకొని వ్యూహాత్మకంగా రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేశారు. దాని ఫలితంగానే కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యమైన విజయం సాధించింది.
- 2019 సెప్టెంబర్ 3న మనీలాండరింగ్ కేసులో ఈడీ ఆయనను అరెస్ట్ చేసింది. నెలరోజులకి పైగా తీహార్ జైల్లో గడిపారు.
- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ పడిన అత్యంత ధనికుల్లో శివకుమార్‌ది మూడోస్థానం. నియోజకవర్గంలో కేవలం ఒక్క రోజు ప్రచారంతో తన ప్రత్యర్థిపై లక్షకు పై చిలుకు మెజార్టీతో విజయం సాధించడం మరో సంచలనం.

జల్లికట్టుకు జై



ఎడ్ల పందేలు, కంబళ నిర్వహణకూ అనుమతి | **సంబంధిత తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర సవరణ చట్టాలను సమర్థించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ/చెన్నై: ఎద్దులు, దున్నలు, గేదెలతో నిర్వహించే జల్లికట్టు, ఎడ్ల పందేలు, కంబళ వంటి జంతు క్రీడల నిర్వహణకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఈ క్రీడలు జంతు హింస పరిధిలోకి రావని స్పష్టంచేస్తూ గత ఏడాది డిసెంబర్ ఎనిమిదిన రిజర్వ్ చేసిన తీర్పును బుధవారం వెల్లడించింది. ఈ క్రీడల నిర్వహణకు అనుగుణంగా తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన సవరణ చట్టాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సీటీ రవికుమార్‌లు సభ్యులుగా ఉన్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. 'రాష్ట్రాల్లో చేసిన ఆయా సవరణ చట్టాల్లోని నియమ నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేలా చూసే బాధ్యత జిల్లా మేజిస్ట్రేట్/ సంబంధిత కార్యనిర్వహణ వర్గానిదే. శతాబ్దాలుగా తమిళనాట జల్లికట్టు క్రీడ కొనసాగుతోంది. ఇందుకు అనుగుణంగా ఆ రాష్ట్ర శాసనసభ చట్టంలో జోక్యం చేసుకునే ఉద్దేశం సుప్రీంకోర్టుకు లేదు. తమిళనాడు సవరణ చట్టంపై మేం తీసుకున్న నిర్ణయమే మహారాష్ట్ర, కర్ణాటక సవరణ చట్టాలకూ వర్తిస్తుంది.' అని ధర్మాసనంలోని జడ్జీలు తన తీర్పులో స్పష్టంచేశారు. కాగా, 'తమిళుల సాహసం, సంస్కృతికి దర్పణం ఈ క్రీడ. ఈ తీర్పు తమిళనాడు రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. రాష్ట్ర చట్టాన్ని కోర్టు సమర్థించినందుకు సూచికగా వచ్చే జనవరి పొంగళ్ సీజన్‌లో విజయోత్సవ వేడుక చేస్తాం' అని తీర్పు అనంతరం తమిళనాడు సీఎం స్టాలిన్ ట్వీట్‌చేశారు. కాగా, తీర్పుపై జంతుప్రేమికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'జల్లికట్టులో జనం చస్తున్నా అమూల్య సంప్రదాయమంటూ కోర్టు క్రూరమైన క్రీడను పరిరక్షిస్తోంది. తీర్పుపై న్యాయపరంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తాం' అని పెటా ఇండియా వ్యాఖ్యానించింది.

రాణాను భారత్‌కు అప్పగించండి

అమెరికాలోని కాలిఫోర్నియా జిల్లా కోర్టు ఆదేశం



న్యూయార్క్/న్యూఢిల్లీ: అమెరికాలో సాగిస్తున్న న్యాయ పోరాటంలో భారత్‌కు అతిపెద్ద విజయం లభించింది. 2008 నవంబర్‌నాటి ముంబై ఉగ్రవాద దాడిలో ప్రధాన నిందితుడైన తహవుర్ రాణా(62)ను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా న్యాయస్థానం అంగీకరించింది. రాణాను భారత్‌కు అప్పగించాలని కాలిఫోర్నియాలోని 'డిస్ట్రిక్ట్ కోర్టు ఆఫ్ ద సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియా' మేజిస్ట్రేట్ జడ్జి జాక్వెలిన్ కూల్జియన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈ నెల 16వ తేదీన ఉత్తర్వు జారీ చేశారు. భారత్-అమెరికా మధ్య అమల్లో ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందం కింద రాణాను భారత్‌కు అప్పగించాలని పేర్కొన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో అమెరికాలో పర్యటించనున్నారు. మోదీ పర్యటనకు నెల రోజుల ముందు తహవుర్ రాణాను భారత్‌కు అప్పగిస్తూ ఈ ఉత్తర్వు వెలువడడం గమనార్హం. పాకిస్తాన్ సంతతికి చెందిన తహవుర్ రాణాకు కెనడా పౌరసత్వం ఉంది. ఉగ్రవాదులకు సాయం చేశాడన్న ఆరోపణల కింద రాణాకు అమెరికాలోని షికాగో కోర్టు గతంలో 14 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. కాగా, రాణాను సాధ్యమైనంత త్వరగా, వేగంగా భారత్‌కు తరలించడానికి అమెరికా అధికారులతో తరచుగా సంప్రదింపులు జరుపుతున్నామని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా గురువారం తెలిపారు.

28న పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభం

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని మోదీ ఈ నెల 28వ తేదీన ప్రారంభించనున్నారు. భవన ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధాని మోదీని స్పీకర్ బిర్లా గురువారం ఆహ్వానించారని లోక్‌సభ సెక్రటేరియట్ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ కొత్త భవనం లోక్‌సభ చాంబర్‌లో 888 మంది సభ్యులు కూర్చునేందుకు వీలుండగా, రాజ్యసభ చాంబర్‌లో 300 మంది సభ్యులు కూర్చోవచ్చు. ప్రస్తుత పార్లమెంట్ భవనం 1927లో బ్రిటిష్ జమానాలో 96 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా ఇప్పుడది లేదు. దీంతో, 2020 డిసెంబర్ 10న ప్రధాని మోదీ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు.

రబ్రీ దేవిని ప్రశ్నించిన ఈడీ

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై ఆర్‌జేడీ చీఫ్ లాలూ భార్య, బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం 5 గంటలపాటు ప్రశ్నించారు. రబ్రీ దేవి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉద్యోగార్థుల నుంచి ఖరీదైన భూములను తక్కువ ధరకే తీసుకుని, రైల్వేలో ఉద్యోగాలిచ్చినట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ప్రతిష్ట పెరిగాక కళాఖండాలు తిరిగిస్తున్నారు

న్యూఢిల్లీ/పూరీ/హౌరా: విశ్వవ్యాప్తంగా భారత ప్రాచీన సంస్కృతిపై ప్రపంచదేశాలకు గౌరవం మరింత ఇనుమడించిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలో ఇంటర్నేషనల్ మ్యూజియం ఎక్స్‌పో–2023ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. 'ప్రాచీన భారతీయ కళాఖండాలు స్మగ్లింగ్‌కు గురికావడం ఆందోళనకరం. మరోవైపు దేశ ప్రతిష్ట అంతర్జాతీయంగా మరింత పెరగడంతో పలు దేశాల ప్రభుత్వాలు తమ దేశంలోని భారతీయ కళాఖండాలను తిరిగి ఇచ్చేస్తున్నాయి. వారణాసిలో చోరీకి గురైన మా అన్నపూర్ణ విగ్రహం, గుజరాత్‌లో మాయమైన మహిషాసురమర్దిని విగ్రహం, గురు హర్‌గోవింద్ జీ పేరు చెక్కి ఉన్న ఖడ్గం ఇటీవలే భారత గడ్డకు తిరిగొచ్చాయి. ఈ ఎక్స్‌పోతో భారత్‌లో మ్యూజియం సంస్కృతి దశ మారుతుంది. అమృత్‌కాల్‌లో మనం నిర్దేశించుకున్న పంచప్రాణ తీర్మానాల్లో ఒకటైన 'మన వారసత్వానికి పునరుజ్జీవనం'కు ప్రాధాన్యతనిద్దాం' అని మోదీ అన్నారు.

ఒడిశాలో తొలి వందేభారత్ రైలు

రూ.8,200 కోట్లతో ఒడిశాలో పూర్తిచేసిన రైల్వే ప్రాజెక్టులను మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒడిశాలోని పూరీ పట్టణం నుంచి పశ్చిమబెంగాల్‌లోని హౌరా పట్టణాల మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును మోదీ ప్రారంభించారు. ఈ రూట్‌లో ఇదే అత్యంత వేగవంతమైన రైలు. కేవలం ఆరున్నర గంటల్లో 500 కి.మీ.ల దూరాన్ని చేరనుంది. ఇది ఒడిశా రాష్ట్రంలోని తొలి వందేభారత్ రైలు.

బీజేపీ ఎంపీ కటారియా కన్నుమూత

చండీగఢ్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ రత్తన్ లాల్ కటారియా(71) గురువారం కన్నుమూశారు. హరియాణాలోని ఓ గ్రామంలో 1951లో జన్మించిన ఆయన అంబాలా లోక్‌సభ స్థానం నుంచి 1999, 2014, 2019 ఎన్నికల్లో గెలుపొందారు. కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రిగా, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ మంత్రిగా 2019–21 కాలంలో పనిచేశారు. హరియాణా రాష్ట్ర మంత్రిగానూ ఆయన సేవలందించారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మేఘ్‌వాల్‌ను అభినందిస్తున్న రిజిజు

'న్యాయశాఖ' నుంచి రిజిజుకు ఉద్వాసన

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియంలో మరింత పారదర్శకత కోరుతూ తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజును ఆ శాఖ బాధ్యతల నుంచి మోదీ సర్కార్ తప్పించింది. న్యాయవ్యవస్థతో ఎలాంటి బేధాభిప్రాయాలు పొడచూపకూడదనే ఉద్దేశంతోనే ఈయన శాఖను మార్చారని తెలుస్తోంది. పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖల స్వతంత్ర మంత్రి అర్జున్‌సింగ్ మేఘ్‌వాల్‌కు న్యాయశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. కేబినెట్ ర్యాంక్‌లేని ఒక స్వతంత్ర హోదా మంత్రికి కీలకమైన న్యాయశాఖను అప్పగించడం గత పాతికేళ్లలో ఇదే తొలిసారి.

ఎందుకు మార్చారు ?

సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీలను సొంతంగా సుప్రీంకోర్టే కొలీజియం పేరిట నియమించుకోవడం ఎక్కడా లేదని, ఇదొక ఏలియన్ విధానం అని, మాజీ జడ్జీలు దేశవ్యతిరేక గ్యాంగ్‌లుగా తయారయ్యారని రిజిజు గతంలో ఆరోపించారు. దీంతో తమ బాధ్యతలు, విధుల్లో ప్రభుత్వ జోక్యం అనవసరమని సుప్రీంకోర్టు కొలీజియం ఘాటుగా బదులిచ్చింది. మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో రిజిజు వ్యాఖ్యలు విపక్షాలకు ఎన్నికల అస్త్రంగా మారకూడదనే ఉద్దేశంతోనే ఆయనను తప్పించినట్లు వార్తలొచ్చాయి. ఇన్నాళ్లూ మరో మంత్రి జితేంద్ర సింగ్ నిర్వహించిన భూ విజ్ఞానశాస్త్ర శాఖను రిజిజుకు అప్పగించారు. ప్రధాని మోదీ సలహా మేరకు రిజిజు, మేఘ్‌వాల్ శాఖలను మార్చుతున్నట్లు గురువారం రాష్ట్రపతిభవన్ ఒక నోటిఫికేషన్ విడుదలచేసింది. కాగా, బాధ్యతలు మారడంపై రిజిజు స్పందించారు. 'భూ విజ్ఞాన శాఖలో ప్రధాని మోదీ దార్శనికతను సుసాధ్యం చేసేందుకు శాయశక్తుల కృషిచేస్తా. ఇంతకాలం న్యాయశాఖ మంత్రిగా కొనసాగడం గౌరవంగా భావిస్తున్నా. ఇందుకు మద్దతు పలికిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌సహా మొత్తం న్యాయవ్యవస్థకు నా కృతజ్ఞతలు' అని రిజిజు ట్వీట్ చేశారు.

ముంపు బారిన న్యూయార్క్



ఏటా 2 మిల్లీమీటర్ల చొప్పున భూమిలోకి కూరుకుపోతున్న నగరం ● ఆకాశహర్మ్యాలు, సముద్ర మట్టం పెరుగుదలే కారణం

అగ్రరాజ్యం అమెరికాలో ముఖ్యమైన సిటీ న్యూయార్క్. ఖరీదైన కలల నగరంగా, నిద్రపోని నగరంగా పేరుగాంచింది. న్యూయార్క్ సిటీ ఇప్పుడు ముంపు ముప్పును ఎదుర్కొంటోంది. క్రమక్రమంగా భూమిలోకి కూరుకుపోతోంది. ఇందుకు ప్రధాన కారణాలు సిటీలో ఉన్న వేలాది ఆకాశహర్మ్యాలు, వాతావరణ మార్పుల వల్ల సముద్ర మట్టం పెరుగుతుండడం. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్ర తీరంలో ఉన్న న్యూయార్క్ ప్రతిఏటా 2 మిల్లీమీటర్ల మేర కుంగిపోతున్నట్లు యూనివర్సిటీ ఆఫ్ రోడ్ ఐలాండ్ సైంటిస్టుల తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. ఈ వివరాలను 'అడ్వాన్సింగ్ ఎర్త్, స్పేస్ సైన్స్' పత్రికలో ప్రచురించారు. సముద్ర మట్టం పెరుగుదలకు తోడు భారీ భవనాల వల్ల న్యూయార్క్‌లో భూమిపై ఒత్తిడి పెరుగుతోందని, అందుకే నగరం మునిగిపోతోందని పరిశోధకులు చెబుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని నివారణ చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో ఈ ముంపు తీవ్రత ఇంకా ఉధృతమవుతుందని అంటున్నారు. నగరం నివాస యోగ్యం కాకుండాపోయే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం న్యూయార్క్ సిటీకే పరిమితమైన సమస్య కాదని, ప్రపంచ వ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లోని నగరాలు ముంపు బారిన పడుతున్నాయని పేర్కొంటున్నారు.

- భారతదేశంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని జోషీమఠ్ పట్టణంలో ఇటీవల ఇళ్లు కూలిపోయిన సంగతి గుర్తుండే ఉంటుంది. పగుళ్లు ఏర్పడడంతో చాలా ఇళ్లను కూల్చేయాల్సి వచ్చింది. జోషీమఠ్‌లో భూమి అంతర్భాగంలో ఒత్తిడి వల్లే ఇళ్లు కూలిపోయినట్లు గుర్తించారు. న్యూయార్క్‌లోనూ ఈ తరహా ఉత్పాతం పొంచి ఉందని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు.
- న్యూయార్క్ నగర జనాభా 80 లక్షల పైమాటే. ఆకాశాన్నంటే భారీ భవనాలతో సహా 10 లక్షల దాకా భవనాలు ఉన్నాయి. ఇక్కడ కొన్ని ప్రాంతాలు ఏటా 2 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువగానే భూమిలోకి కూరుకుపోతున్నాయి.
- ఉత్తర అమెరికాలో అట్లాంటిక్ తీరంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే సముద్ర మట్టం పెరుగుదల వల్ల ముంపు ముప్పు న్యూయార్క్‌కు మూడు నుంచి నాలుగు రెట్లు అధికంగా ఉందని పరిశోధకులు తెలియజేశారు.
- మరో 80 ఏళ్లలో.. అంటే 2100వ సంవత్సరం నాటికి న్యూయార్క్ సిటీ 1,500 మిల్లీమీటర్లు కుంగిపోతుందని అధ్యయనంలో గుర్తించారు.
- న్యూయార్క్‌పై ప్రకృతి విపత్తుల దాడి కూడా ఎక్కువే. 2012లో సంభవించిన శాండీ తుపాను కారణంగా సముద్రపు నీరు నగరంలోకి చొచ్చుకువచ్చింది. చాలా ప్రాంతాలు జలవిలయంలో చిక్కుకున్నాయి. 2021లో సంభవించిన ఇడా తుఫాను వల్ల సిటీలో మురుగునీటి కాలువలు ఉప్పొంగాయి. డ్రైనేజీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారింది.
- కోస్టల్ సిటీలకు ముంచుకొస్తున్న ప్రమాదానికి న్యూయార్క్ ఒక ఉదాహరణ అని 'యూనివర్సిటీ ఆఫ్ రోడ్ ఐలాండ్'కు చెందిన గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఓషియనోగ్రఫీ సైంటిస్టులు చెప్పారు. ఈ సమస్య ప్రపంచానికి ఒక సవాలు లాంటిదేనని అన్నారు. సముద్ర మట్టాలు పెరగకుండా అన్ని దేశాలు కలిసి చర్యలు తీసుకోవాలని, సముద్ర తీర ప్రాంతాల్లోని నగరాల్లో భవనాల నిర్మాణంపై నియంత్రణ విధించాలని సూచించారు.
- సముద్ర తీరంలో, నది ఒడ్డున, చెరువుల పక్కన నిర్మించే భారీ భవనాలు భవిష్యత్తులో వరద ముంచెత్తడానికి, తద్వారా ప్రాణ నష్టానికి కారణమవుతాయని వివరించారు.
- అన్నింటికంటే ముఖ్యంగా మితిమీరిన నగరీకరణ, పట్టణీకరణ అనేవి ప్రమాద హేతువులేనని తేల్చిచెప్పారు.
- అడ్డూ అదుపూ లేకుండా నగరాలు, పట్టణాలు విస్తరిస్తున్నాయి. వర్షం పడితే అవి చెరువుల్లా మారుతుండడం మనం కళ్లారా చూస్తూనే ఉన్నాం. - సాక్షి, నేషనల్ డెస్క్

ఎల్‌పీ 791-18 డి అనే పేరున్న గ్రహమిది. భూమి పరిమాణంలో ఉంటుంది. భూమికి 90 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీన్లో అగ్ని పర్వతాలు భారీగా ఉండొచ్చని ఖగోళ పరిశోధకులు చెబుతున్నారు. జీవించడానికి అనువైన పరిస్థితులు ఇక్కడ ఉండే అవకాశాలున్నాయంటున్నారు.



సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 19 । మే । 2023

ఇల్లు బాడుగ పేరుతో మహిళకు బురిడీ

యశవంతపుర: దావణగెరె పట్టణంలో ఇల్లు బాడుగకు ఉందని ఓఎల్ఎక్స్ యాప్‌లో ప్రకటనను చూసిన మహిళ రూ.4.50 లక్షలను పోగొట్టుకొంది. అపరిచిత వ్యక్తి ఇల్లు బాడుగకు ఉందని ప్రకటనను పెట్టాడు. అది లీలా హావేరి అనే మహిళ ఆ వ్యక్తిని సంప్రదించింది. పాన్, ఆధార్ కార్డును వాట్సాప్‌లో పంపితే రూ.10 వేలు పంపిస్తానని చెప్పాడు. దీనిని నమ్మిన లీలా హావేరి తన పాన్, ఆధార్ కార్డ్ కాపీలను అతనికి పంపింది. మోసగాడు ఆమె ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి రూ. 10 వేలు పంపించాడు. తరువాత ఆమె అకౌంట్‌ను హ్యాక్ చేసి పలు విడతలుగా రూ.4.50 లక్షలను బదిలీ చేసుకున్నాడు. లీలా బంధువులు దావణగెరె సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

శని మహాత్మ జయంతి వేడుకలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పావగడ: తుమకూరు జిల్లా పావగడలో వెలసిన ప్రఖ్యాత శ్రీ శనీశ్వరాలయంలో శని మహాత్ముని జయంతి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి తైలాభిషేకాలు, నవగ్రహ పూజలు, మంగళ హారతులు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అనంతరాం భట్ నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహా గణపతి, లలితా సహస్ర నామం, పూర్ణాహుతి హోమాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా శని మహాత్ముడు జన్మించిన వైశాఖ బహుళ అమావాస్య శుక్రవారం రోజున సాయంత్రం శ్రీ జ్యేష్ఠాదేవి సమేత శ్రీ శనీశ్వర స్వామి దీపాలంకృత ఉత్సవం జరగనుంది.

దేవెగౌడ @ 91

శివాజీనగర: జేడీఎస్ దళపతి, మాజీ ప్రధాని దేవెగౌడ గురువారం 91వ పుట్టిన రోజు జరుపుకున్నారు. పద్మనాభనగర ఇంటిలో గురువారం కుటుంబ సభ్యులు హెచ్.డీ.కుమారస్వామి, హెచ్.డీ.రేవణ్ణతో పాటు బంధువులు, జేడీఎస్ నాయకులు తదితరులు దళపతిని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జేపీ నగరలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలసి పూజలు చేశారు.

లైంగిక అల్పసంఖ్యాకులను ఆదుకోండి



అక్కై పద్మశాలి

శివాజీనగర: లైంగిక అల్పసంఖ్యాకుల హక్కులకు రక్షణ కల్పించాలని ట్రాన్స్‌జెండర్స్ పోరాట నాయకురాలు అక్కై పద్మశాలి గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. స్వలింగ సంపర్కుల వివాహానికి గుర్తింపు ఇవ్వాలని, ట్రాన్స్‌జెండర్స్ నిత్యం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టసభల్లోనూ కోటా కల్పించాలని కోరారు. తమ సమస్యలపై అసెంబ్లీలో చర్చించేందుకు లైంగిక అల్పసంఖ్యాకులకు అవకాశం కల్పించాలని అన్నారు. తమ స్వయం ఉపాధికి ఆర్థిక సహాయం, ఇల్లు, పిల్లల విద్యకు సహాయం, ఆరోగ్యం, పింఛన్ వసతిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాజంలో తాము కూడా గౌరవంతో జీవించేలా చూడాలని అన్నారు.

మలబార్ థీమ్ సాంగ్ విడుదల



సాక్షి బెంగళూరు: దేశంలో ప్రముఖ బంగారు వజ్రాభరణాల సంస్థ మలబార్ గోల్డ్ – డైమండ్స్ బ్రాండ్ అంబాసిడర్‌ల ద్వారా షో ద వే పేరుతో ఒక ప్రత్యేక థీమ్ సాంగ్‌ను విడుదల చేసింది. ఈ పాట ద్వారా ప్రజాదరణ పొందిన బ్రైడ్స్ ఆఫ్ ఇండియా ప్రచారం పదో ఎడిషన్‌ను విడుదల చేసినట్లు అయింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వధువులతో పాటు బాలీవుడ్ నటులు అలియా భట్, అనిల్ కపూర్ నటించారు. ప్రముఖ స్క్రిప్ట్ రైటర్– రచయిత జూహీ చతుర్వేది రచించగా, సంగీత దర్శకుడు కింగ్ షుక్ చక్రవర్తి స్వరపరిచారు.

తల్లీ కొడుకు ఆత్మహత్య

యశవంతపుర: తల్లీ కొడుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉడుపి జిల్లా కిన్నిముల్కి కన్నర్పాడి బ్రహ్మబైదర్కళలో జరిగింది. ఈ ఘటన గురువారం బయట పడింది. అక్కడ అద్దె ఇంటిలో ఉంటున్న ఎడ్లిన్ డెలిశా అమ్మన్న (83) ఆమె కొడుకు సబెస్పైన్ అమిత్ (46)లు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడారు. ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. సెబెస్పైన్ మృతదేహం ఫ్యాన్‌కు, ఎడ్లిన్ కిటికీకి ఉరి వేసుకున్నారు.



గురువారం మైసూరులో కాళిదాస రోడ్డులో ఓ టైలర్‌షాపు ముందు చంద్రు అనే రౌడీని ప్రత్యర్థులు హత్య చేశారు. ఘటనాస్థలిలో పోలీసులు. (ఇన్‌సెట్లో) చంద్రు

కొత్త సర్కారైనా ఇక్కట్లు తీర్చేనా?

- రాజధానివాసుల ఆశలు
- ట్రాఫిక్, గుంతల రోడ్లు, ముంపు, రవాణా సహా అనేక సమస్యల తిష్ట
- మేనిఫెస్టోలోనూ హామీల జల్లు
- పరిష్కరిస్తే అదే పదివేలు





గతేడాది సెప్టెంబరు మొదటి వారంలో బెంగళూరును భారీ వరదలు ముంచెత్తాయి. సర్జాపుర రోడ్డులో మునిగిన లేఔట్, మారతహళ్లిలో ట్రాఫిక్ రద్దీ, నగరంలో ఎక్కడైనా ఇదే దృశ్యమే

బనశంకరి: బెంగళూరు నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన కాంగ్రెస్, ఐటీ సిటీలో 12 స్థానాల్లో గెలిచి నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమౌతోంది. కొత్త ప్రభుత్వంపై సిలికాన్‌సిటీవాసులు కోటి ఆశలు పెట్టుకున్నారు. ట్రాఫిక్ రద్దీ సమస్య, రోడ్ల గుంతలు, భూగర్భ డ్రైనేజీ అస్తవ్యస్తం తదితరాలతో పాటు అనేక ఇబ్బందులను పరిష్కరిస్తారని ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. హామీలను నెరవేర్చే బాధ్యత కొత్త ప్రభుత్వం పై ఉంది.

ఎటుచూసినా ట్రాఫిక్ రద్దీ బెడద

బెంగళూరు నగర ట్రాఫిక్ సమస్య అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించింది. ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని నత్తనడకన సంచరించే వాహనాల జాబితాలో ప్రపంచంలో రెండో స్థానంలో నిలిచింది. సిగ్నల్ సింక్రనైజ్, ఏఐ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో పాటు పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నప్పటికీ ట్రాఫిక్ రద్దీ నుంచి నగరవాసికి విముక్తి కలగలేదు. పది నిమిషాలు వర్షం వస్తే సంచార కష్టాలు రెట్టింపు అవుతాయి.

అలాగే గత ప్రభుత్వం ప్రకటించిన మెట్రోపాలిటన్ ల్యాండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఎంఎల్‌టీఏ) అమలు ఊసేలేదు. కానీ పథకం రూపురేఖలు గురించి ఎలాంటి ప్రస్తావన కూడా లేదు. దీంతో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎంఎల్‌టీఏ అమలు చేసే బాధ్యత ఉంది. అంతేగాక కొన్నేళ్లుగా నత్తనడకన సాగుతున్న సబర్బన్ రైల్వే పథకం పూర్తిచేసే అవసరం ఉంది.

నగర సమగ్ర యోజన ఏదీ?

గతంలో ప్రకటించిన పథకాల్లో ఒకటైన బీడీఏ నగరాభివృద్ధి– 2035 మాస్టర్‌ప్లాన్ నత్తనడకన సాగుతోంది. కాంగ్రెస్ సుస్థిర, ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణం కోసం 2042 పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. దానిని చేపట్టాల్సి ఉంది.



బీబీఎంపీ నిర్వహణపై ఆశలు

బీబీఎంపీ నిర్వహణ కోసం సమగ్ర చట్టం రూపొందిస్తామని కాంగ్రెస్‌పార్టీ హామీ ఇచ్చింది. భూగర్భ డ్రైనేజీ, రవాణా, వసతి, అభివృద్ధి ప్రాధికారను అమల్లోకి తీసుకువస్తామంది. అలాగే పలు వైఫల్యాలతో సతమతమౌతున్న పాలికెకు ప్రభుత్వం పునరుజ్జీవం తేవాలి. గత మూడేళ్లుగా బీబీఎంపీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్పొరేటర్లు, మేయర్లు లేక అధికారులు ఆడింది ఆటగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వార్డుల పునర్విభజన గందరగోళం ముగిసిన తక్షణమే బీబీఎంపీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటితో పాటు ట్రాఫిక్ సమస్యలను నివారించడానికి టీఓటి డ్రోన్ పర్యవేక్షణ, రద్దీ నివారణకు ప్రైవేటు భాగస్వామ్యంతో సొరంగ రోడ్ల నిర్మాణం, నమ్మ మెట్రో, ఉపనగర రైలు పథకం, ఆర్టీసీ, బీఎంటీసీ మధ్య సమన్వయం సాధించే వ్యవస్థ, పెరిఫెరల్ రింగ్ రోడ్డు, ఔటర్‌రింగ్‌రోడ్డు నిర్మాణం సహా అనేక అంశాలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రస్తావించింది. ఇవన్నీ నెరవేరిస్తేనే నగరవాసికి ఊరట.



గత ఏడాది వరదల్లో ఆర్‌పీసీ లేఔట్ జలమయం

గుంతల రోడ్లతో అవస్థలు

ఉద్యాన నగరంలో వాహనదారులకు సంకటంగా మారిన గుంతల రోడ్ల వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. గత ఏడాది ట్రాఫిక్ పోలీసుల సమాచారం ప్రకారం నగరంలో 10 వేల రోడ్ల గుంతలు ఏర్పడ్డాయి. 2017 నుంచి రోడ్డు గుంతలతో ఏర్పడిన ప్రమాదాలతో 17 మంది మృతి చెందగా మరెంతో మంది గాయపడ్డారు. వర్షాకాలం రాకముందే రోడ్ల గుంతలను పూడ్చివేయాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.



భయపెట్టే ముంపు ముప్పు

వర్షాకాలం వచ్చిందంటే ముంపును తలచుకుని ప్రజలు హడలిపోతారు. గత ఏడాదిలో కురిసిన భారీ వర్షాలతో మహదేవపు, వైట్‌ఫీల్డ్, బెళ్లందూరుతో పాటు పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. రాచ కాలువలను ఆక్రమించి కట్టిన కట్టడాలను పాలికె హడావుడిగా కూల్చివేసింది. కాంగ్రెస్ నేత సిద్దరామయ్యతో పాటు కాంగ్రెస్‌నేతలు వరదనీటిలో బోటులో ప్రయాణించడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను వ్యంగ్యంగా విమర్శించారు. రాజ కాలువల అసమర్థ నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమే వరదలకు కారణమని ఆరోపించారు. ప్రభుత్వంపై తీవ్ర నిరసన ప్రజల్లో వ్యక్తమైంది. ఇంత జరిగినప్పటికీ చాలా ప్రాంతాల్లో పరిస్థితి మెరుగుపడే చర్యలు లేవు. కుండపోత వస్తే మళ్లీ జలమయం తప్పదనే భయం నగరవాసుల్లో ఏర్పడింది. బీబీఎంపీ ప్రకారం 58 లోతట్టు ప్రాంతాలకు ముంపు భయం ఉంది. దీనిని నివారించే బాధ్యత నూతన ప్రభుత్వం పై ఉంది.

హస్తంలో ఉత్సాహం

- బెంగళూరులో సిద్దు, డీకే నివాసాల వద్ద ఉత్సవ సందడి

శివాజీనగర: రాష్ట్రానికి తదుపరి ముఖ్యమంత్రి ఎవరు అన్న విషయంపై ఐదు రోజుల ఉత్కంఠకు తెరపడింది. సుదీర్ఘ చర్చలు, బుజ్జగింపుల తరువాత మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సీఎం కుర్చీ, డీకే శివకుమార్‌కు డిప్యూటీ సీఎం కుర్చీ సిద్ధమయ్యాయి. ఈ నెల 20న సిద్దరామయ్య, డీకే శివకుమార్, పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం. బెంగళూరులో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం మిన్నంటింది. కంఠీరవ మైదానంలో ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు సాగుతున్నాయి.

సర్కారు ఏర్పాటుకు గవర్నర్‌కు వినతి

135 స్థానాలను గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్దరామయ్య, శివకుమార్‌లు రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు వినతి చేశారు. గురువారం రాత్రి గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు.

నివాసాల వద్ద సందడి

బనశంకరి: సిద్దరామయ్యకు ముఖ్యమంత్రి పదవి ఖాయం కావడంతో నగరంలో ఆయన ఇంటివద్ద అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలతో సందడి నెలకొంది. ఇంటి వద్ద అభిమానులు, కార్యకర్తలు స్వీట్లు పంచుతూ నృత్యాలు చేశారు. టపాసులు కాల్చి సంబరాలు చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. పెద్ద పెద్ద ఫ్లెక్సీలు అమర్చారు. అలాగే డీకే శివకుమార్ ఇంటి వద్ద మద్దతుదారులు, అభిమానులు భారీగా బ్యానర్లు, ఫ్లెక్సీలను కట్టారు. సీఎల్పీ సమావేశం గురువారం సాయంత్రం కేపీసీసీ ఆఫీసు వద్ద ప్రశాంతంగా ముగిసింది.



గురువారం బెంగళూరులో నివాసానికి వస్తున్న సిద్దరామయ్య కార్ల కాన్వాయ్



సిద్దరామయ్య ఇంటి వద్ద కళాబృందాల సంరంభం



మంత్రి పదవులు ఎవరికి?

సీఎం, డిప్యూటీ సీఎం ఖరారు కావడంతో అందరి దృష్టి మంత్రి పదవులపై పడింది. స్వతహాగానే సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు తమ అనుచర ఎమ్మెల్యేలకు ఎక్కువగా మంత్రి పదవులకు ఎంచుకుంటారు. వారిని కాదని మంత్రి పదవులు తెచ్చుకునే సీనియర్లు ఎక్కువమందే ఉన్నారు. పదవుల కోసం అప్పుడే ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ వద్ద లాబీయింగ్ చేపట్టినట్లు సమాచారం. సిద్దు, శివకుమార్‌లను ప్రసన్నం చేసుకుని పదవులను పొందే పనిలో కొందరు శాసనసభ్యులు నిమగ్నమయ్యారు.

ఈ ప్రభుత్వం ఎన్నాళ్లో?

- త్వరలో కొత్త సమీకరణాలు: కుమార



దొడ్డబళ్లాపురం: రాబోయే అక్టోబర్, నవంబర్ నెలల్లో రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణాలు ఉంటాయని జేడీఎస్ మాజీ సీఎం కుమారస్వామి జోస్యం చెప్పారు. గురువారంనాడు రామనగరలో మాట్లాడిన ఆయన కొత్తగా ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వం నిలకడగా ఉండదని, మూడు నెలల్లో ఎలాంటి మార్పులు జరుగుతాయో చూడాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత రాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. త్వరలో తాలూకా,జిల్లా పంచాయతీల ఎన్నికలు వస్తాయని, అప్పుడు పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో అనుకున్న స్థానాల్లో గెలవకపోవడానికి అనేక కారణాలున్నాయని, ఈ ఓటమి వల్ల పార్టీకి ధోకా ఏమీ లేదని, ఇలాంటి పరాజయాలు తమకు కొత్త కాదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడం అంత సులభం కాదన్నారు. ప్రకటించిన పథకాలకు ఏడాదికి కనీసం రూ. 70 వేల కోట్లు అవసరమని, అన్ని నిధులను ఎలా సమకూరుస్తారని ప్రశ్నించారు.

వంట వివాదంలో జంట హత్యలు



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

- ఇద్దరిని రాళ్లతో కొట్టి చంపిన సహచర కూలీ
- శివమొగ్గ జిల్లా తీర్థహళ్లిలో ఘోరం

శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలోని తీర్థహళ్ళి పట్టణంలో ఇద్దరు కూలి కార్మికులను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. గురువారం తెల్లవారుజామున ఈ హత్యలు జరిగినట్లు పట్టణ పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. హతులు ఉత్తర కర్ణాటకకు చెందిన కూలి కార్మికులుగా గుర్తించారు. పట్టణంలో ఉన్న కురువళ్ళిలోని వితలనగరానికి వెళ్లే మార్గంలో ఉన్న పుత్తిగ మఠం వద్ద నిర్మాణంలో ఉన్న విశ్వకర్మ సముదాయ భవనం లోపల ఇద్దరిని బండరాళ్లతో బాది చంపారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. ఎవరు వారిని హత్య చేశారు?, కారణాలు ఏమిటి అనేదానిపై విచారణ చేపట్టారు.

ఏం జరిగిందంటే

ఘటనాస్థలిని పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించి విచారణ చేపట్టగా బయటపడింది. భోజనం విషయంలో జరిగిన గొడవే కారణమని తేలింది. హతులు, నిందితుడు దావణగెరెకు చెందినవారని పోలీసులు తెలిపారు. నిందితుడు రాజన్న (58) కాగా, హతులు బీరేష్ (35), మంజునాథ్ (46). వీరందరూ టైల్స్ పనుల కోసం వచ్చారు. విశ్వకర్మ భవనంలో పనులు చేస్తూ అక్కడే ఉండేవారు. రాజన్న వంట చేసేవాడు. బుధవారం రాత్రి దగ్గరలో ఒక శుభకార్యం జరగగా వారు కార్మికులకు ఇడ్లీలు చట్నీ ఇచ్చారు. వాటిని ఆరగిస్తున్న సమయంలో రాజన్న వంట చేయలేదని బీరేష్, మంజునాథ్ గొడవ చేశారు. తరువాత అందరూ పడుకున్న సమయంలో మనసులో పగ పెంచుకున్న రాజన్న వారిద్దరినీ బండరాయితో కొట్టి హత్య చేశాడు. నిందితున్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

నారా శరత్‌రెడ్డికి సన్మానం



శరత్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్లు

బళ్లారి అర్బన్: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నగర కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన నారా భరత్‌రెడ్డి గెలుపు కోసం విదేశం నుంచి వచ్చి పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించి నగరంలోని అన్ని వార్డుల్లో బూత్‌ల వారీగా ప్రణాళిక ప్రకారం ప్రచారం చేయించి విజయానికి కృషి చేసిన అతని సోదరుడు నారా శరత్‌రెడ్డిని నగర కార్పొరేటర్లతో పాటు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఆంధ్రాళ్ రామాంజినేయులు, జబ్బార్, గాజుల శ్రీనివాసులు, రత్నబాబు, దానాశ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ తీయమన్నందుకు బస్సు డ్రైవర్‌పై వ్యక్తి దాడి

హుబ్లీ: రోడ్డులో నిలిపిన బైక్‌ను తీయాలని కోరిన కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన గురువారం కట్టెల అడ్డా సమీపంలో చోటు చేసుకుంది. ప్రకాష్ అనే వ్యక్తి దాడికి పాల్పడిన వ్యక్తి. బస్సు డ్రైవర్ నిజలింగప్ప రోడ్డులో అడ్డంగా ఉన్న బైక్‌ను కొంచెం పక్కకు తీయమని కోరగా అందుకు కోపగించుకున్న ప్రకాష్ ఏకంగా బస్సు డ్రైవర్‌పై దాడి చేసి దుర్భాషలాడుతూ చాకుతో బెదిరించాడు. ఈ ఘటనపై హుబ్లీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది.

పీయూ కళాశాలను ప్రారంభించరూ



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కంప్లి: పట్టణంలో పీయూ కళాశాల ప్రారంభానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తూ భారతీయ దళిత ప్యాంథర్స్ తాలూకా అధ్యక్షులు ఎస్.సయ్యద్ వారిస్ పట్టణంలోని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ గుడదూరుకు వినతిపత్రం అందించారు. పదాధికారులు మనోజ్‌కుమార్ సీ.రోషన్, బీహెచ్ఎం గురుశాంత శాస్త్రి పాల్గొన్నారు.

బీపీసీ కోర్సులు ప్రారంభం

గంగావతి: తాలూకాలోని శ్రీరామనగర్ చిలుకూరి నాగేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీపీసీ ప్రథమ సంవత్సరపు కోర్సులను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనేపథ్యంలో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీని అరెస్ట్ చేయాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: న్యూఢిల్లీలో కుస్తీ క్రీడాకారిణులపై లైంగిక దౌర్జన్య ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజేష్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శరణ బసవ మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడాకారులు, ప్రపంచ ఛాంపియన్ దేహదారుఢ్య మహిళా క్రీడాకారిణుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఎంపీని అరెస్టు చేయాలని జిల్లాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పార్టీ పురోభివృద్ధి కోసం శ్రమించాలి



మాట్లాడుతున్న భీమశేఖర్ పాటిల్

గంగావతి: కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్ధన్‌రెడ్డిని నియోజకవర్గ ప్రజలే గెలిపించారని ఆ పార్టీ యువజన విభాగపు రాష్ట్ర అధ్యక్షులు భీమశేఖర్ పాటిల్ తెలిపారు. కొప్పళ నగరంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టం చేయాలని, స్థానిక సంస్థలను సైతం కైవసం చేసుకొనేందుకు బూత్‌ల వారీగా కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లాధ్యక్షుడు మనోహర్‌గౌడ హేరూరు, మహిళా విభాగపు జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లూ కొనసాగడం కత్తిమీద సామే



నిజలింగప్ప



దేవరాజ అరస్



పథకాల్లో దేవరాజ్ అరస్ ముద్ర

- ఇప్పటివరకు ముగ్గురికే ఆ ఘనత

బనశంకరి: కర్ణాటక 24వ ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య ఎన్నికకాగా 20వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. గతంలోనూ ఆయన ఐదేళ్ల పూర్తి కాలం ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇప్పటివరకు ఐదేళ్ల అవధి ఆ పదవిలో ఉన్నది ముగ్గురు మాత్రమే. పలువురు ముఖ్యమంత్రులు అవధి పూర్తి కాకముందే అధికారం కోల్పోయారు. మరికొందరు గడువు తీరకముందే ఎన్నికలు రావడంతో అవకాశం కోల్పోయారు. 2013 నుంచి 2018 వరకు సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాటు పనిచేశారు. ఎస్.నిజలింగప్ప, దేవరాజ అరస్‌లు గతంలోనే పూర్తికాలం పదవిలో ఉండి సత్తా చాటుకున్నారు. తరువాత ఎంతోమంది సీఎంలు అయ్యారు కానీ సంక్షోభాలలో చిక్కుకుని, లేదా హైకమాండ్ చేత మధ్యలోనే పదవీచ్యుతులయ్యారు.

మైసూరు సీఎం.. ఎస్.నిజలింగప్ప

కర్ణాటక.. మైసూరు రాష్ట్రంగా ఉన్న సమయంలో ఎస్.నిజలింగప్ప ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పాలించారు. 1956 నుంచి 1958 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండేళ్ల పాటు సీఎంగా పరిపాలన చేశారు. 1958లో బీడీ జత్తి సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. మార్చి 14, 1962 నుంచి 20 జూన్ 1962 వరకు సీఎంగా ఎస్ఆర్ కంఠి ఎన్నికయ్యారు. జూన్ 21, 1962 నుంచి సీఎంగా ఎన్నికైన నిజలింగప్ప మే 29, 1968 వరకు ముఖ్యమంత్రిగా పూర్తికాలం పదవిలో ఉన్నారు.

మైసూరు రాష్ట్రం కర్ణాటకగా మారిన తరువాత 1972 మార్చి 20 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంలో దేవరాజ అరస్ ముఖ్యమంత్రిగా ఆసీనులయ్యారు. ఐదేళ్ల పాటు ఆయన జనరంజక పాలన అందించారు. వెనుకబడిన వర్గాల బాగు కోసం అనేక పథకాలను అమలు చేశారు. 1978 ఫిబ్రవరి 28న మరోసారి ముఖ్యమంత్రి అయి 1980 జనవరి 7 వరకు పదవిలో కొనసాగారు.

వేసవిలో ఉత్తర కర్ణాటకలో జల క్షామం



బాగలకోటె జిల్లాలోని ఆల్మట్టి జలాశయం(ఫైల్)

- నిరాశాజనకంగా ఆల్మట్టిలో నీటి నిల్వ
- పల్లెల్లో మంచినీటి కోసం హాహాకారాలు



అత్తనూరులోని చెరువు వద్దకు నీటి కోసం ఖాళీ బిందెలతో వెళుతున్న గ్రామస్తులు

రాయచూరు రూరల్: గత ఏడాది రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసినా వేసవిలో ఉత్తర కర్ణాటకలో జలక్షామం ఏర్పడింది. బాగల్‌కోటె జిల్లా ఆల్మట్టి డ్యాంలో అనుకున్నంత మేర నీటి నిల్వ లేదు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉంది. డ్యాం గరిష్ట స్థాయి నీటి మట్టం 519.60 మీటర్లు, 123.081 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం 513.70 మీటర్లు, 52.424 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. డెడ్ స్టోరేజీ 17.62 టీఎంసీలు కాగా, 34.804 టీఎంసీల నీటిని ఈ నెలాఖరు వరకు కాలువలకు, తాగునీటి అవసరాలకు వినియోగించాలి. గత ఏడాది ఇదే సమయానికి డ్యాంలో 516.08 మీటర్లు, 73.838 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది డ్యాంలో 21.414 టీఎంసీల నీటి నిల్వ తక్కువగా ఉంది. మే, జూన్ నెలాఖరు వరకు ఆల్మట్టి జలాశయం నుంచి విజయపుర, బాగల్‌కోటె, యాదగిరి, కలబుర్గి, రాయచూరు జిల్లాల్లో తాగునీటి పథకాలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. సిరవార తాలూకా అత్తనూరులో ప్రజలు బిందెలతో చెరువు నీటిని తెచ్చుకుంటున్నారు. మాన్వి తాలూకా కల్లూరులో కిలోమీటర్ దూరం నడుచుకుంటూ వెళ్లి నీటిని తెచ్చుకొనే పరిస్థితి నెలకొంది. ఎన్నికలు ముగిసినా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను పరిష్కరించేవారు కరువయ్యారు. జిల్లాలో కృష్ణ, తుంగభద్ర నదులున్నా నీటి సమస్య జటిలమవుతుండడం గమనార్హం.

21న వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమ్మేళనం

- సోషల్ మీడియా విభాగం వెల్లడి



కార్యక్రమం పోస్టర్

సాక్షి బెంగళూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం ఆత్మీయ సమావేశాన్ని ఈ నెల 21న ఆదివారం నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మీడియా, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సజ్జల భార్గవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా మధుసూదన్ హాజరవుతారు. ఈ కార్యక్రమం పోస్టర్ విడుదల శుక్రవారం బెంగళూరులో జరగనుంది. ఈ మేరకు బెంగళూరు ఐటీ విభాగం ప్రతినిధులు కుమార్, భాస్కర్ రెడ్డి, ప్రతాప్ ముకుందాపురం తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇచ్చే విభాగాల్లో సోషల్ మీడియా ఒకటని, అలాంటి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా దెబ్బకి అటువైపు ఎవరైనా తలక్రిందులు అవ్వాల్సిందేనని అన్నారు. ఇటీవల కాలంలోనే ఎన్నో మార్పులు తీసుకొస్తూ సోషల్ మీడియా సైనికులకు ప్రాధ్యాన్యతనిస్తూ ముందుకు నడిపిస్తున్న రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల భార్గవ్ ముఖ్య అతిథిగా బెంగళూరులో జరిగే సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో పాల్గొంటున్నారని తెలిపారు. 21న ఉదయం 9 గంటలకు ది కోరమంగళ క్లబ్‌లో జరిగే ఈ సమ్మేళనానికి పార్టీ అభిమానులు, సోషల్ మీడియా మిత్రులు, ఐటీ విభాగం సభ్యులు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని మనవి చేశారు.

ప్రదీప్ ఈశ్వర్‌కు అమాత్యగిరీ ఇవ్వాలి

బళ్లారి అర్బన్: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఆరోగ్య శాఖా మంత్రి డాక్టర్ సుధాకర్‌పై చిక్కబళ్లాపుర ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రదీప్ ఈశ్వర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కర్ణాటక బలిజ సమాజ బాంధవులు దేవీనగర్ జీ.శ్రీనివాసులు, పటేల్‌నగర్ రాజేష్, మిల్లర్‌పేట్ అశోక్, రంగనాయకులు, జాంబవంత, జెడ్పీ శ్రీరాములు, కుమారస్వామి, శ్రీరాములు నాయుడు, వేణుగోపాల్, శ్రీధర్ ఒత్తిడి చేశారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వండి

కంప్లి: ఈసారి అత్యధిక మెజార్టీలో గెలుపొందిన ఎమ్మెల్యే గణేష్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కంప్లి బ్లాక్ యూత్ కాంగ్రెస్ సమితి అధ్యక్షులు ఆర్‌పీ శశికుమార్ మనవి చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ఎమ్మెల్యే ప్రతిపక్షంలో ఉండి కూడా రూ.కోట్లాది నిధులు తెచ్చి క్షేత్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారన్నారు. మస్కి అసెంబ్లీ క్షేత్ర ఉప ఎన్నికల్లో ఇన్‌చార్జిగా ఉండి అక్కడి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేశారన్నారు. అందువల్ల సీఎం సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షులు డీకే.శివకుమార్ ఎమ్మెల్యే గణేష్‌కు అమాత్య పదవి కట్టబెట్టాలన్నారు. ఉపాధ్యక్షులు రాజాబక్షి, కోటిహాల్ వీరేష్, శాంతి, ప్రధాన కార్యదర్శి లేబల్ వీరేష్, కార్యదర్శి, సభ్యులు గోపినాథ్, రాము, మారుతి, చేతన్, యల్లప్ప, బాష, ఫయాజ్, ఫారూక్ పాల్గొన్నారు.

అనాథలకు దుస్తుల పంపిణీ

రాయచూరు రూరల్: మాజీ ప్రధానమంత్రి దేవెగౌడ 91వ జన్మదినోత్సవాన్ని నగరంలో గురువారం ఆచరించారు. కనకదాస అనాథ శరణాలయంలో జేడీఎస్ కార్యాధ్యక్షుడు శివశంకర్ నేతృత్వంలో పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నీటిపారుదల రంగానికి దేవెగౌడ ప్రాముఖ్యత నిచ్చారని గుర్తు చేశారు.

వ్యసనాలతో ఆర్మీ జవాన్ పక్కదారి

- దొంగతో కలిసి బైక్‌ల చోరీలు



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం (శ్రీకంఠం సర్కిల్): ఆర్మీలో జవాన్‌గా ఉద్యోగం చేస్తున్న వ్యక్తి దేశ రక్షణ బాధ్యతను విస్మరించి దొంగగా అవతారమెత్తాడు. తన వ్యసనాలను తీర్చుకునేందుకు దొంగతో చేతులు కలిపి ద్విచక్ర వాహనాలను అపహరిస్తూ అనంతపురంలో త్రీటౌన్ పోలీసులకు పట్టుబడ్డాడు. ఆర్మీ జవాన్‌తో పాటు వాహనాల దొంగను అరెస్ట్ చేసిన పోలీసులు ఇద్దరి నుంచి రూ.13.60 లక్షలు విలువ చేసే 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

గురువారం స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ కత్తి శ్రీనివాసులు వివరాలను వెల్లడించారు. అనంతపురం ప్రియాంకనగరుకు చెందిన గులాం సద్దాం హుస్సేన్ ప్రస్తుతం అసోంలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను తాగుడు, జూదం లాంటి వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో అప్పులు కుప్పలుగా చేసి వారి నుంచి తప్పించుకు తిరిగే పరిస్థితి దాపురించింది. ఈ క్రమంలో గార్లదిన్నె మండలం, పెనకచర్ల గ్రామానికి చెందిన రాజశేఖర్ అనే ద్విచక్ర వాహనాల దొంగతో ఇతనికి పరిచయమైంది. ఇద్దరు కలిసి వాహనాలను అపహరించి తద్వారా వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చుకోవచ్చని భావించారు.

డ్యూటీకి సెలవుపెట్టి చోరీలు

సద్దాం తన డ్యూటీకి సెలవు పెట్టి మరీ అనంతపురం వచ్చి పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీచేసేవారు. ఇలా అనంతపురం, బుక్కరాయసముద్రం, పామిడి, గుత్తి, తాడిపత్రి, కళ్యాణదుర్గం, ధర్మవరం, బనగానపల్లి, కర్ణాటకలో పలుచోట్ల మోటారుసైకిళ్లను దొంగతనం చేసి వాటిని అనంతపురం శివారులోని నేషనల్ పార్క్ దగ్గర గల ఒక పాడుబడిన షెడ్ లో దాచారు. తరచుగా బైక్ చోరీలపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు నిఘా పెట్టి నిందితులను అరెస్టు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నాగేంద్రకు మంత్రి పదవి?

బళ్లారి అర్బన్: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మెజారిటీని సాధించిన నేపథ్యంలో బళ్లారి గ్రామీణ నియోజక వర్గం నుంచి గెలుపొందిన బీ.నాగేంద్రకు మంత్రి పదవి ఖాయమని తెలుస్తోంది. వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ముందు నుంచి సిద్దరామయ్యతో మంచి సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఐదు నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఐదు మందిలో తుకారాం కూడా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొదారు. అయితే గతంలో తుకారాం మంత్రిగా పని చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో తొలిసారిగా తనకు మంత్రి పదవి ఇవ్వాలని నాగేంద్ర కోరినట్లు సమాచారం.

రేపటి నుంచి పకడ్బందీగా సీఈటీ

- పక్కాగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు
- కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలు
- 11 కేంద్రాల్లో రాయనున్న 5946 మంది విద్యార్థులు

బళ్లారి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మే 20 నుంచి ప్రారంభం కానున్న సీఈటీ పరీక్షల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో 5946 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్ మహ్మద్ జుబేరా ఓ ప్రకటనలో తెలిపారు. మే 20, 21 తేదీల్లో రెండు రోజులపాటు వివిధ వృత్తిపర కోర్సులకు సీఈటీ పరీక్ష జరుగుతున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న కన్నడిగులకు 22న కన్నడభాషలో పరీక్ష ఉంటుందని తెలిపారు. జిల్లాలో పీయూ కళాశాలలు, డిప్లమో కళాశాలల్లో కలిపి మొత్తం 11 కేంద్రాల్లో పరీక్ష జరుగనున్నట్లు తెలిపారు. పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, కళాశాలల ప్రిన్స్‌పాళ్లు, అధ్యాపకులు పరీక్షాధికారులుగా ఉంటారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేసినట్లు ఆయన తెలిపారు.

కూలీలకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

గంగావతి: పనికి ఆహారం పథకం కింద పని చేసే కూలీలకు వారు పని చేసే స్థలంలోనే తాలూకా, గ్రామ పంచాయతీ వారు ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కూలీలకు బీపీ, షుగర్, ఇతర పలు రకాల జబ్బులకు ఆనెగుంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి లారెన్స్ నేతృత్వంలో 110 మందికి ఆరోగ్య పరీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో తాలూకాకు చెందిన హనుమేష్, గ్రామ పంచాయతీ చెందిన యశోద, మహాలింగప్ప పాల్గొన్నారు.

నరేగ కార్మికులకు వైద్య శిబిరం

రాయచూరు రూరల్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగ)లో పని చేసే వ్యవసాయ కూలీ కార్మికులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం తాలూకాలోని హీరాపూర్‌లో జరిగిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఎన్ఈసీ అధికారి ధ నేరాజ్ ప్రారంభించారు. నరేగ పథకంలో పని చేసే కూలీ కార్మికులకు రక్తపోటు(బీపీ), సుగర్, ఇతర వ్యాధులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత

మదనపల్లి: మండలంలోని కోటవారిపల్లె పంచాయతీ అడవిలోపల్లె వద్ద ఉన్న నడించెరువులో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన కర్ణాటక వాసి శంకర (50) మృతదేహాన్ని గురువారం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెలికి తీశారు. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన శంకర జ్యోతిష్యం చెబుతూ జీవించేవాడు. ఇతను పట్టణంలోని రామారావుకాలనీలో నివాసమున్న శ్రీనివాసులు హిందూపురం, బోయపేటకు చెందిన నంజుండప్పతో కలిసి అడవిలోపల్లె వద్ద ఉన్న నడించెరువులో మంగళవారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. వల వేశారు. తర్వాత ముగ్గురూ కలిసి మద్యం తాగారు. చేపలు పడేంత వరకు ఈత కొట్టాలని చెరువులోకి దిగారు. అయితే చెరువులో ఉపాధి హామీ గుంతలు లోతుగా ఉండటంతో అంచనా వేయలేక శంకర ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు విషయాన్ని స్థానికులకు తెలిపారు. వారు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. రెండు రోజుల పాటూ కష్టపడి మూడో రోజున మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

నెట్టికంటుని హుండీల లెక్కింపు



హుండీ నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 41.69 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో తెలిపారు. గురువారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. 51 రోజులకు గానూ రూ.41,69,670 నగదు, అన్నదానము హుండీ ద్వారా రూ.35,232 నగదును భక్తులు స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. 50 గ్రాముల బంగారు, 1.3 కిలోల వెండి కానుకలు లభ్యమయ్యాయి. భక్తులు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో వంచన

హుబ్లీ: పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో వంచనకు పాల్పడిన ఘటన హుబ్లీ సైబర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ధార్వాడ హొసయల్లాపుర నివాసి డీ.వాసవి అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా ఆన్‌లైన్‌లో వివిధ వస్తువులను కొనుగోలు చేస్తే పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.200, రూ.390 చొప్పున బాధితుడి ఖాతాకు వేశారు. అనంతరం మరింత సొమ్మును బాధితుడి ఖాతాకు వేసి అతని ఖాతా వివరాలు తెలుసుకొని దశల వారీగా మభ్యపెట్టి రూ.1.70 లక్షల సొమ్మును తన ఖాతాలోకి బదలాయించుకుని వంచించాడు.

పనిలో చేరిన రోజే కూలీ మృతి



మృతి చెందిన నిజాముల్లాఖాన్

పరిగి: పుట్టపర్తి జిల్లా పెనుకొండ పరిధిలో పరిగి మండలంలోని మోదా గ్రామ పరిధిలో ఉన్న మహర్షి ఐరన్ ఫ్యాక్టరీలో గురువారం కరెంట్ షాక్‌తో నిజాముల్లా ఖాన్(33) అనే కూలీ మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబళ్లాపుర జిల్లా గోటఖానాపుర గ్రామానికి చెందిన నిజాముల్లాఖాన్ అదే రోజు పనిలో చేరాడు. ఫ్యాక్టరీలో పని చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగలడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై విలేకరులు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎవరూ లేరని దురుసుగా సమాధానమిచ్చారు. పరిగి పోలీస్‌స్టేషన్‌లో మృతుని తల్లి మోషిన్‌తాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోలారు వార్తలు...

మినీ విధానసౌధ..అసౌకర్యాల వ్యథ

- ఇబ్బందుల్లో ప్రజలు



నగరంలో నిర్మించిన మినీ విధానసౌధ ఇదే

కేజీఎఫ్ : నగరంలో నూతనంగా నిర్మించిన మినీ విధానసౌధలో సౌలభ్యాల కొరతతో కార్యాలయానికి వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మినీ విధానసౌధను నిర్మించినప్పటి నుంచి సరైన నిర్వహణ లేక సౌధ ప్రాంగణంలో స్వచ్ఛత కరువైంది. మినీ విధానసౌధ ప్రారంభానికి రెవిన్యూ శాఖా మంత్రి ఆర్.అశోక్ వస్తున్నారని హడావిడి చేసి గతేడాది అక్టోబర్‌లో ఆత్రుతతో ప్రారంభించారు. ఇంకా కొన్ని పనులు మిగిలి ఉండగానే కట్టడాన్ని రెవిన్యూ శాఖకు అప్పగించారు. పనులు బాకీ ఉండడం వల్ల సౌలభ్యాలు సరిగా లేక సిబ్బందితో పాటు మినీ విధానసౌధకు వచ్చే ప్రజలు కూడా నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సుమారు మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన మినీ విధానసౌధ ఆవరణలో పచ్చదనం, నిలువ నీడ కరువైంది. ఇంతవరకు లిఫ్ట్‌ను ఏర్పాటు చేయకపోవడంతో కార్యాలయానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మినీ విధానసౌధలో పలు గదులు ఖాళీగా ఉన్నా ఇంకా కొన్ని కార్యాలయాలను ప్రైవేటు బాడుగ భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించకపోవడంతో ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం తాలూకా ప్రజలు బంగారుపేటకు వెళ్లాల్సి వస్తోంది. తమ పనుల కోసం నిత్యం మినీ విధానసౌధకు వస్తున్న వారి కోసం కనీసం మరుగుదొడ్లు నిర్మించలేదు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యంలో మినీ విధానసౌధలో తగిన సౌలభ్యాలను కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఓటమిపై విశ్లేషించుకున్నాం



మాట్లాడుతున్న వేణుగోపాల్

కోలారు: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు జిల్లాలోని ఆరు స్థానాల్లోనూ ఓటమి పాలవడంపై ఆత్మావలోకనం చేసుకున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో కనీసం రెండు స్థానాల్లో స్పష్టమైన మెజారిటీతో పార్టీ అభ్యర్థులు గెలిచే అవకాశం ఉన్నా రెబల్ అభ్యర్థి పోటీ చేయడం వల్ల మాలూరులో పార్టీ అభ్యర్థి ఓటమి పాలయ్యారన్నారు. కోలారు, బంగారుపేటల్లో కూడా తమ పార్టీ అభ్యర్థులకు విజయావకాశాలు ఉన్నా ఓటరు తీర్పు మరోలా ఉండిందన్నారు. ప్రస్తుత ఓటమినే విజయ సోపానాలుగా మలుచుకుని రాబోయే రోజుల్లో జిల్లాలో పార్టీని మళ్లీ బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తామన్నారు. ఈసందర్భంగా నాయకులు ఎస్‌బీ మునివెంకటప్ప, కెంబోడి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను నిరసిస్తూ ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా దృశ్యం

కోలారు: క్రీడాకారులపై లైంగిక వేధింపులను నిరసిస్తూ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కుస్తీ క్రీడాకారులు ఢిల్లీలో నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతుగా సీపీఎం తదితర సంఘాల కార్యకర్తలు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కేపీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ కుస్తీ క్రీడాకారులు ఏప్రిల్ 24 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్నా సుప్రీంకోర్టు జోక్యంతోనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. క్రీడాకారులపై జరిగిన లైంగిక దౌర్జన్యాలపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను రక్షిస్తోందని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో కేపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు టీఎం వెంకటేష్, ఎం విజయకృష్ణ, భీమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగిరీ రేసులో ఉన్నా

కోలారు: దేశంలోనే ఎమ్మెల్యేలుగా ఎవరూ లేని తన బైరాగి సముదాయాన్ని పార్టీ గుర్తించి తనకు మంత్రి పదవిని ఇస్తుందని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. గురువారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం కోలారు నుంచి ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైన తాను 2013లో కూడా ముళబాగిలు నుంచి ఎమ్మెల్యేగా గెలిచానని గుర్తు చేశారు. అత్యధిక మెజారిటీతో గెలిచిన తనను పార్టీ గుర్తించి కేబినెట్‌లోకి తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనకు ఒక అవకాశం ఇవ్వాలని, ఇంకా గుడిసెల్లోనే నివసిస్తున్న సముదాయం నుంచి వచ్చిన తనను మంత్రిని చేసి సముదాయ అభివృద్ధికి సహకరించాలని తాను పార్టీ పెద్దలను కోరినట్లు తెలిపారు.

నిధుల లేమితోనే ఓడాను



మాట్లాడుతున్న ఎం.నారాయణస్వామి

కోలారు: అసెంబ్లీ ఎన్నికల్లో నిధుల లేమి వల్లే తాను ఓడానని, ఆపన్నహస్తం అందిస్తామన్నవారు చివరి నిమిషంలో చేతులెత్తేయడంతో ఓటమి ఎదురైందని బంగారుపేట పరాజిత బీజేపీ అభ్యర్థి ఎం.నారాయణస్వామి స్పష్టం చేశారు. గురువారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తాను జేడీఎస్ అభ్యర్థితో కుమ్మక్కయ్యానని కాంగ్రెస్ విజేత ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆయన ఆరోపణలు నిజమని నిరూపిస్తే తాను బంగారుపేట కూడలిలో ఉరేసుకుంటానని సవాల్ విసిరారు. విపక్షాలు అకారణంగా తనపై ఆరోపణలు చేస్తున్నాయన్నారు. తాను ఎన్నికల్లో తన ఆస్తులు కోల్పోయాను కానీ ప్రత్యర్థులెవరితోను ఎలాంటి కుమ్మక్కు కాలేదని స్పష్టం చేశారు.

కల్యాణ మంటపంలో చోరీ

హుబ్లీ: హుబ్లీ విద్యానగర లోకప్పన అక్కల సుధర్మ కల్యాణ మంటపంలో వివాహానికి వచ్చిన మహిళ బ్యాగులోని రూ.56 వేల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. రామదుర్గ నివాసి విజయలక్ష్మీ బంగారు ఆభరణాలు పోగొట్టుకున్న బాధితురాలు. సదరు కల్యాణ మంటపంలోని ఓ గదిలో బ్యాగ్ పెట్టి పెళ్లి పనులు చూసుకుంటుండగా ఎవరో దొంగలు సదరు బ్యాగ్‌లోని ఆభరణాలను చోరీ చేశారని బాధితురాలు విద్యానగర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

మోరీని ఢీకొన్న కారు



నుజ్జైన కారు ముందు భాగం

పావగడ: తుమకూరు జిల్లా తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రబెంచి గేటు వద్ద గురువారం కారు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. సోలార్ కంపెనీకి చెందిన ముగ్గురు ఉద్యోగులు కంపెనీ కారులో పావగడ వైపు వెళుతూ ఎర్రబెంచి గ్రామ గేటు వద్ద అదుపు తప్పి మోరీని ఢీకొన్నారు. కారు ఒక వైపు నుజ్జు నుజ్జయింది. ఉద్యోగులకు సురక్షితంగా బయటపడగా, డ్రైవర్‌కు చిన్న గాయాలయ్యాయి. తిరుమణి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగిన దహన సంస్కారం

● తహసీల్దార్ జోక్యంతో అంత్యక్రియలు



ముక్తిధామలో శవాన్నుంచుకుని రోదిస్తున్న కుటుంబం

గౌరిబిదనూరు: నగర మార్కెట్ యార్డ్ సమీపంలో గుజరాత్ నుంచి వచ్చిన ఓ కుటుంబం ఐదేళ్లుగా నివాసం ఉంటోంది. వీరిలో ఒకరైన లీలా (42) అనారోగ్యంతో బుధవారం ఉదయం మరణించింది. దహన సంస్కారాలు చేయాలని ముక్తిధామ స్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ మృతురాలి వివరాలు లేకపోవడంతో వారు దహనానికి తిరస్కరించారు. రాత్రి 8 గంటలపైన ఎవరూ సాయం చేయలేదు. విషయం తెలుసుకున్న సమాజ సేవకుడు లోకేశ్ వెంటనే తహసీల్దార్ మహేశ్ పత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని అక్కడికక్కడే ప్రమాణపత్రం ఇప్పించడంతో అంత్యక్రియలు చేశారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను పలువురు అభినందించారు. ప్రతి మనిషి మానవతా విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మస్థైర్యం ఉండాలి



ఉపాధ్యాయులకు కౌశల్య శిక్షణ ఇస్తున్న సుదర్శన్

గౌరిబిదనూరు: ఉపాధ్యాయులకు ఆత్మస్థైర్యం ఉన్నప్పుడే దేశానికి ఉత్తమ విద్యార్థులను ఇవ్వగలరని ఆచార్య మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా జీపీ సుదర్శన్ తెలిపారు. బుధవారం సాయంత్రం శ్రీరామకృష్ణ శారదాదేవి విద్యా మందిరంలో ఐసీఎస్ఈ సిలబస్ బోధిస్తున్న ఉపాధ్యాయులకు కౌశల్య శిక్షణా శిబిరంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఆధునికత పెరిగిన కొద్దీ వృత్తిలో శ్రద్ధ తగ్గుతూ వుంది. ఉపాధ్యాయులకు ఇటువంటి కౌశల్య శిక్షణా శిబిరాలు చాలా అవసరం. తద్వారా ఉపాధ్యాయులను క్రియాశీలురుగా చేయవచ్చని అన్నారు. శిక్షణా శిబిరంలో పాఠశాల అధ్యక్షుడు వీడీ గణేశ్, ప్రిన్సిపాల్ శివప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్, బైక్‌లు స్వాధీనం

మైసూరు: ఓ దొంగను పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మైసూరు జిల్లా హుణసూరు తాలూకా హళ్ళదకొప్పలు గ్రామానికి చెందిన హరీష్ (35)గా గుర్తించారు. మైసూరు నగరంలోని కువెంపునగర ఉదయ రవి రోడ్డులో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన హరీశ్ పోలీసుల నుంచి పారిపోతుండగా పట్టుకున్నారు. అనంతరం విచారణ చేసి అతని వద్ద ఉన్న రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

హుక్కాబార్‌లు, పేకాట బంద్ చేయిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌గౌడ

మైసూరు: మైసూరు నగరంలోని చామరాజ నియోజకవర్గంలో హుక్కాబార్‌లు, పేకాట అడ్డాలను పూర్తిగా బంద్ చేయిస్తామని నూతన కాంగ్రెస్ ఎమ్మెల్యే హరీష్ గౌడ అన్నారు. గురువారం మైసూరు నగరంలోని జిల్లా విలేకరుల భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ....తన నియోజకవర్గంలో హుక్కాబార్‌లు, పేకాట కేంద్రాలు ఉన్నాయని తెలిసిందని, వెంటనే వాటిని మూయించి వేస్తామన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి నాయకులు ఇలాంటి వాటిని పెట్టి ప్రోత్సహించారని, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వాటికి అవకాశం ఉండదన్నారు.

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం

● జాతీయ రహదారిలో నుంచి సర్వీస్ రోడ్‌లోకి ఎగిరి పడిన కారు
● స్వల్ప గాయాలతో బయటపడిన నలుగురు
● మండ్య తాలూకాలో ఘటన



నుజ్జైన కారు

మండ్య: మండ్య తాలూకా హోసబూదనూరు గ్రామ సమీపంలో ఘోర ప్రమాదం తప్పింది. ఓ కారు అదుపుతప్పి జాతీయ రహదారిలో నుంచి సర్వీసు రోడ్డులోకి ఎగిరి పడింది. అదృష్టవశాత్తు ఇందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గురువారం ఉదయం బెంగళూరు నగరం నుంచి నలుగురు వ్యక్తులు మైసూరు నగరానికి ఫార్చునర్ కారులో బయలుదేరారు. వాహనం వాయు వేగంతో వెళ్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పింది. రోడ్డు డివైడర్‌ను ఢీకొని పది అడుగులు పైకి ఎగిరి పక్కనే ఉన్న సర్వీసు రోడ్‌లో పడిపోయింది. కారు నుజ్జైనా అందులో ఉన్న నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చోరీ మొబైళ్ల రికవరీ, సొంతదారులకు అప్పగింత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

మండ్య నగరంతో జిల్లా వ్యాప్తంగా 759 మంది మొబైళ్లు చోరీ కాగా అందులో 130 ఫోన్లను రికవరీ చేసి సొంతదారులకు అప్పగించినట్లు జిల్లా ఎస్పీ యతీశ్ తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెండిటీ రిజిస్టర్ (సిఐఐఆర్) టెక్నాలజీ సాయంతో నెల రోజుల వ్యవధిలో చోరీకి గురైన 140 ఫోన్లను గుర్తించి సొంతదారులకు అప్పగించామన్నారు. మిగతా వాటిని కూడా త్వరలో గుర్తిస్తామన్నారు.

అనుమానితులు అరెస్టు

శివమొగ్గ: రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న సుమారు 11 మందిని శివమొగ్గ నగరంలోని తుంగా నగర పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి అనుమానాస్పదరీతిలో తిరుగుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అనుమానితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మినీబస్సు పల్టీ, 15 మందికి గాయాలు

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడులోని చామరాజనగర బైపాస్ రోడ్డులో మినీబస్సు బోల్తా పడిన ఘటనలో 15 మంది గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. 21 మంది ప్రయాణికులు ఉదయం నంజనగూడులోని శ్రీకంఠేశ్వరుడిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మినీ బస్సు బైపాస్ రోడ్డులో వస్తుండగా బైక్ అడ్డు రావడంతో తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. 15 మంది గాయపడారు. వీరిలో 10 మంది చిన్న పిల్లలు ఉన్నారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సిద్దు నివాసం వద్ద భారీ బందోబస్తు

శివాజీనగర: నగరంలో సిద్ధరామయ్య ఇంటి వద్ద పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. శివానంద సర్కిల్ సమీపంలో ఉన్న సిద్ధరామయ్య అధికారిక నివాసం చుట్టూ పోలీసులు మోహరించారు. ఆయన ముఖ్యమంత్రి మంత్రి పదవి చేపట్టబోతున్నారని సమాచారం తెలియగానే కార్యకర్తలు, అభిమానులు తండోపతండాలుగా ఆయన ఇంటి వద్దకు వస్తున్నారు. దీంతో చుట్టు పక్కల బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు.

యువకుడి ఆత్మహత్య

మైసూరు: జీవితంపైన విరక్తి చెందిన యువకుడు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైసూరు జిల్లా కేఆర్ నగర పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఆదిశక్తి లేఔట్‌లో చోటు చేసుకుంది. ఇక్కడ నివాసం ఉంటున్న బొమ్మరాయ కుమారుడు మణి (22) ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని ఓ హోటల్లో పనిచేస్తున్న మణి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కృష్ణరాజనగర పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ సస్పెండ్

యశవంతపుర: బీజేపీ ఓటమికి వీరిద్దరూ కారణమని దక్షిణ కన్నడ జిల్లా మంగళూరులో బీజేపీ అధ్యక్షుడు నళీన్‌కుమార్ కటీల్, మాజీ సీఎం డీవీ సదానందగౌడల బ్యానర్‌లో శ్రద్ధాంజలి, చెప్పుల హారం వేసిన కేసుకు సంబంధించి ఏడుగురిని పుత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరిని పోలీసులు ఇష్టం వచ్చినట్లు చితకబాదారు. ఇది వివాదంగా మారటంతో యువకుడిపై దాడి చేసిన పోలీసులను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. నరియోగరికి చెందిన అవినాశ్ అనే ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్ఐ, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

ఓడినా ప్రజలకు అందుబాటులో ఉంటా

దొడ్డబళ్లాపురం:ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన తాను ఇంట్లో కూర్చునే రకం కాదని, ప్రజలకు అందుబాటులో ఉంటానని నిఖిల్ కుమారస్వామి అన్నారు. గురువారం చెన్నపట్టణలో మాట్లాడిన నిఖిల్ ఎన్నికలు అన్నాక ఎవరో ఒకరు గెలవాలన్నారు. ఈరోజు తాను ఓటమిపాలైనా ఏదో ఒకరోజు గెలిచితీరుతానని, అప్పటి వరకూ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. అయినా చెన్నపట్టణలో కుమారస్వామిని గెలిపించడం సంతోషంగా ఉందన్నారు. రామనగరలో తనకు 76 వేల ఓట్లు వచ్చాయని, తాను టెక్నికల్‌గా ఓడిపోయినా అంతమంది జనం తనతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ వాళ్లు రాత్రికి రాత్రి అమాయక ప్రజలకు కూపన్ ఓచర్లు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభపెట్టారన్నారు. తన కుటుంబం అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజలకు సేవలందిస్తాం అన్నారు.

గొంతు కోసి హత్య



హత్యకు గురైన సంగీత (ఫైల్)

యశవంతపుర: కుటుంబ కలహాలతో మహిళను బావ హత్య చేసిన ఘటన బీదర్ జిల్లా బసవకల్యాణ పట్టణంలోని త్రిపురాంతలో జరిగింది. హోంగార్డుగా పని చేస్తున్న సంగీతతో తాగిన మత్తులో ఉన్న ఆమె బావ గొడవడాపడ్డాడు. తీవ్ర ఆగ్రహంతో పదునైనా కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. నిందితుడు బసవకల్యాణ నగరసభలో పౌరకార్మికుడిగా పని చేస్తున్నట్లు తెలిసింది. పరారీలో ఉన్న అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రతి సమస్యా పరిష్కరిస్తాం

చిక్కబళ్లాపురం: సమస్యల పరిష్కరించడానికే 'చిక్కబళ్లాపురం నమస్తే' కార్యక్రమం చేపట్టానని నూతన ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అన్నారు. గురువారం ఉదయం 6 గంటలకు ఆయన నగర సమీపంలోని మైలప్పనహళ్లి గ్రామాన్ని సందర్శించారు. అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పెన్షన్, విద్యుత్, ఇంటి నివేశన తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రజల కష్టాలు తెలుసుకోవడానికే చిక్కబళ్లాపురం నమస్తే కార్యక్రమం చేపట్టామని, ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



మైలప్పనహళ్లి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

నా నిరీక్షణ ఫలించలేదు

● మాజీ సీఎం కుమారస్వామి

దొడ్డబళ్లాపురం: నా నిరీక్షణ ఫలించలేదు..మీడియా వారి నిరీక్షణ ఫలించింది అంటూ మాజీ సీఎం కుమారస్వామి వైరాగ్య వ్యాఖ్యలు చేసారు. గురువారం చెన్నపట్టణలో ఎన్నికల ఫలితాలకు సంబంధించి కుమారస్వామి ఈ వ్యాఖ్యలు చేసారు. అయితే ఇలాంటి ఫలితాలు తమ పార్టీకి కొత్తేమీ కాదన్నారు. దేవెగౌడ రెండుసార్లు ఓటమిపాలయ్యాక కూడా తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేసారు. రాబోవు రోజుల్లో ప్రజలు జేడీఎస్‌ను కోరుకుంటారన్నారు.

ఏనుగు దాడిలో గాయపడిన కార్మికుడి మృతి

మైసూరు: రెండు రోజుల క్రితం అడవి ఏనుగు దాడిలో గాయపడిన కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మడికేరిలో చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం మడికేరిలోని పొలిబెట్ట సమీపంలోని తోటలో పనిచేస్తున్న బాబీ (57) అనే వ్యక్తిపై అడవి ఏనుగు దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన అతన్ని నగరంలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

డెంగీ నియంత్రణకు చర్యలు

బనశంకరి: సిలికాన్ సిటీలో డెంగీ కేసులు హెచ్చుమీరుతున్న నేపథ్యంలో నియంత్రణకు బీబీఎంపీ సిద్ధమైందని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత 2020లో 2,823 మంది డెంగీ బారిన పడగా ఐదుగురు మృతి చెందారు. 2021లో 7,393 కేసులు వెలుగుచూడగా 2022లో 9,889 మంది డెంగీ బారినపడ్డారని అన్నారు. నగరంలో డెంగీ కేసులు కొద్దిగా తగ్గుముఖం పట్టినప్పటికీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో లావా సర్వేతో పాటు నియంత్రణకు చర్యలు తీసుకోవడానికి డ్యాష్‌బోర్డు సహాయపడుతుందన్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో అంటురోగాలు పెరిగే అవకాశం ఉందన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జనరిక్ టెక్నాలజీతో ఒప్పందం చేసుకుని డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేసి డెంగీ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తుమకూరులో సంబరాలు

తుమకూరు: తుమకూరు నగరం బీజీఎస్ సర్కిల్‌లో సిద్దరామయ్య రెండవసారి ముఖ్యమంత్రి అవుతుండటంతో తుమకూరు నగరంలో బొమ్మనహళ్లి బాబు (అట్టికా బాబు) మద్దతుదారులు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి బాణసంచా పేలుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు.

వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం →



గెలుపోటములు సహజమే

చిక్కబళ్లాపురం: ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమేనని జేడీఎస్ పరాజితుడు, మాజీ ఎమ్మెల్యే కేపీ బచ్చేగౌడ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...బీజేపీ అభ్యర్థి సుధాకర్ ఇటీవల కాంగ్రెస్ గెలుపులో జేడీఎస్ పాత్ర ఉందన్న వ్యాఖ్యలపై ఆయన మాట్లాడుతూ... ఆర్థిక పరిస్థితులు కూడా తన ఓటమికి కారణమని, చివరి క్షణంలో బూత్ ఏజెంట్ల ఖర్చులకు కూడా డబ్బులు లేవని, తాను ఎవరి తరపున పనిచేయలేదని అన్నారు. నిద్రాహారాలు మానుకుని రెండు నెలల పాటు ప్రతి పల్లె తిరిగానని, అయినా ఫలితం లేదన్నారు.

ఉద్యోగమిస్తే.. ఖాతాలో నగదు స్వాహా



అరెస్టయిన నిందితులు

● యువతి, ఆమె ప్రియుడు చెల్లెళ్లు అరెస్టు

కృష్ణరాజపురం: ఉద్యోగం ఇచ్చిన యజమాని బ్యాంక్ ఖాతా నుంచి బాయ్ ఫ్రెండ్, తన ఇద్దరు చెల్లెళ్లు, వారి బాయ్ ఫ్రెండ్స్ ఖాతాలకు నగదు పంపించిన కేసులో నగరంలోని విద్యారణ్యపుర పోలీసులు ముగ్గురు యువతులను, ఒక యువకున్ని అరెస్టు చేశారు. విద్యారణ్యపుర పరిధిలో ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తున్న వెంకటేష్‌రెడ్డి ఖాతాను వీరు కొల్లగొట్టారు. వివరాలు.. తన కంపెనీలో గణవి అలియాస్ రీతూ అనే యువతిని రిసెప్షనిస్టుగా ఉద్యోగం ఇచ్చాడు. ఆమె కంపెనీ బ్యాంకుల ఖాతాల నగదు, ఫోన్ పే, గూగుల్ పే ఖాతాల నుంచి నగదు లావాదేవీలను నిర్వహించేది. ఇలా లక్షల రూపాయల నగదు లావాదేవీలు జరిపిన రీతూలో దుర్బుద్ధి పుట్టింది. తన బాయ్‌ఫ్రెండ్ నక్షు కుశాలప్పకు, అలాగే చెల్లెల్లు రియా, సిరిలకు ఫోన్ పే ద్వార రూ. 2.70 లక్షలను పంపించింది. చెల్లెళ్ల స్నేహితులైన మల్లేష్, రాహుల్‌కు కూడా ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేసింది. కొన్ని రోజుల కిందట వెంకటేష్‌రెడ్డి మొబైల్‌ఫోన్‌కి అలర్ట్ మెసెజ్‌లు రావడంతో తనిఖీ చేయగా, గుర్తు తెలియని ఖాతాలకు నగదు వెళ్లినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరిపి నిందితులను అరెస్టు చేశారు.

వృద్ధుడు అగ్నికి ఆహుతి



రామాంజినప్ప

దొడ్డబళ్లాపురం: ఇంట్లో వెలిగించిన దీపం ఓ వృద్ధుడిని బలి తీసుకున్న సంఘటన దొడ్డ పట్టణ పరిధిలోని కచేరిపాళ్యలో చోటుచేసుకుంది. రామాంజినప్ప (70) మృతుడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. ఇంట్లో విద్యుత్ కనెక్షన్ లేదు. రామాంజినప్ప ఒక్కడే నివసిస్తున్నాడు. అనారోగ్యంతో నడవలేని, లేవలేని స్థితిలో గడుపుతున్నాడు. ఈక్రమంలో వెలుగు కోసం వెలిగించిన దీపం ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బట్టల మూటకు తగిలి అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిజ్వాలల నుంచి తప్పించుకునేందుకు వీలుకాక రామాంజినప్ప అగ్నికి ఆహుతయ్యాడు. ఇల్లు కూడా పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నెట్టికంటుడి హుండీ లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి హుండీ కానుకలు లెక్కించారు. రూ. 41.69 లక్షల ఆదాయం హుండీ ద్వారా వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వరెడ్డి తెలిపారు. 51 రోజులకు గాను 41,69,670 నగదు, 1.3 కిలోల వెండి కానుకల రూపంలో భక్తులు సమర్పించినట్లు తెలిపారు. ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

క్రిష్ణగిరి: వేపనపల్లి ప్రాంతం నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని కారుతో పాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఆహార భద్రతా విభాగం ఎస్ఐ క్రిష్ణవేణి, పోలీసులు బుధవారం రాత్రి వేపనపల్లి- గుడిపల్లి రోడ్డులోని కొంకణపల్లి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ మార్గంలో వచ్చిన ఓ కారులో ఉన్న 750 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని డ్రైవర్‌తో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

జ్యోతి గణేష్‌కు అభినందనల వెల్లువ



తుమకూరు: తుమకూరు నగర నుంచి 2వ సారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన జ్యోతిగనేష్‌ను పలువురు స్వయంగా కలిసి అభినందించారు. గురువారం ఉదయం పలువురు అధికారులు, నాయకులు ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి అభినందించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు రవిశంకర్ హెబ్బాక, టుడా అధ్యక్షుడు చంద్రశేఖర్, బావికట్టె నాగణ్ణ, మేయర్ బీజీ కృష్ణప్ప తదితరులు ఉన్నారు.

హోసూరు వార్తలు..

గాలీవానకు కూలిన చెట్లు



రోడ్డుపై పడిపోయిన చెట్టు

కెలమంగలం: క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ముందుగానే వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు హర్షం చేస్తున్నారు. వర్షాధార పంటలు పండించే రైతులు పొలాలను దుక్కిచేయడంలో నిమగ్నమయ్యారు. గురువారం మధ్యాహ్నం డెంకణీకోట, తళి జవుళగిరి, అగళకోట ప్రాంతాల్లో భారీ గాలులతో కూడిన వర్షాలు కురవడంతో రోడ్ల ప్రక్కన చెట్లు కూలాయి. మరికొన్ని ప్రాంతాల్లో వందల ఏళ్ల నాటి చెట్లు నేల కొరిగాయి. హోసూరు- డెంకణీకోట రోడ్డు చిన్నబెణ్ణంగూరు వద్ద నిర్వహిస్తున్న ప్రైవేట్ గార్మెంట్స్ ముందుభాగంలో రోడ్డుపై చెట్టు కూలడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదార్ల శాఖాధికార్లు చెట్లను తొలగించారు.

భారీగా గుట్కా పట్టివేత



స్వాధీనపరుచుకొన్న గుట్కాతో నిందితులు

హోసూరు: సిప్‌కాట్ పోలీసులు బుధవారం రాత్రి హోసూరు- బెంగళూరు జాతీయ రహదారి సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. రెండు కార్లలో సోదాలు చేయగా రూ. 3.54 లక్షల విలువ చేసే 615 కిలోల గుట్కా పట్టుబడింది. గుట్కాతో పాటు రూ. 11 లక్షల విలువ చేసే రెండు కార్లను స్వాధీనపరుచుకొని డ్రైవర్‌లను అదుపులోకి తీసుకొన్నారు. వీరు రాజస్థాన్‌కు చెందిన ప్రదీప్‌సింగ్ (22), భరత్‌సింగ్ (40) అని తెలిసింది. నిందితులు బెంగళూరులో నివాసముంటూ తమిళనాడుకు గుట్కా సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

చెరువులో ఈతకెళ్లి బాలుడి మృతి

హోసూరు: చెరువులో ఈతకెళ్లిన పదేళ్ల బాలుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన క్రిష్ణగిరి తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. కర్ణాటక రాష్ట్రం ఆనేకల్ తాలూకా అత్తిగొండన పల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ కొడుకు హేమంత్ (10) వేసవి సెలవులను పురస్కరించుకొని జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలోని మోరమడుగులో నివాసముంటున్న బంధువుల ఇంటి వచ్చాడు. బుధవారం అదే ప్రాంతంలోని మునిగొడ చెరువులో ఈతకెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు.

ఘనంగా పిలేక్ మారియమ్మ జాతర



విశేష అలంకరణలో మారియమ్మ ఉత్సవమూర్తి

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని బోడిచిపల్లి గ్రామదేవత పిలేక్ మారియమ్మ ఆలయ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గంగ పూజ, గోపూజ, దీపారాధన, పూల అలంకారం నిర్వహించారు. రాత్రి శ్రీ పిలేక్ మారియమ్మ, పటాలమ్మ, గంగమ్మదేవి, మారియమ్మ, ఆంజనేయ స్వామి, రేణుకా యల్లమ్మదేవి, గణపతి దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను పల్లకీలపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సంగీత విభావరి, నయ్యాండి, వివిధ దేవతామూర్తుల అవతారాలు ధరించి నృత్య ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు జాతరలో పాల్గొన్నారు.

పూలసాగుపై విద్యార్థులకు శిక్షణ



పూలసాగుపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

హోసూరు: వేసవి సెలవులను పురస్కరించుకొని క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వేసవి శిక్షణ ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రతిభను పెంచుతున్నారు. అందులో భాగంగా డెంకణీకోట తాలూకా తళి సమీపంలో ఇండో ఇజ్రాయిల్ నిర్వహిస్తున్న పూల పెంపక కేంద్రంలో విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి క్రిష్ణగిరి జిల్లా ఉద్యానవనశాఖ ఉపడైరెక్టర్ భూపతి ముఖ్య అతిథిగా పాల్గొని శాఖ ద్వారా రైతులకు అందజేస్తున్న పథకాలు, పూల సాగు, ఎరువుల వినియోగం, అలంకరణ మొక్కల పెంపకం తదితర మొక్కల ఉత్పత్తిపై పిల్లలకు వివరించారు. శిబిరంలో హోసూరు, తళి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 50 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రదోష పూజలు



విశేష అలంకరణలో మూలవిరాట్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ రామ్‌నగర్‌లోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి ప్రదోష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారి మూలవిరాట్‌కు, ఆలయంలోని బసవేశ్వరస్వామి మూలవిరాట్‌లకు పాలు, పెరుగు, వెన్న, కొబ్బరినీరు, పసుపు, కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

అన్న, చెల్లి మధ్య ఘర్షణ

● ఆరుగురికి తీవ్ర గాయాలు

క్రిష్ణగిరి: బంధువుల మధ్య ఆస్తి గురించి ఏర్పడిన ఘర్షణలో ఆరుగురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సూళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకెళితే సూళగిరి సమీపంలోని కొత్తూరు గ్రామానికి చెందిన లక్ష్మి (33), ఈమె సహోదరుడు బసవరాజ్(43)ల మధ్య ఆస్తి తగాదాలుండేవి. లక్ష్మి కుటుంబసభ్యులు సమీపంలోని బస్తలపల్లిలో నివాసముంటున్న సహోదరి రాణియమ్మ ఇంటికెళ్లారు. ఈ సమయంలో లక్ష్మి, బసవరాజ్‌ల మధ్య ఘర్షణ జరిగింది. బసవరాజ్ వర్గీయులు లక్ష్మి, రాణియమ్మ, తిమ్మరాయప్ప (39) తిమ్మరాజ్ (42), మురుగేష్(37), కీర్తన (8)లపై దాడి చేశారు. తీవ్ర గాయాలేర్పడిన వీరిని స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సూళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని బసవరాజ్, కదిర్‌వేల్ (23)లను అరెస్ట్ చేసి పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని...

హోసూరు: మద్యం తాగేందుకు కొడుకు డబ్బులివ్వకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన సిప్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... హోసూరు పారిశ్రామికవాడ చిన్నయలసగిరి ఉ.వ.సి. నగర్ ప్రాంతానికి చెందిన కార్మికుడు మురుగన్ (63) రెండు రోజుల క్రితం మద్యం తాగేందుకు కొడుకు వద్ద డబ్బులడిగాడు. ఇవ్వకపోవడంతో విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఏఎన్‌యూ అధ్యాపకులు

నేటి నుంచి దుబాయ్‌లో సదస్సు




ఆచార్య కె.మధుబాబు, ఆచార్య సరస్వతి రాజు అయ్యర్

ఏఎన్‌యూ: ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ దుబాయ్‌లో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీడీసీ డీన్, ఎకనామిక్స్ విభాగాధిపతి, బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఆచార్య కె.మధుబాబు, యూనివర్సిటీ ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్, సోషల్ వర్క్ అధ్యాపకురాలు ఆచార్య సరస్వతి రాజు అయ్యర్ హాజరుకానున్నారు. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన 'బెస్ట్ డిప్లమాట్స్' నిర్వహిస్తున్న ఈ సదస్సులో 175 దేశాల ప్రతినిధులు పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థల నుంచి చాలా మంది ఔత్సాహికులు తమ అధ్యయన పత్రాలను పంపగా, వారిలో పలు ప్రమాణాల ఆధారంగా నిర్వాహకులు ఎంపిక చేసిన వారినే సదస్సుకు ఆహ్వానించారు. వీరిలో ఏఎన్‌యూ నుంచి ఇద్దరు ఉన్నారు. ఆచార్య కె.మధుబాబు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంపాక్ట్ ఆన్ ఇండస్ట్రియల్ సెక్టార్ ఇన్ అండర్ డెవలపింగ్ కంట్రీస్' అనే అంశంపై, ఆచార్య సరస్వతి రాజు అయ్యర్ 'ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆన్ ఇండస్ట్రీస్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు వియత్నాం' అనే అంశంపై అధ్యయన పత్రాలు సమర్పించనున్నారు. అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్న ఏఎన్‌యూ అధ్యాపకులకు వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, యూనివర్సిటీ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

29న జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12 ప్రయోగం

నావిక్–01 ఉపగ్రహాన్ని పంపించేందుకు సన్నాహాలు



జీఎస్‌ఎల్‌వీ మార్క్2 రాకెట్ (ఫైల్)

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీష్ ధవన్ స్పేస్ సెంటర్(షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈనెల 29న జీఎస్‌ఎల్‌వీ మార్క్2(జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12) రాకెట్ ద్వారా నావిక్–01 (ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్–1జే) అనే ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులను పూర్తి చేశారు. ఈ ఏడాది నెలకొక ప్రయోగాన్ని నిర్వహించాలని ఇస్రో నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 22న పీఎస్‌ఎల్‌వీ సీ55ను ప్రయోగించింది. అనంతరం ఈనెల 24వ తేదీన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12 రాకెట్‌ను ప్రయోగించేందుకు ఇస్రో సిద్ధమైంది. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల ప్రయోగాన్ని 29వ తేదీకి వాయిదా వేసింది. ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు నావిక్–01 ఉపగ్రహాన్ని ప్రయోగించబోతున్నారు.

పట్టణ మాస్టర్ ప్లాన్లకు ఏకరూప మార్గదర్శకాలు

- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ
- అన్ని చోట్లా ఒకేలా మాస్టర్ ప్లాన్ తయారీ
- మార్గదర్శకాలతో జీవో జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని పురపాలికల్లో మాస్టర్ ప్లాన్ తయారీ, అమలు ఏకరీతిన ఉండేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం మాస్టర్ ప్లాన్ తయారీలో ఏకీకృత విధానం పాటించేలా పలు సూచనలతో ప్రభుత్వం జీవో నంబర్ 66 జారీ చేసింది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో రాష్ట్రంలో పట్టణీకరణను పెంపొందించేలా ఈ జీవోలో మార్గదర్శకాలు పొందుపరిచింది. వాస్తవానికి డెవలప్‌మెంట్ అథారిటీలు పరిమిత సాంకేతిక నైపుణ్యంతో మాస్టర్ ప్లాన్లను తయారు చేస్తుండటంతో ప్రాదేశిక ప్రణాళిక నాణ్యత సరిగా ఉండడంలేదు. పైగా డెవలప్‌మెంట్ అథారిటీల మాస్టర్ ప్లాన్ల తయారీలో మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అనుసరించడంలేదు. రిపోర్టింగ్ ఫార్మాట్స్, శాటిలైట్ ఇమేజ్ క్వాలిటీ, ఆర్‌ఎఫ్‌పీ ప్రిపరేషన్, కన్సల్టెన్సీ చార్జీల ఫిక్సింగ్, కన్సల్టెంట్లు, టౌన్ ప్లానింగ్ స్టాఫ్ పాత్ర, బాధ్యతలతో కూడిన మాస్టర్ ప్లాన్ తయారీలో ఏకరూపత ఉండడంలేదు. దాంతో రాష్ట్రంలోని 123 పట్టణ ప్రాంతాలు (యూఎల్‌బీలు), 21 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ)ల్లో ఏకీకృత మాస్టర్ ప్లాన్ ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. ప్రస్తుతం ఆయా విభాగాల్లోని మాస్టర్ ప్లాన్లు ఏ దశలో ఉన్నాయో అవన్నీ కొత్త మార్గదర్శకాల ప్రకారం రూపొందించాలని యూడీఏ, యూఎల్బీలను ఆదేశించింది. అభ్యర్థనలు, మ్యాప్ తయారీ, సర్వే, ఫీల్డ్ డేటా సేకరణ, మాస్టర్ ప్లాన్ నివేదిక, డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ కోసం సాంకేతిక ఆమోదం, మాస్టర్‌ప్లాన్ ప్రచురణ, ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనల స్వీకరణ, తుది మాస్టర్ ప్లాన్, మ్యాప్ తయారీకి ప్రభుత్వం నుంచి సాంకేతిక ఆమోదం, మంజూరు కోసం ప్రభుత్వానికి సమర్పణ వంటి అంశాలను ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిరంతరాయంగా ఆరోగ్యశ్రీ సేవలు

- సేవలు నిలిపేశారనే ప్రచారంలో వాస్తవం లేదు
- ఆరోగ్యశ్రీ సీఈవో ఎంఎన్ హరేంధిరప్రసాద్

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నిరంతరాయంగా కొనసాగుతాయని సీఈవో ఎంఎన్ హరేంధిరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తూ ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(ఆశ) తీర్మానించినట్లు తమ దృష్టికి రావడంతో వారితో చర్చించామన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వారికి వివరించామని తెలిపారు. గత నెల 30వ తేదీన రూ.201 కోట్లు, ఈ నెల 15న మరో రూ.368 కోట్ల బిల్లులను నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించినట్లు చెప్పామన్నారు. మిగిలిన బిల్లులను వీలైనంత త్వరగా ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. దీనిపై ఆశ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి సేవలను కొనసాగిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు.. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సేవల గురించి ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఆయన స్పష్టంచేశారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేశారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

ఐరిస్ ఆధారిత ధ్రువీకరణతో రేషన్ పంపిణీ

- వేలిముద్రలు పడని లబ్ధిదారులకు ఊరట



ఎండియు వాహనాల్లో పెట్టనున్న ఐరిస్ పరికరం

సాక్షి, అమరావతి: ఏపీలో ఐరిస్ ఆధారిత ఆధార్ ధ్రువీకరణ ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేయనున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ గురువారం తెలిపారు. ఇప్పటివరకు ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ–పోస్ యంత్రంలో లబ్ధిదారుల వేలిముద్రలను ధ్రువీకరించి రేషన్ అందిస్తున్నామని, రోజువారి కూలీలు, వృద్ధులు, పలు వ్యాధిగ్రస్తులకు వేలిముద్రలు పడకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. లబ్ధిదారుల సౌకర్యార్థం 9,260 ఎండీయూ వాహనాల్లో కొత్తగా ఐరిష్ (కంటి) పరికరాలను పెడుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెలలో వేలిముద్రలతో పాటు ఐరిష్ ఆధారిత ధ్రువీకరణను ప్రామాణికంగా తీసుకుని నిత్యావసరాలు అందజేయనున్నట్లు చెప్పారు.

రేపు పాలిసెట్–2023 ఫలితాలు

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ కోర్సు ల్లో ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్–2023 ఫలితాలను ఈ నెల 20న (శనివారం) విడుదల చేయను న్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి గురు వారం తెలిపారు. ఈ నెల 10న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 1,43,625 మంది హాజరైనట్లు చెప్పారు. 10 రోజుల్లోనే మూల్యాంకనం పూర్తి చేశామని, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఫలితాలను ప్రకటిస్తారని వెల్లడించారు.

21న 17 రైళ్లు రద్దు : దక్షిణమధ్య రైల్వే

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ వద్ద ఆర్‌యూసీ నిర్మాణ పనుల దృష్ట్యా ఈ నెల 21న ఆ మార్గంలో నడిచే 17 రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రైళ్ల వేళల్లో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ నుంచి వరంగల్, రేపల్లె, సిర్పూర్ కాగజ్‌గర్, కాచిగూడ నుంచి మిర్యాలగూడ, వికారాబాద్ నుంచి గుంటూరు మధ్య నడిచే పలు రైళ్లు రద్దు కానున్నాయి.

బీజేపీతో పొత్తుకు వెంపర్లాట

టీడీపీని ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్య



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): గత ఎన్నికల్లో బీజేపీని వ్యతిరేకించిన పార్టీలే ఇప్పుడు బీజేపీతో పొత్తు కోసం వెంపర్లాడుతున్నాయని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన గురువారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో బీజేపీని విమర్శించిన పార్టీలు ప్రస్తుతం పొత్తు కోసం ఆపసోపాలు పడుతున్నాయని పరోక్షంగా టీడీపీని ఉద్దేశించి మాట్లాడారు. దక్షిణాదిలో బీజేపీ పని అయిపోయిందని ప్రచారం చేస్తున్న వారికి వచ్చే ఎన్నికల్లో గట్టి సమాధానం చెబుతామన్నారు. గత ఎన్నికల్లోనూ ఇలాంటి ప్రచారం చేసిన పలువురు నాయకులు అనంతర ఫలితాలతో కనుమరుగయ్యారన్నారు. 2024లోనూ ఇదే పునరావృతం అవుతుందన్నారు. రాష్ట్రంలో పొత్తుల అంశాన్ని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీకి రాష్ట్రంలో అనుకూల ఓట్లు లేవన్న ఆయన బీజేపీ, జనసేన పొత్తులోనే ఉన్నాయన్నారు. కర్ణాటక ఫలితాలు కేంద్రంలో బీజేపీ విజయంపై ఎలాంటి ప్రభావం చూపబోవన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి బీజేపీయే కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ బీజేపీ ఇన్‌చార్జ్ దియోధర్‌పై మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలను విష్ణువర్ధన్‌రెడ్డి ఖండించారు. మంత్రి కొడాలి నానికి దమ్ముంటే ఏపీ అభివృద్ధిపై గన్నవరం బస్టాండ్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ చేపట్టిన ప్రజా చార్జిషీట్‌కు మంత్రులు కొడాలి నాని, గుడివాడ అమర్‌నాథ్ సిద్ధమా అని చాలెంజ్ విసిరారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, కాశీ విశ్వనాథరాజు, దానేష్ పాల్గొన్నారు.

కుల బహిష్కరణపై

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

- ప్రేమ వివాహం చేసుకుంటున్నందుకు రూ.1.50 లక్షలు చెల్లించాలని హుకుం
- అందుకు నిరాకరించడంతో ఓ కుటుంబాన్ని బహిష్కరించిన కుల సంఘం

తగరపువలస (విశాఖ జిల్లా): భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో కుల బహిష్కరణకు గురైన ఓ కుటుంబం గురువారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణంరాజుపేటకు చెందిన తుపాకుల అప్పలరాజు 15 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం విజయనగరంలోని వీటీ అగ్రహారం ప్రాంతానికి కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. పండుగలు, బంధువుల ఇళ్లల్లో శుభకార్యాల నిమిత్తం తరచూ గ్రామానికి వచ్చి వెళ్తుంటారు. కాగా, ఆయన సోదరుడు కృష్ణంరాజుపేటలోనే ఉంటున్నారు. ఇటీవల కృష్ణంరాజుపేటలో జరిగిన గ్రామదేవత ఉత్సవాలకు అప్పలరాజు కుటుంబం వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన తమ కుమారుడు మోహన్‌కృష్ణారెడ్డి మరో సామాజిక వర్గానికి చెందిన సహోద్యోగిని అక్టోబర్‌లో ప్రేమ వివాహం చేసుకుంటున్నట్టు గ్రామంలోని రెడ్డి సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులకు తెలిపారు. అయితే, సంఘ తీర్మానం ప్రకారం.. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఇతర సామాజిక వర్గాల వారిని వివాహం చేసుకోకూడదని చెప్పారు. తప్పు కింద రూ.1.50 లక్షలను తక్షణం చెల్లించకపోతే కుటుంబాన్ని బహిష్కరిస్తామని హెచ్చరించడంతో పాటు వేధించారు.

జరిమానా చెల్లించలేదని..

తప్పు కింద విధించిన రూ.1.50 లక్షల జరిమానాను అప్పలరాజు కుటుంబం చెల్లించకపోవడంతో ఆ కుటుంబంపై బుధవారం నుంచి బహిష్కరణ వేటు వేశారు. అప్పలరాజు సోదరుడు విజయ్ కుమార్తె రజస్వల కాగా.. ఆ బాలికను ఆశీర్వదించి, అక్షింతలు వేయడానికి రెండు రోజులుగా రెడ్డి సామాజిక వర్గం నుంచి ఎవరూ హాజరుకాలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన అప్పలరాజు కుటుంబ సభ్యులు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. తమ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.

పేదలపై చంద్రబాబుది కపటప్రేమ..

- పంచ గ్రామాల సమస్య ఇప్పుడు గుర్తుకొచ్చిందా?
- అధికారంలో ఉన్నప్పుడు గాడిదలు కాసారా..?
- పంచగ్రామాల సమస్య పరిష్కారానికి వైఎస్సార్ సీపీ అధ్యయన కమిటీ వేసింది
- ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో నిర్ణయించేది టీడీపీ కాదు ఎన్నికల సంఘం
- ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబు మాటలు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు



సాక్షి, విశాఖపట్నం: అధికారంలో ఉన్నప్పుడు పేదలంటే చులకనగా చూసిన చంద్రబాబు ఇప్పుడు పేదలపై కపట ప్రేమ చూపిస్తున్నాడని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. పంచగ్రామాల సమస్య అనేది సున్నితమైన అంశమని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికై అధ్యయన కమిటీని కూడా ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని పంచగ్రామాల సమస్య చంద్రబాబుకి ఇప్పుడు గుర్తుకువచ్చిందా..? అప్పుడు గాడిదలు కాశాడా..? అని మండిపడ్డారు. గురువారం సర్క్యూట్ హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేళ బీసీలు, దళితులపై చంద్రబాబు అమిత ప్రేమ వలకపోస్తున్నాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీతో పాటు ఆయన పార్టనర్ జనసేన కూడా చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. సొంత నియోజకవర్గమైన కుప్పంలో చంద్రబాబు ఏమి చేశాడు..? కుప్పంలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేసిన ఆలోచన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. కుప్పంలో సైతం చంద్రబాబు ఓడిపోవడానికి అనువైన పరిస్థితులు వున్నాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో నిర్ణయించేది టీడీపీ కాదని..దానికి ఎన్నికల కమిషన్ ఒకటి ఉందని చంద్రబాబు మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. అనుకున్న సమయానికి అనుకున్న విధంగానే ఎన్నికలు జరుగుతాయన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతినేలా...

దశబ్దాలుగా వెనకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్ర ప్రాంతం ఇప్పుడు పరిపాలనా రాజధానితో అభివృద్ధి చెందుతుంటే..అది ఓర్వలేక మా ప్రాంతానికి వచ్చి రాజధాని వద్దని అంటాడా..? రానున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలంతా తమ ఓటు బలంతో టీడీపీకి తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. చంద్రబాబు మీటింగ్‌లకు, రోడ్ షోలకి జనాన్ని తరలించడానికి 'ఇదేమి ఖర్మ రా మాకు' అని టీడీపీ కార్యకర్తలు, నాయకులు తలలు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగాలని.. నిరుద్యోగ భృతి ఇస్తామని.. డ్వాక్రా రుణమాఫీ, రైతులకు రుణమాఫీ అని దొంగ హామీలు ఇచ్చి గెలిచి అడుగడుగునా మోసం చేసిన విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదని అన్నారు. జన్మభూమి కమిటీల పేరిట రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారన్నారు. ఏం మాట్లాడుతున్నారో తెలియని మానసిక స్థితిలో చంద్రబాబు ఉన్నారని, చంద్రబాబుకు వైజాగ్ మెంటల్ ఆసుపత్రిలో ఓ బెడ్ సిద్ధం చేయాలన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో పాలన జరుగుతున్నదని ఆయన కొనియాడారు.

విజయ డెయిరీపై ఎలాంటి విచారణకైనా సిద్ధమే!

- అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధం
- మీ హెరిటేజ్ కారణంగా ఎన్ని డెయిరీలు మూతబడ్డాయో తెలుసుకో..
- కర్నూలు మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి



కర్నూలు(అగ్రికల్చర్) : కర్నూలు విజయ డెయిరీలో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమేనని కర్నూలు మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. హెరిటేజ్ డెయిరీ వల్ల కో–ఆపరేటివ్‌లోని ఎన్ని డెయిరీలు మూతపడిపోయాయి.. ఎంత మంది ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడ్డారో తెలుసుకోవాలని నారా లోకేశ్‌కు సూచించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదని, నిజానిజాలు తెలుసుకోవాలన్నారు. గురువారం కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. రెండేళ్లలోనే విజయ డెయిరీని రూ.33 కోట్ల నికర లాభాల్లోకి తెచ్చామన్నారు. రూ.20 కోట్లతో అధునాతన యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. పాల ఉత్పత్తిదారులకు రూ.7.50 కోట్లు, కార్మికులకు రూ.1.50 కోట్ల బోనస్ పంపిణీ చేశామని వివరించారు. రూ.180 కోట్లు ఉన్న టర్నోవర్‌ను 2022–23 నాటికి రూ.240 కోట్లకు పెంచామని, 2023–24 సంవత్సరం పూర్తయ్యే నాటికి టర్నోవర్‌ను రూ.270 కోట్లకు తీసుకెళతామన్నారు. పాల ఉత్పత్తిదారులకు లీటరుకు రూ.3 ప్రకారం బోనస్ ఇవ్వా లని నిర్ణయించామని, ఉద్యోగులు, కార్మికుల సంఖ్యను 550 నుంచి 750కి పెంచినట్టు తెలిపారు. చంద్రబాబు హెరిటేజ్ డెయిరీ కారణంగా రాజమండ్రి, చిత్తూరు, ఒంగోలు, ప్రొద్దుటూరు, అనంతపురంలోని కో–ఆపరేటివ్ డెయిరీలు మూతపడ్డాయని, ఈ విషయాన్ని లోకేశ్ తెలుసుకోవాలని సూచించారు. భూమా కుటుంబం ఆళ్లగడ్డలో జగత్ డెయిరీ ఏర్పాటు చేసిన సమయంలో విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తామనే ఒప్పందంతో రూ.1.50 కోట్లు తీసుకుని, పాలు సరఫరా చేయలేదని, ఆ డబ్బులు ఇప్పిస్తే సంతోషిస్తామని ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు.

ఎన్టీఆర్–శ్రీకృష్ణుడి విగ్రహ ఏర్పాటుపై స్టే

తుది తీర్పు వెలువరించే వరకు ప్రతిష్టాపన ఆపాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మంలోని లకారం చెరువులో 54 అడుగుల ఎన్టీఆర్ శ్రీకృష్ణుడి రూప విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనుకోవడంపై హైకోర్టు స్టే విధించింది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఈ నెల 28న జూనియర్ ఎన్టీఆర్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేయించేందుకు ప్రభుత్వం సిద్ధమవడం తెలిసిందే. అయితే ఈ విగ్రహ ఏర్పాటును సవాల్ చేస్తూ భారత యాదవ సమితి, ఆల్ ఇండియా యాదవ సమితి, ఆదిభట్ల శ్రీకళాపీఠం, శ్రీకృష్ణ జేఏసీ సహా పలువురు లంచ్‌మోషన్ రూపంలో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపైనే అభ్యంతరం తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు, బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించడాన్ని నిషేధిస్తూ 2016లో జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. తుది తీర్పు వెలువరించే వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఆపాలని ఆదేశించింది.

ఖమ్మం చేరిన విగ్రహం...


ఖమ్మం మయూరి సెంటర్: శ్రీకృష్ణావతారంలో రూపొందించిన ఎన్టీఆర్ విగ్రహం ఖమ్మం చేరుకుంది. భారీ వాహనంలో 54 అడుగుల విగ్రహాన్ని గురువారం లకారం ట్యాంక్‌బండ్ వద్దకు తీసుకొచ్చారు. విగ్రహాన్ని స్థానికులు పెద్ద సంఖ్యలో తిలకించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో 'తానా', ఎన్ఆర్ఐలు, పలువురు పారిశ్రామికవేత్తల సహకారంతో భారీ విగ్రహాన్ని నిజామాబాద్‌కు చెందిన కళాకారుడు వర్మ ఈ విగ్రహాన్ని రూపొందించారు.

జూలో మరణ మృదంగం

- రెండు నెలల్లో మూడు జంతువుల మృతి
- ఇవన్నీ ఆడ జంతువులే కావడం బాధాకరం
- ఎన్‌క్లోజర్లలో ఒంటరిగా మిగిలిన జిరాఫీ, జీబ్రా



ఈనెల 8న మృతి చెందిన తెల్ల పులి(ఫైల్)



బుధవారం మృతి చెందిన ఆడ జిరాఫీ(ఫైల్)

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ఇక్కడ లేని అరుదైన జంతువులను విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో జూ పార్కుల నుంచి తీసుకొచ్చినా వాటి సంతతి పెరగడం లేదు కదా.. ఒక్కొక్కటిగా సందర్శకులకు దూరమవుతున్నాయి. రెండు నెలల వ్యవధిలో జీబ్రా, తెల్ల పులి, జిరాఫీ మృతి చెందడం బాధాకరం. ఇవన్నీ ఆడ జంతువులే. దీంతో వాటి సంతతి వృద్ధి చెందే అవకాశం లేకుండాపోయింది. జీబ్రా, తెల్ల పులి, జిరాఫీ జూకు రాక ముందు వాటి జాడ లేదు. జతలుగా ఇక్కడకు వచ్చిన ఆయా జంతువులు ప్రస్తుతం ఒంటరయ్యాయి.

వైద్య సేవలు అందకేనా..?

జూలో పూర్తిస్థాయి ఆస్పత్రి ఉంది. ఇన్‌పేషెంట్ వార్డు కూడా నిర్మించారు. అనారోగ్యానికి గురయ్యే వన్యప్రాణులను ఇక్కడ ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స ఉందించే వీలుంది. ఇక్కడ సీనియర్ వైద్యుడు, అసిస్టెంట్‌తో పాటు సహాయకులు ఉన్నారు. అయినా వైద్య సేవలు సరిగా అందకపోవడం వల్లే వన్యప్రాణులు తరచూ మృత్యువాత పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలో మూడు జంతువులు చనిపోవడంపై సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కులోని జంతువులు, పక్షులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

గైనిక్ సమస్యతో...

మలేషియా దేశంలోని నెగ్రా జూ పార్కు నుంచి 2013లో అప్పటి జూ క్యూరేటర్ రామలింగం ఓ జత జిరాఫీలను ఇక్కడకు తీసుకొచ్చారు. మలేషియా నుంచి ఓడలో మూడు జిరాఫీలను చెన్నై పోర్టుకు తీసుకొస్తుండగా.. వాటిలో మగ జిరాఫీ సముద్ర మార్గమధ్యలోనే మృతి చెందింది. మిగిలిన జిరాఫీలు విశాఖ జూ పార్కుకు చేరాయి. అప్పటికి మగ జిరాఫీ(బేకన్) వయసు ఏడాదిన్నర కాగా.. ఆడ జిరాఫీ(మే)కి నాలుగు నెలలే.. అవి జూలోనే పెరిగి పెద్దయ్యాయి. ఈ క్రమంలో జిరాఫీల సంఖ్యను వృద్ధి చేయాలనే ఆలోచనతో 2019లో అప్పటి క్యూరేటర్ యశోదబాయి వాటి పునరుత్పత్తికి బాటలు వేశారు. ఈ నేపథ్యంలో గర్భం దాల్చిన ఆడ జిరాఫీకి పుట్టిన పిల్ల 12 రోజుల్లో మృతి చెందింది. మరోసారి 2020లో కూడా గర్భం దాల్చిన ఆ జిరాఫీ కడుపు లోపలే పిల్ల మరణించింది. అప్పటి నుంచి 'మే'గైనిక్ సమస్యతో బాధపడుతున్నట్లు జూ అధికారులు తెలిపారు. ఈ సమస్య మరింత విషమించి.. మూడు నెలలుగా ఆహారం కూడా సరిగా తీసుకోకపోవడంతో నీరసించిపోయింది. బుధవారం తెల్లవారుజామున ప్రాణాలు విడిచింది. దీంతో ఈ జాతి జంతువుల సంతతి పెరిగే అవకాశం లేకుండాపోయింది. మరోవైపు మగ జిరాఫీ ఎన్‌క్లోజర్‌లో ఒంటరిగా మిగిలిపోయింది. సాధారణంగా జిరాఫీలు 20 నుంచి 25 ఏళ్లు జీవిస్తాయి. జూలో మంచి వైద్యం, ఆహారం క్రమం తప్పకుండా అందిస్తారు కాబట్టి.. వాటి జీవిత కాలం మరింత పెరుగుతుంది. కానీ ఇక్కడ జిరాఫీ 10 ఏళ్లకే మృత్యువాత పడటం.. జూ అధికారులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు.

అనారోగ్యంతో...

తెల్ల పులి కుమారి(19) ఈ నెల 8న మృతి చెందింది. 2007 కంటే ముందు ఇందిరాగాంధీ జూ పార్కులో తెల్ల పులులు లేవు. అప్పటి జూ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కు నుంచి ఓ జత తెల్ల పులులను ఇక్కడకు తీసుకొచ్చారు. వాటిలో కుమారి అనే ఆడ తెల్ల పులి మూడు సార్లు గర్భం దాల్చి 9 కూనలకు(పిల్లలు) జన్మనిచ్చింది. దీంతో జూలో వాటి సంతతి పెరిగింది. వాటిలో కొన్నింటిని జంతు మార్పిడి పద్ధతి ద్వారా ఇతర జూ పార్కులకు తరలించి.. అక్కడ నుంచి కొన్ని జంతువులను ఇక్కడకు తీసుకొచ్చారు. కాన్పూర్ జూకు రెండు తెల్ల పులులను ఇచ్చి.. అక్కడ నుంచి ఒక మగ ఖడ్గ మృగాన్ని ఇక్కడకు తీసుకొచ్చారు. 19 ఏళ్ల వయసుగల కుమారి వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఈ నెల 8న మృతి చెందింది. ప్రస్తుతం జూలో ఐదు తెల్ల పులులున్నాయి.

తిండి తినక.. నీరసించి..

ఇక్కడ రాణి అనే జీబ్రా రెండు నెలల కిందట మృతి చెందింది. నాలుగేళ్లకు ముందు ఇక్కడ జూలో జీబ్రాలు లేవు. 2019 నవంబరులో అప్పటి జూ క్యూరేటర్ యశోదభాయి ఓ జత జీబ్రాలను కోల్‌కతాలోని అలిపూర్ జూ పార్కు నుంచి జంతు మార్పిడి పద్ధతిలో ఇక్కడకు తీసుకొచ్చారు. వాటికి బదులుగా ఇక్కడ నుంచి ఐదు అడవి కుక్కల(రేచు కుక్కలు)ను పంపించారు. అప్పటి నుంచి జీబ్రాలు సందర్శకులను అలరిస్తూ వచ్చాయి. వాటిలో మగ జీబ్రాకు రాజు, ఆడ జీబ్రాకు రాణి అని పేర్లు పెట్టారు. ఏడేళ్ల వయసు ఉన్న ఆడ జీబ్రా రాణి కొంత కాలం కిందట అనారోగ్యానికి గురైంది. ఆహారం తినకుండా ఇసుక, మట్టి తినడం వల్ల బాగా నీరసించిపోయింది. సాధారణంగా ఆరోగ్యం బాగాలేనప్పుడు ఇసుక, మట్టి తినడం జీబ్రాల లక్షణం. జూ పార్కుల్లో ఉండే జీబ్రాలు ఇసుక, మట్టి తినేటప్పుడు వాటి ఆరోగ్యం బాగా లేదని అధికారులు, జూ వైద్యులు గమనించి.. వాటికి అవసరమైన వైద్యం అందిస్తుంటారు. కానీ ఇక్కడ వైద్యులు జీబ్రా ఇసుక తింటున్న విషయం పసికట్టలేకపోయారు. దీంతో అనారోగ్యానికి గురైన ఆడ జీబ్రా ఈ ఏడాది మార్చి 12న మృతి చెందింది. జీబ్రాకు పోస్టుమార్టం నిర్వహించినప్పుడు దాని పొట్ట నుంచి 16 కిలోల ఇసుక బయటపడటం అధికారులను విస్మయానికి గురిచేసింది. రాణి మృతి చెందినప్పటి నుంచి రాజులో హుషారు తగ్గిపోయింది.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



జూలోని జంతువులు, పక్షులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. కొన్ని జంతువులు అనారోగ్యానికి గురై మృతి చెందుతున్నాయి. జిరాఫీ మెట్రిటిస్, నిమోనియాతో కొన్నాళ్లుగా బాధపడుతోంది. అందుకు తగిన వైద్యం అందించినప్పటికీ మరణించింది. తెల్ల పులి వృద్ధాప్యంతో మృతి చెందింది. జీబ్రా తక్కువ వయసులోనే మరణించడం బాధాకరం. మరింత మంచి వైద్యం అందించి వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఒంటరైన జంతువుల తోడు కోసం.. ఇతర జూ పార్కుల నుంచి ఆయా జంతువులను తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– నందనీ సలారియా, జూ క్యూరేటర్

ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్

- డబ్బులు పోవడంతో ఉరి వేసుకున్న యువకుడు
- రంగారెడ్డి జిల్లా నార్లగూడ తండాలో ఘటన

షాద్‌నగర్: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాన్ని బలిగొంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నార్లగూడ తండాలో గురువారం ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం నార్లగూడ తండాకు చెందిన ఆంగోతు అమర్, సువర్ణ దంపతుల రెండో కుమారుడు ప్రకాశ్ (19) ఇటీవల పదో తరగతి పూర్తి చేసి.. టైల్స్ పని చేసేందుకు వెళుతున్నాడు. ప్రకాశ్ తరచుగా స్నేహితులతో కలసి క్రికెట్ ఆడుతూ ఆటపై ప్రేమను పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఐపీఎల్ జట్లపై తన స్నేహితులతో క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు సమాచారం. బుధవారం రాత్రి ఢిల్లీ, పంజాబ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు విజయం సాధిస్తుందని ప్రకాశ్ కొంత మంది స్నేహితులతో కలసి బెట్టింగ్‌లో పాల్గొన్నాడు. అయితే పంజాబ్ ఓడిపోవడంతో బెట్టింగ్ డబ్బులు ఇవ్వాలని స్నేహితులు వేధింపులకు గురిచేశారు. డబ్బులు లేకపోవడం, వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మనోవేదనకు గురైన ప్రకాశ్.. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెట్టింగ్‌లో ప్రకాశ్ లక్షన్నర రూపాయలకు పైగా పోగొట్టుకున్నట్లు సమాచారం. మృతుడి తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, యువత బెట్టింగ్ ఉచ్చులో పడి మోసపోవద్దని, విలువైన ప్రాణాలు పోగొట్టుకోవద్దని సీఐ నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. బెట్టింగ్‌లకు పాల్పడినా, ఎవరైనా వేధింపులకు గురిచేస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.


క్రొచెట్ డిజైన్ డ్రెస్‌లో మోడల్

డిజైన్లు అల్లినారు

మనవైన చేనేతలు అంతర్జాతీయ మార్కెట్లోకి వెళ్లినప్పుడు ఉపాధి అవకాశాలు కూడా అంతే ఘనంగా లభిస్తాయి. ఫ్యాబ్రిక్‌తోనే కాదు దారంతోనూ అద్భుతాలు చేయచ్చు, అంతర్జాతీయ మార్కెట్లోకి మన కళను కళ్లకు కట్టచ్చు ..అని మన నవతరం మరో అడుగు ముందుకు వేసింది. హైదరాబాద్ ఎఫ్‌డిడిఐ ఇన్‌స్టిట్యూట్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు వెస్ట్‌గోదావరిలోని నర్సాపురం, మండవారి పేటలో క్రొచెట్ (అల్లిక) వర్క్ చేసే క్లస్టర్స్‌తో కలిసి మోడర్న్ డ్రెస్ డిజైన్స్ రూపొందించారు. మన క్రొచెట్ వర్క్‌కి అంతర్జాతీయంగా పేరు తీసుకురావాలని వీరు చేసిన కృషి ఇటీవల అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా టీమ్‌వర్క్ డిజైనర్లు దీక్షిక, వాక్షిక, షామిలీ, పవన్ లు ఎన్నో విషయాలను మన ముందుంచారు.


దారాల అల్లికతో రూపు కట్టిన అందం

బర్డ్ ఇన్ ద నెస్ట్

'పిచుకలు గడ్డితోనూ, ఇతర వ్యర్థాలతోనూ తమ గూడును ఎంత నైపుణ్యంగా అల్లుకుంటాయో మనకు తెలుసు. అవి చాలా చూడముచ్చటగా ఉంటాయి. ఆ థీమ్‌ని మా కలెక్షన్‌లో చూపాలనుకున్నాం. ఒక పిచుక రకరకాల గడ్డి పరకలతో ఎలా తన ఇల్లు కట్టుకుంటుందో, అలా 'బర్డ్ ఇన్ ద నెస్ట్' పేరుతో క్రొచెట్ అల్లిక ద్వారా చూపాం. అలాగే, గూడు లోపల పిచుక కూచొని, బయటకు వెళ్లిపోయినప్పుడు ఆ గూడు ఎలా ఉంటుందో .. కూడా మా డిజైన్ ద్వారా ప్రజెంట్ చేశాం. ఈ థీమ్ తీసుకోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి.. ఇంటర్నేషనల్ కలెక్షన్ 2024– 25 సమ్మర్ – వింటర్ ట్రెండ్‌లో క్రొచెట్ ఉంది. అందుకు ముందస్తుగా మేమే ఒక కలెక్షన్ చేయాలనుకున్నాం. రెండవది.. వెస్ట్ గోదావరి జిల్లా, నర్సాపురం, మండపేట గ్రామంలో అంతా క్రొచెట్ వర్క్‌లో నిపుణులని, మన క్రొచెట్ క్లస్టర్ వర్క్‌కి అంతర్జాతీయ మార్కెట్‌లోకి తీసుకురావాలన్నది మా ఆలోచన.


క్రొచెట్ వర్క్ చేస్తున్న మహిళలు

లక్షన్నర ఖర్చు

హ్యాండ్లూమ్స్‌తో మన దగ్గర చాలా మంది చాలా రకాల థీమ్ ఫ్యాషన్స్ తీసుకువచ్చారు. అలా ఆలోచిస్తున్నప్పుడే మాకు మండపేట క్లస్టర్స్‌కి మా డిజైన్స్ గురించి చెప్పి, వారి నైపుణ్యాలను బయటి వారందరికీ పరిచయం చేయచ్చు అనిపించింది. ఫ్యాబ్రిక్‌తోనే కాదు దారంతోనూ మనదైన నైపుణ్యం చూపించవచ్చు అని ఎంచుకున్నాం. అల్లిక కోసం దారాలను ఢిల్లీ, సూరత్, అహ్మదాబాద్‌ల నుంచి తెప్పించాం. ఈ కలెక్షన్‌కి మొత్తం లక్షన్నర రూపాయల వరకు ఖర్చు అయ్యింది.

ఏడుగురు మహిళలు

మండపేట గ్రామంలో ముందుగా కొందరు మహిళలతో మాట్లాడాం. వారికి టైలరింగ్ అంటే తెలుసు కానీ, ఫ్యాషన్ డిజైనింగ్ అంటే తెలియదు. అప్పటివరకు వాళ్లంతా ఒకే స్టైల్‌ని అనుసరిస్తున్నారు. వాళ్లకు లేస్ వర్క్ చేస్తున్నామని మాత్రమే తెలుసు. అందులో టేబుల్, సోఫా కవర్లు మొదలైనవి ఉన్నాయి. 50 మంది మహిళలకు మేమే స్వయంగా వర్క్ షాప్స్ నిర్వహించాం. వారిలో ఏడుగురిని ఎంపిక చేసుకుని, ఈ వర్క్ ఇచ్చాం. ఈ మోడల్ క్రొచెట్ వర్క్‌కి ఓ రూపం రావడానికి 25 రోజులు పట్టింది. మొత్తం ఆరు డ్రెస్సులు రూపొందించాం. ఇప్పటివరకు వాళ్లెవరూ ఇలాంటి డ్రెస్సులను రూపొందించలేదు. అసలు కాన్సెప్ట్ అర్థం చేసుకోవడానికే వారికి నాలుగు రోజులు పట్టింది. ఫుట్‌వేర్, లెదర్ వస్తువు తయారీలోనూ ఈ క్రొచెట్‌ను ఇన్‌క్లూడ్ చేయచ్చు. వెస్ట్ గోదావరి కలెక్టర్‌ను కలిసి, డిజైనింగ్ స్టూడెంట్స్– ప్రభుత్వం కలిస్తే మండపేట క్లస్టర్స్ వర్క్‌ని ఒక అడుగు ముందుకు తీసుకెళ్లచ్చు అని వివరించాం. వాళ్లు అందుకు తమ అంగీకారాన్ని తెలిపారు.


క్రొచెట్ వర్క్ డ్రెస్ డిజైన్స్ చేసిన మహిళలతో డిజైనర్లు

బెస్ట్ క్రాఫ్ట్ రివైవల్ అవార్డు

దాదాపు 26 టీమ్స్ తమ భిన్నమైన వర్క్స్‌తో మా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. అందులో మేం చేసిన ఈ ఆలోచనకు, ప్రయత్నానికి మా కాలేజీ నుంచి 'బెస్ట్ క్రాఫ్ట్ రివైవల్ అవార్డు' అందుకున్నాం. ఈ అవార్డు అందుకున్నప్పుడు మాకు కలిగిన ఆనందం మాటల్లో చెప్పలేం' అని వివరించారు ఈ డిజైనర్లు.

• • •

నేర్చుకున్న విద్య ద్వారా కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే తపనతోపాటు, అంతర్జాతీయంగా మన కళల నైపుణ్యాన్ని పరిచయం చేయాలని తపిస్తున్న యువతరాన్ని అభినందిద్దాం.

– నిర్మలారెడ్డి

కిచెన్ టిప్స్

వెండి వస్తువులు శుభ్రం చేసే పద్ధతి



కెచప్‌తో క్లీన్


వెండి వస్తువులను శుభ్రం చేయడానికి శ్యాండ్ విచ్, సమోసాలతో తినే కెచప్‌ను వాడొచ్చు. ఒక టిష్యూ పేపర్ మీద కాస్త కెచప్ వేసుకుని నలుపు ఉన్న దగ్గర రుద్దాలి. అలాగే ఓ 15 నిమిషాలు వదిలేయండి. ఆ తరువాత మెత్తని వస్త్రంతో తుడుచుకోవాలి. డిజైన్లున్న వస్తువులైతే మెత్తగా ఉండే టూత్ బ్రష్ తో ఒకసారి రుద్దండి. కెచప్‌లో ఉండే ఆమ్లతత్వం వల్ల వెండి వస్తువులు తెల్లబడతాయి.



వెనిగర్‌తో...

సగం కప్పు వెనిగర్‌లో, రెండు టేబుల్ స్పూన్ల బేకింగ్ సోడా, గోరువెచ్చని నీళ్లు కలిపి దాంట్లో వెండి వస్తువులు పూర్తిగా మునిగేనేలా పెట్టుకోవాలి. ఒక రెండు గంటల తరువాత చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి.

ఇత్తడి వస్తువులకు బియ్యప్పిండి, వెనిగర్



మూడు స్పూన్ల ఉప్పు, చెంచా మైదా లేదా బియ్యప్పిండి, నీళ్లు కలిపిన వెనిగర్ తీసుకుని పేస్ట్ లాగా చేసుకోవాలి. స్పాంజి లేదా ఏదైనా బట్ట సహాయంతో రాగి వస్తువులకు రాసుకోవాలి. ఆరిన తర్వాత వేడి నీళ్లతో కడిగేసుకుంటే చాలు. ఇత్తడి వస్తువుల నలుపు వదిలిపోతుంది. వెనిగర్‌కు బదులుగా నిమ్మరసం కూడా వాడొచ్చు.

రాగి వస్తువులు శుభ్రం చేసే పద్ధతి



రాగి వస్తువులను నిమ్మరసంతో, వెనిగర్‌తో, కెచప్ తో కూడా శుభ్రం చేసుకోవచ్చు. టూత్ పేస్ట్ కూడా ఉపయోగించొచ్చు. కానీ అస్సలే నలుపు తగ్గకపోతే ఈ పద్ధతిలో శుభ్రం చేసి చూడండి.

లోతు ఎక్కువగా ఉన్న స్టీల్ పాత్ర తీసుకోవాలి. దాంట్లో రాగి వస్తువులు మునిగేలా నీళ్లు పోసుకోవాలి. మూడు వంతుల నీళ్లకు 1 వంతు వెనిగర్ వేయాలి. దీంట్లోనే 3 చెంచాల ఉప్పు కూడా వేసుకోవాలి. ఇప్పుడు దీంట్లో రాగి వస్తువును మునిగేలా పెట్టుకుని, నీళ్లను వేడి చేసుకోవాలి. నీళ్లు మరగడం మొదలవ్వగానే జిడ్డు వదలడం గమనిస్తారు. ఇప్పుడు వెంటనే గ్యాస్ కట్టేయండి. నీళ్లు చల్లబడ్డాక రాగి వస్తువులు బయటకు తీసి నిమ్మరసం, ఉప్పు కలిపిన మిశ్రమంతో ఒకసారి రుద్ది కడిగేయండి.

• ఐడియా

ఇంట్లో అందరికీ షుగర్ వస్తే మంచి డాక్టర్ ఎవరా అని వెతుకుతారు అంతా. కాని ఎంబీఏ చేసి మంచి హోదాలో ఉన్న నవనూర్ కౌర్ మాత్రం ఉద్యోగం వదిలేసింది. లోకంలో ఇంత మందికి షుగర్ ఉందంటే చక్కెరకు ప్రత్యామ్నాయమైన బెల్లం అమ్మితే అటు ఆరోగ్యం, ఇటు లాభం అని నిశ్చయించుకుంది. 'జాగర్‌కేన్' అనే బ్రాండ్ స్థాపించి నాణ్యమైన బెల్లం పొడిని తెగ అమ్మేస్తోంది. టీలో కలపాలన్నా, స్వీట్ చేయాలన్నా బెల్లం పొడి బెస్ట్ అంటోంది. ఈమె వ్యాపారం జామ్మని సాగుతోంది.

బెల్లం పొడి అమ్మేస్తోంది



నవనూర్ కౌర్ ప్రచార చిత్రాలు ఎవరినైనా ఆకర్షిస్తాయి. ఒక పోస్టర్‌లో 'బెల్లం పాలు తాగితే ఎన్ని ఉపయోగాలో తెలుసా? వత్తిడి తగ్గుతుంది, స్త్రీలలో రుతుస్రావ సమస్యలు తగ్గుతాయి, హిమోగ్లోబిన్ పెరుగుతుంది, చర్మానికి మంచిది, జీర్ణక్రియ బాగుంటుంది, కీళ్ల నొప్పులు తగ్గుతాయి'. ఆ పోస్టర్ చూసినవారెవరైనా బెల్లం పాలు తాగాలనే అనుకుంటారు.

ఇంకో పోస్టర్‌లో చక్కెరకు బెల్లానికి ఉన్న వ్యత్యాసాలు చూపిస్తుందామె. 'చక్కెర రక్తంలో వెంటనే కరిగిపోతుంది. కాని బెల్లం మెల్లగా కరిగి మెల్లగా శక్తిని విడుదల చేస్తుంది. చక్కెరలో ఏ పోషకాలూ లేవు. బెల్లంలో ఐరన్, పొటాషియం ఉంటాయి. చక్కెర ఎసిడిటీ ఇస్తుంది. బెల్లం జీర్ణానికి అవసరమైన ఆల్కలైన్‌గా మారుతుంది'.

నవనూర్ కౌర్ బెల్లం అమ్మకాల్లో ఏదో గుడ్డిగా ప్రవేశించలేదు. ఒక సంపూర్ణ అవగాహన, లక్ష్యంతో తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది.

బిజినెస్ స్కూల్ విద్యార్థి

నవనూర్ కౌర్‌ది లూధియానా. తండ్రి ప్రొఫెసర్. తల్లి స్కూల్ ప్రిన్సిపాల్. చురుకైన విద్యార్థి అయిన నవనూర్ కౌర్ ఐఎంటి ఘజియాబాద్ నుంచి ఎంబీఏ చేసింది. వెంటనే కొటాక్ మహేంద్ర బ్యాంక్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. కాని తనకు వేరే ఏదో చేయాలని ఉండేది. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే చేయదగ్గ వ్యాపారం ఏమిటా అని ఆలోచిస్తే తమ కుటుంబంలో బంధువుల్లో షుగర్ పేషెంట్లు ఎక్కువగా ఉన్నారని అర్థమైంది. డయాబెటిస్ పేషెంట్లు, డయాబెటిస్ ఉన్న వాళ్లు తీపి కోసం బెల్లం ఉపయోగించాలని అనుకున్నా మార్కెట్‌లో దొరుకుతున్న బెల్లం నాణ్యంగా లేదని తెలుసుకుంది. ఆర్గానిక్ బెల్లం అని చెప్పి అమ్ముతున్నది కూడా కల్తీయే అని అర్థమయ్యాక ఒక వైపు ఉద్యోగంలో తాను సంపాదించిన ఐదు లక్షల రూపాయలతో బెల్లం పొడి తయారీ కేంద్రం పెట్టి, అందులో బెల్లం పొడి తయారు చేసి అమ్మాలని నిశ్చయించుకుంది.

అవాంతరాలు

ఆర్గానిక్‌గా చెరకు పండించి, రసాయనాలు లేకుండా బెల్లం తయారు చేసి సరుకు వేసేవారి కోసం నవనూర్ కౌర్ పంజాబ్, ఉత్తర ప్రదేశ్ చాలా తిరగాల్సి వచ్చింది. అలా ఇస్తామని చెప్పిన వారు కూడా మోసం చేయక తప్పని పరిస్థితిలో ఉన్నారని గ్రహించింది. అయితే అదృష్టవశాత్తు తన తండ్రి దగ్గర చదువుకుని సేంద్రియ పద్ధతిలో చెరకు పండిస్తున్న కౌశల్ అనే రైతు పంజాబ్‌లోనే ఆమెకు దొరికాడు. అతనికి బెల్లం తయారీ కేంద్రం కూడా ఉంది. 'నువ్వు నాణ్యమైన బెల్లం తయారు చేయ్. నేను మార్కెటింగ్, బ్రాండ్ చూసుకుంటాను. ఇద్దరం కలిసి వ్యాపారం చేద్దాం' అని చెప్పింది. కౌశల్ సరే అన్నాడు. ఇద్దరూ కలిసి 'జాగర్‌కేన్' అనే బ్రాండ్ మొదలుపెట్టారు.

వెంటనే ఆదరణ

నవనూర్ కౌర్ తయారు చేసిన బెల్లం పొడి వెంటనే ఆదరణ పొందింది. కల్తీ లేనిది కావడాన... రుచి కూడా బాగుండటాన అందరూ కొనడం మొదలెట్టారు. దుకాణం దారులు నిల్వ ఉండటం లేదని ఫిర్యాదు చేస్తే తగిన ప్రయోగాలు చేసి 9 నెలల పాటు నిల్వ ఉండేలా తయారు చేశారు.



ఇప్పుడు 22 జిల్లాల్లో ఆమెకు డిస్ట్రిబ్యూషన్ ఉంది. గత సంవత్సరం 2 కోట్ల టర్నోవర్ వచ్చింది. మరో ఐదేళ్లలో 100 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటామని భావిస్తోంది.

కృత్రిమమైన చక్కెర కంటే బెల్లం ఎక్కువ ఆరోగ్యకరమైనదని తెలుసుకునే కొద్దీ తనలా బెల్లం ఉత్పత్తులు చేసేవారు తప్పక విజయం సాధిస్తారని ఆమె గట్టిగా సందేశం ఇస్తోంది.


ఉద్యోగాలు మంచివే అయినా ఒక మంచి వ్యాపార ఐడియా ఎక్కడికో చేర్చగలదు. నవనూర సక్సెస్ స్టోరీ అందుకు ఉదాహరణ.

బీరాలు పోవట్లేదు

రుచికీ, ఆరోగ్యానికీ బీర అదుర్స్

డయాబెటిస్... హైబీపీ... రాజ్యమేలుతున్న రోజులివి. ఈ జంట సమస్యలు లేని ఇంటి కోసం భూతద్దంతో వెతకాల్సిందే. స్క్రీన్‌లతో స్మార్ట్‌గా కళ్లకు అద్దాలు జోడవుతున్నాయి. వీటికి జవాబులు మన 'వంటిల్లు'లో వెతుకుదాం. వేడిని తగ్గించి, కంటికి మేలు చేసి, రక్తాన్ని వృద్ధి చేసే... బీరకాయతో... రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం. బీరాలు పోవడం లేదు... బీరకాయ కూరలు చేస్తున్నాం.

బీరకాయ పల్లీ కర్రీ



కావలసినవి: బీరకాయ ముక్కలు – అర కేజీ; పల్లీలు (వేరు శనగపప్పు) – పావు కప్పు (వేయించాలి); కొబ్బరి ముక్కలు – పావు కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; ఆవాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; ఎండుమిర్చి – 2; పసుపు – పావు టీ స్పూన్; ఇంగువ– చిటికెడు; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; ధనియాల పొడి– 2 టీ స్పూన్‌లు; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర– ఒక కట్ట (తరగాలి); నీరు – ముప్పావు కప్పు.

తయారీ: • వేరుశనగపప్పు, కొబ్బరి ముక్కలు కలిపి గ్రైండ్ చేయాలి • బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, ఇంగువ, కరివేపాకు, పసుపు వేయాలి. అవి వేగిన తరవాత ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి • ఉల్లిపాయ ముక్కలు వేగిన తర్వాత ధనియాల పొడి, ఉప్పు, మిరప్పొడి వేసి నీరు పోసి మరిగించాలి. ఇప్పుడు బీరకాయ ముక్కలు వేసి కలిపి మగ్గనివ్వాలి. మిక్సీలో గ్రైండ్ చేసిన పల్లీలు– కొబ్బరి మిశ్రమాన్ని వేసి సమంగా కలిపి రుచి బీరకాయ ముక్కలకు పట్టేవరకు సన్న మంట మీద ఉడికించి, చివరగా కొత్తిమీర చల్లి దించేయాలి. ఇది అన్నంలోకి చపాతీలోకి కూడా మంచి కాంబినేషన్.

బీరకాయ నువ్వుల పచ్చడి



కావలసినవి: బీరకాయ ముక్కలు – కప్పు; టొమాటో ముక్కలు – అర కప్పు; చింతపండు– చిన్న గోళీ అంత; మినప్పప్పు – టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; నువ్వులు – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు– పావు టీ స్పూన్; జీలకర్ర – పావు టీ స్పూన్; ఎండుమిర్చి లేదా పచ్చిమిర్చి – 6; నూనె – టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.
పోపు కోసం... ఆవాలు– అర టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; వెల్లుల్లి రేకలు – 6; కరివేపాకు రెమ్మలు – 2; తెల్ల నువ్వులు – అర టీ స్పూన్.

తయారీ: • మందపాటి పెనంలో (నూనె లేకుండా) పచ్చి శనగపప్పు, మినప్పప్పు, నువ్వులు, మిర్చి, జీలకర్ర వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి • అదే పెనంలో నూనె వేడి చేసి బీరకాయ ముక్కలను ఒక మోస్తరుగా వేయించి పక్కన పెట్టాలి • అదే పెనంలో టొమాటో ముక్కలను వేసి సన్న మంట మీద మగ్గనివ్వాలి • ఈ లోపు వేయించిన గింజలు, మిర్చి చల్లారి ఉంటాయి. వాటిని మిక్సీ జార్‌లో మెత్తగా చేసి అందులో బీరకాయ ముక్కలు వేసి గ్రైండ్ చేయాలి. చివరగా టొమాటో ముక్కలు, చింతపండు, ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి • ఇప్పుడు పోపు పెట్టాలి. పెనంలో నూనె వేడి చేసి పోపుకోసం తీసుకున్న దినుసులన్నీ వేసి వేగిన తరవాత అందులో మిక్సీలో గ్రైండ్ చేసిన చట్నీని వేసి కలిపితే బీరకాయ చట్నీ రెడీ. ఇది ఇడ్లీ, దోశెలు, చపాతీలు, అన్నంలోకి కూడా మంచి రుచినిస్తుంది.

బీరకాయ వేపుడు



కావలసినవి: బీరకాయ ముక్కలు – 250 గ్రాములు; నూనె – టేబుల్ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; ఆవాలు – పావు టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; ఇంగువ– చిటికెడు; కరివేపాకు రెమ్మలు – 2; వెల్లుల్లి రేకలు – 4; ఎండుమిర్చి– 2; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పసుపు– పావు టీ స్పూన్; వేరుశనగపప్పు – టేబుల్ స్పూన్ (వేయించాలి). **పొడి కోసం:** పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; మినప్పప్పు – టేబుల్ స్పూన్; ఎండు కొబ్బరి తురుము– టేబుల్ స్పూన్; నువ్వులు – టేబుల్ స్పూన్; జీలకర్ర– టీ స్పూన్; వెల్లుల్లి రేకలు – 4; ఎండుమిర్చి– 2.

తయారీ: • బీరకాయలు లేతవి అయితే ఈనెలు తొలగించి చెక్కు ఉంచి ముక్కలు తరగవచ్చు. ముదురు కాయలకు చెక్కు కూడా తొలగించిన తరవాత ముక్కలు తరగాలి • బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, పోపు గింజలన్నీ వేసి అవి వేగిన తరవాత ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ, వెల్లుల్లి రేకలు వేసి వేగిన తర్వాత బీరకాయ ముక్కలు వేయాలి • రెండు – మూడు నిమిషాల సేపు మగ్గనిచ్చి, పసుపు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి మంట తగ్గించి సన్న మంట మీద వేగనివ్వాలి • మరొక బర్నర్ మీద మరొక బాణలి పెట్టి (నూనె లేకుండా) శనగపప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, నువ్వులు, జీలకర్ర, వెల్లుల్లి, కొబ్బరి తురుము వేసి మంచి వాసన వచ్చే వరకు సన్నమంట మీద వేయించి దించేయాలి. అన్నీ చల్లారిన తరవాత మిక్సీలో పొడి చేయాలి. • బీరకాయ ముక్కలను అడుగు నుంచి ఒకసారి కలిపి పొడి చల్లి కలపాలి. ఒకసారి ఉప్పు సరి చూసుకుని అవసరమైతే మరికొంత కలుపుకుని చివరగా వేరుశనగపప్పు చల్లి దించేయాలి.

ఇలా చేసిన బీరకాయ వేపుడును సాంబార్ వంటివాటిలో సైడ్ డిష్‌గానూ వడ్డించుకోవచ్చు. వేడి అన్నంలో నెయ్యితోపాటు కలుపుకోవచ్చు. చపాతీలకు కూడా బాగుంటుంది. వేపుడు అనగానే పోషకాలు కోల్పోయే వంట అనే సందేహం కలుగుతుంది. కానీ ఇలా చేస్తే పోషకాలను నిలుపుకోవచ్చు.



200 మీటర్ల విభాగంలో జ్యోతికి స్వర్ణ పతకం

జాతీయ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ రెండో స్వర్ణ పతకం సాధించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి గురువారం జరిగిన మహిళల 200 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది. జ్యోతి 200 మీటర్ల రేసును అందరికంటే వేగంగా 23.42 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని సంపాదించింది. బుధవారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌లోనూ జ్యోతి బంగారు పతకం గెలిచింది. ఏడు క్రీడాంశాల సమాహారమైన హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సౌమ్య మురుగన్ పసిడి పతకాన్ని దక్కించుకుంది.



జాగ్‌నిడ్జెను నిలువరించిన హారిక

మహిళల గ్రాండ్‌ప్రి అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక వరుసగా రెండో 'డ్రా' నమోదు చేసింది. సైప్రస్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో యూరోపియన్ మాజీ చాంపియన్ నానా జాగ్‌నిడ్జె (జార్జియా)తో గురువారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హారిక 19 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ప్రస్తుతం హారిక ఖాతాలో 1.5 పాయింట్లు ఉన్నాయి. నేడు జరిగే నాలుగో రౌండ్‌లో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో హారిక ఆడుతుంది.

కోహ్లి ధమాకా...

63 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 100

- చితగ్గొట్టిన డుప్లెసిస్
- హైదరాబాద్‌పై 8 వికెట్లతో బెంగళూరు ఘనవిజయం
- క్లాసెన్ వీరోచిత సెంచరీ వృథా



కోహ్లి

సాక్షి, హైదరాబాద్: కోహ్లి కొడితే కొండ కూడా పిండి కావాలి. ఉప్పల్‌లో గురువారం సరిగ్గా అదే జరిగింది. ఛేజింగ్‌లో కోహ్లి ఉప్పెనల్లే చెలరేగడంతో బెంగళూరు 8 వికెట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను సులువుగా ఓడించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను క్లాసెన్ (51 బంతుల్లో 104; 8 ఫోర్లు, 6 సిక్సర్లు) అంతా తానై మెరిపించాడు. హైదరాబాద్ అంతపెద్ద స్కోరు చేస్తే సొంత గడ్డపై సిరాజ్ (4–0–17–1) పొదుపుగా బౌలింగ్ చేశాడు. అనంతరం బెంగళూరు 19.2 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి 187 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (63 బంతుల్లో 100; 12 ఫోర్లు, 4 సిక్సర్లు) ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఆరో సెంచరీ నమోదు చేయగా... డుప్లెసిస్ (47 బంతుల్లో 71; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా ఆడుకున్నారు. ఈ శతకంతో ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా క్రిస్ గేల్ (6 సెంచరీలు) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సమం చేశాడు. అంతేకాకుండా ఒకే జట్టు తరఫున అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా కోహ్లి నిలిచాడు.

అతనొక్కడే...



క్లాసెన్

హైదరాబాద్ ఓపెనర్లు అభిషేక్ (11), రాహుల్ త్రిపాఠి (15) నిరాశపరిచారు. వీరిద్దరిని బ్రేస్‌వెల్ ఒకే ఓవర్లో పడగొట్టేశాడు. వాళ్లు చేసింది తక్కువే అయినా ఆ ప్రభావం ఇన్నింగ్స్‌పై పడకుండా క్లాసెన్ దూకుడుగా నడిపించాడు. కెప్టెన్ మార్క్‌రమ్ (20 బంతుల్లో 18) అండతో సన్‌రైజర్స్ స్కోరును అదే పనిగా పెంచాడు. ఈ క్రమంలో బౌండరీలు సిక్సర్లు అవలీలగా బాదేశాడు. క్లాసెన్ వీరబాదుడుతో బలమైన భాగస్వామ్యం వేగంగా నమోదైంది. మార్క్‌రమ్‌ను బౌల్డ్ చేసి షహబాజ్ 76 పరుగుల భాగస్వామ్యానికి ముగింపు పలికినా... క్లాసెన్ బ్యాటింగ్ జోరు, పరుగుల హోరెం తగ్గనేలేదు. 49 బంతుల్లోనే శతక్కొట్టేశాడు. ఎట్టకేలకు 19వ ఓవర్లో అతని విధ్వంసానికి హర్షల్ తెరదించాడు.

చకచకా లక్ష్యం వైపు...

లక్ష్యం కష్టమైందే... మ్యాచ్ ఆర్‌సీబీకి కీలకమైంది. అందుకే ఓపెనర్లు కోహ్లి, డుప్లెసిస్ ఛేదనకు తగ్గట్లే అడుగులు వేశారు. చకచకా పరుగులు చేశారు. బౌండరీలతో స్కోరుబోర్డును పరుగెత్తించి... సిక్సర్లతో స్టేడియాన్ని హుషారెత్తించారు. ప్రేక్షకులంతా సొంతజట్టు కంటే బెంగళూరు జట్టుకే జై కొట్టడంతో రెట్టించిన ఉత్సాహంతో ఓపెనింగ్ జోడీ చెలరేగిపోయింది. ఇద్దరు కూడా కలసికట్టుగా చితగ్గొట్టేయడంతో పవర్‌ప్లేలో ఆర్సీబీ 64/0 స్కోరు చేసింది. 11.1 ఓవర్లలో వంద పరుగుల్ని ఏ కష్టం లేకుండా దాటింది. లక్ష్యతీరానికి చేరాక ఓపెనర్లిద్దరు అవుటైనప్పటికీ మ్యాక్స్‌వెల్ (5 నాటౌట్), బ్రేస్‌వెల్ (4 నాటౌట్) డ్రామా లేకుండా ముగించారు.



ఉప్పల్‌లో ఊపేశాడు...

ముందుగా డుప్లెసిస్ (34 బంతుల్లో) ఫిఫ్టీ చేస్తే తర్వాతి ఓవర్లోనే కోహ్లి 35 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు. అర్ధసెంచరీ అయ్యాక కోహ్లి ఆట మరో లెవెల్‌కు చేరింది. ఛేదనలో మొనగాడిగా పేరున్న కోహ్లి తన పాత 'విరాట్‌రూపం' చూపించాడు. డ్రైవ్, కట్, హుక్ ఇలా కచ్చితత్వంతో కూడిన షాట్లు అతని బ్యాట్ నుంచి జాలువారడంతో కొండంత లక్ష్యం ఐస్‌ముక్కలా కరిగిపోయింది. మరో 27 బంతుల్లోనే కింగ్ కోహ్లి 50 నుంచి 100 పరుగులకు చేరుకున్నాడు. భువీ వేసిన 18వ ఓవర్ నాలుగో బంతికి కోహ్లి డీప్ మిడ్‌వికెట్ మీదుగా కొట్టిన సిక్సర్‌తో స్టేడియం ఊగిపోయింది. డగౌట్‌లోని సహచరులే కాదు... గ్యాలరీలోని ప్రేక్షకులంతా కరతాళధ్వనులతో సవ్వడి చేశారు. అతని అసాధారణ ఇన్నింగ్స్‌కు ముగ్ధులైన ప్రత్యర్థులు సైతం హ్యాట్సాఫ్ చెప్పారు. మరుసటి బంతికి అతను అవుటై నిష్క్రమిస్తుంటే స్టేడియం హోరెత్తింది.



స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) మహిపాల్ (బి) బ్రేస్‌వెల్ 11; త్రిపాఠి (సి) హర్షల్ (బి) బ్రేస్‌వెల్ 15; మార్క్‌రమ్ (బి) షహబాజ్ 18; క్లాసెన్ (బి) హర్షల్ 104; బ్రూక్ (నాటౌట్) 27; ఫిలిప్స్ (సి) పార్నెల్ (బి) సిరాజ్ 5; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 186.** వికెట్ల పతనం: 1–27, 2–28, 3–104, 4–178. 5–186. బౌలింగ్: సిరాజ్ 4–0–17–1, పార్నెల్ 4–0–35–0, బ్రేస్‌వెల్ 2–0–13–2, షహబాజ్ 3–0–38–1, హర్షల్ 4–0–37–1, కరణ్ శర్మ 3–0–45–0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) భువనేశ్వర్ 100; డుప్లెసిస్ (సి) త్రిపాఠి (బి) నటరాజన్ 71; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 5; బ్రేస్‌వెల్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.2 ఓవర్లలో 2 వికెట్లకు) 187.** వికెట్ల పతనం: 1–172, 2–177. బౌలింగ్: భువనేశ్వర్ 4–0–48–1, అభిషేక్ శర్మ 3–0–28–0, నటరాజన్ 4–0–34–1, త్యాగి 1.2–0–21–0, నితీశ్ కుమార్ రెడ్డి 2–0–19–0, మయాంక్ డాగర్ 4–0–25–0, ఫిలిప్స్ 1–0–10–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
లక్నో	13	7	5	1	15	0.304
బెంగళూరు	13	7	6	0	14	0.180
ముంబై	13	7	6	0	14	-0.128
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	13	6	7	0	12	-0.308
ఢిల్లీ	13	5	8	0	10	-0.572
హైదరాబాద్	13	4	9	0	8	-0.558

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ x రాజస్తాన్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఓటమి వ్యత్యాసం కూడా కీలకమే

సునీల్ గావస్కర్

మూడు ప్లే ఆఫ్ బెర్త్‌ల కోసం ఐదు జట్లు ఇంకా బరిలో ఉన్నాయి. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఇప్పటికే ప్లే ఆఫ్ బెర్త్‌ను ఖరారు చేసుకోవడంతోపాటు టాప్ ర్యాంక్‌తో లీగ్ దశను ముగించనుంది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌ల్లో గెలిస్తే చెన్నై, లక్నో జట్లకు రెండో స్థానంతో లీగ్‌ను ముగించే అవకాశం ఉంది. ఇందులో రన్‌రేట్ కూడా ముఖ్యపాత్ర పోషించనుంది. అందుకే లీగ్ మ్యాచ్‌ల్లో విజయ వ్యత్యాసం కీలకంగా మారింది. బెంగళూరుతో మ్యాచ్‌లో ఈ విషయం రాజస్తాన్ మర్చిపోయినట్టుంది. ఒకవేళ రాజస్తాన్ లీగ్ దశలో సంయుక్తంగా నాలుగో స్థానంలో నిలిస్తే రన్‌రేట్ వ్యత్యాసం వారి ప్లే ఆఫ్ అవకాశాలను ప్రభావితం చేస్తుంది. టి20 ఫార్మాట్‌లో ఎప్పుడు ఏమి జరుగుతుందో కచ్చితంగా చెప్పలేం. అయితే మ్యాచ్ చేజారిపోతున్న దశలో ఓటమి వ్యత్యాసం సాధ్యమైనంత తగ్గించేందుకు ఆయా జట్ల బ్యాటర్లు కృషి చేయాలి. కానీ బెంగళూరుతో మ్యాచ్‌లో రాజస్తాన్ బ్యాటర్లు అలా చేయలేదు. క్రీజులో వచ్చిన ప్రతి బ్యాటరు భారీ షాట్‌లకు యత్నించి వికెట్లు పారేసుకున్నారు. రాజస్తాన్‌పై భారీ విజయంతో బెంగళూరుకు ఒక్కసారిగా ప్లే ఆఫ్‌నకు అర్హత పొందే అవకాశాలు పెరిగాయి. ఈ అవకాశాన్ని బెంగళూరు ఎలా సద్వినియోగం చేసుకుంటుందో చూడాలి. ఢిల్లీతో మ్యాచ్‌లో పంజాబ్ జట్టుకు ఆడిన అనుభవజ్ఞులైన విదేశీ బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. గత సీజన్‌లో ఆకట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్ ఈసారి మాత్రం తేలిపోయాడు. అతడిని ఎలా ఎదుర్కోవాలో అన్ని జట్ల బ్యాటర్లకు తెలిసిపోయింది. తాను ఎందుకు విఫలమవుతున్నానో అర్ష్‌దీప్ సింగ్ తెలుసుకొని మళ్లీ గాడిలో పడాల్సిన అవసరముంది. భవిష్యత్‌లో భారత్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడే సత్తా అర్ష్‌దీప్‌లో ఉంది. ఢిల్లీతో మ్యాచ్‌లో లివింగ్‌స్టోన్ అద్భుతంగా ఆడినా విజయం మాత్రం దక్కలేదు. అయితే మిగతా ఆటగాళ్లు కూడా పోరాటపటిమను కనబర్చాల్సిన అవసరముంది. మొత్తానికి నాలుగో ప్లే ఆఫ్ బెర్త్ కోసం ఐపీఎల్ లీగ్ దశకు అద్భుతమైన ముగింపు లభించనుంది.



పరాజయంతో మొదలు...

అడిలైడ్: ఆస్ట్రేలియా మహిళల హాకీ జట్టుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత మహిళల హాకీ జట్టు ఓటమితో ప్రారంభించింది. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2–4 గోల్స్‌తో పరాజయం పాలైంది. భారత్ తరఫున సంగీత (29వ ని.లో), షర్మిలా దేవి (40వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్‌తో భారత ప్లేయర్ మోనిక తన కెరీర్‌లో 200 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. సిరీస్‌లోని రెండో మ్యాచ్ శనివారం జరుగుతుంది.

సెమీస్‌లో అవ్‌నీత్ కౌర్



షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీ కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో అవ్‌నీత్ కౌర్... పురుషుల వ్యక్తిగత విభాగంలో ప్రథమేశ్ జావ్కర్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్లో అవ్‌నీత్ 147–144తో డాఫ్నీ క్వింటెరో (మెక్సికో)పై, ప్రథమేశ్ 149–148తో చోయ్ యోంగీ (దక్షిణ కొరియా)పై నెగ్గారు. భారత స్టార్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి సురేఖ మూడో రౌండ్‌లోనే వెనుదిరిగింది.

ఫ్రెంచ్ ఓపెన్‌కు తొలిసారి నాదల్ దూరం



పారిస్: తుంటి గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో తన కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నుంచి రాఫెల్ నాదల్ వైదొలిగాడు. ఈనెల 28 నుంచి పారిస్‌లో మొదలయ్యే ఈ మెగా ఈవెంట్‌లో తాను పాల్గొనడం లేదని 36 ఏళ్ల నాదల్ గురువారం అధికారికంగా ప్రకటించాడు. 2005లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో బరిలోకి దిగిన నాదల్ 2022 వరకు క్రమం తప్పకుండా ఈ టోర్నీలో పోటీపడ్డాడు. ఎవరికీ సాధ్యంకానిరీతిలో 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి కొన్ని నెలలు పట్టే అవకాశం ఉందని... వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ తాను బరిలోకి దిగకపోవచ్చని... వచ్చే ఏడాది తర్వాత ఆటకు వీడ్కోలు పలికే ఆలోచనతో ఉన్నట్లు నాదల్ తెలిపాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా నాదల్‌కు తుంటి గాయం తిరగబెట్టింది.

సినిమా

స్విస్‌లో సాంగ్



చిరంజీవి

అసలే ఎండాకాలం.. పైగా కొన్ని చోట్ల ఎండలు మండిపోతున్నాయి. ఇలాంటి టైమ్‌లో కూల్ కూల్‌గా ఉండే ప్రాంతానికి వెళ్లే చాన్స్ వస్తే.. హాయి హాయిగా ఉంటుంది. ప్రస్తుతం 'భోళా శంకర్' టీమ్ ఆ హాయినే అనుభవిస్తోంది. ఇటీవల స్విట్జర్లాండ్‌లో ల్యాండ్ అయ్యాడు 'భోళా శంకర్'. అక్కడి కూల్ కూల్ క్లైమేట్‌లో ప్రేయసితో ఫుల్ స్వింగ్‌లో స్ప్రింగ్‌లాంటి స్టెప్పులేస్తున్నాడట. చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి సరసన తమన్నా నటిస్తున్న ఈ చిత్రంలో ఆయన చెల్లెలి పాత్రలో హీరోయిన్ కీర్తీ సురేష్ నటిస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. ఇటీవల ఈ సినిమా షూటింగ్ స్విట్జర్లాండ్‌లో ప్రారంభమైంది. చిరంజీవి, తమన్నాలపై సాంగ్ చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణను కూడా ప్లాన్ చేశారు. సుశాంత్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మహతి స్వరసాగర్ స్వరకర్త. 'భోళా శంకర్' సినిమా ఆగస్టు 11న విడుదల కానుంది.

నెగటివ్ రోల్‌లో..?



ఎన్టీఆర్

ఎన్టీఆర్‌లో నెగటివ్ యాంగిల్ ఎలా ఉంటుందో చూపించిన చిత్రం 'జై లవ కుశ'. ఆ చిత్రంలో 'జై' పాత్రలో విలన్‌గా విజృంభించారు ఎన్టీఆర్. పాజిటివ్ షేడ్స్ ఉన్న లవ, కుశలో హీరోయిజం చూపించారు. తాజాగా మరోసారి ఎన్టీఆర్ నెగటివ్ షేడ్ ఉన్న రోల్‌లో కనిపించనున్నారని టాక్. అది కూడా హిందీ తెరపై. బాలీవుడ్ యశ్ రాజ్ ఫిలింస్‌పై ఫ్రాంచైజీలోని 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రధారులుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఇందులో ఎన్టీఆర్ పాత్రకు కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయని, అలాగే ఆయన పాత్ర నెగటివ్‌గా ఎందుకు మారుతుంది? అనేదానికి ఓ బలమైన కారణం ఉండేలా అయాన్ ముఖర్జీ స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నారని బాలీవుడ్ టాక్. ఈ చిత్రంలో కథానాయికల పాత్రల కోసం దీపికా పదుకోన్, శర్వరీ వాఘ్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. అత్యంత భారీ బడ్జెట్‌తో ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ ఏడాది చివర్లో రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభించాలని అనుకుంటున్నారట. ఇక ప్రస్తుతం దర్శకుడు కొరటాల శివతో సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదల కానుంది.

ఆల్ సెట్



మహేశ్ బాబు

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుంది. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా షూటింగ్‌ను ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో ఆరంభించే ఆలోచనలో ఉన్నట్లుగా ఈ చిత్ర కథారచయిత విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇందుకు తగ్గట్లుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను సెట్ చేస్తున్నారట రాజమౌళి అండ్ కో. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దీపికా పదుకోన్, ఆలియా భట్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. ఇక ఇటీవలే వెకేషన్‌కు వెళ్లిన మహేశ్ స్పెయిన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. కాగా ప్రస్తుతం త్రివిక్రమ్‌తో సినిమా చేస్తున్నారు మహేశ్‌బాబు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ జూన్ మొదటి వారంలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి జనవరి 13న విడుదల కానుంది.

లెజెండ్స్ కలిశారు

సిల్వర్‌స్క్రీన్ సూపర్‌స్టార్ రజనీకాంత్, క్రికెట్ స్టార్ కపిల్ దేవ్ 'లాల్‌సలామ్' సినిమా కోసం స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. రజనీకాంత్, విష్ణువిశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పోర్ట్స్ డ్రామా 'లాల్ సలామ్'. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల ముంబైలో మొదలైంది. ఈ చిత్రంలో కపిల్‌దేవ్ నటిస్తున్నారు. ''ప్రముఖులు, మానవతావాది, భారతదేశానికి క్రికెట్‌లో తొలి వరల్డ్ కప్‌ను తీసుకువచ్చిన కపిల్‌దేవ్‌గారితో వర్క్ చేయడం గౌరవంగా ఉంది'' అని రజనీకాంత్ ట్వీట్ చేశారు. ''ఈ ఇద్దరు లెజండ్స్ (రజనీ, కపిల్‌దేవ్) 'లాల్ సలామ్' కోసం స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు'' అన్నారు విష్ణు విశాల్. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో 'లాల్ సలామ్' రూపొందుతోంది. అందుకే కపిల్ దేవ్‌ని కీలక పాత్రకు సంప్రదించి ఉంటుంది చిత్ర యూనిట్.



కపిల్ దేవ్, రజనీకాంత్

ఛూ మంతర్ !

చరణ్ లక్కరాజు, యశశ్రీ జంటగా 'ఛూ మంతర్' అనే సినిమా షురూ అయింది. ఈ చిత్రంతో బి.కల్యాణ్ కుమార్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. వెంకట్ కిరణ్‌కుమార్ కాళ్లకూరి నిర్మిస్తున్న ఈ మూవీ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి చిత్ర నిర్మాత కిరణ్ తల్లి శ్రీలక్ష్మీ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు సంజీవ్‌రెడ్డి క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు శ్రీనివాస్ తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. కిరణ్‌కుమార్ కాళ్లకూరి మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నిర్మించిన తొలి చిత్రం 'గ్రే' ఈ నెల 26న విడుదలకానుంది. అలాగే రెండో చిత్రంగా 'హ్యాష్‌టాగ్ కృష్ణా రామ' నిర్మించాను. ఇప్పుడు 'ఛూ మంతర్' ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందుతోంది'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: సందీప్, పల్లవి, రవి, సంగీతం: సుధా శ్రీనివాస్, కెమెరా: మధుసూదన్ కోట.



చరణ్, యశశ్రీ

యాక్షన్.. థ్రిల్

మణి సాయితేజ, పవన్ వర్మ, వైడూర్య, రేఖ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రాక్షపురం 3 కి.మీ.'. ఆర్‌కే గాంధీ దర్శకత్వం వహించారు. దీక్షిక సమర్పణలో కొండ్రాసి ఉపేందర్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా టీజర్‌ని నటుడు వెంకట్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. మంచి యాక్షన్‌తో కూడిన థ్రిల్లర్ చిత్రమనిపించింది. ఈ సినిమాని థియేటర్లలో చూసి హిట్ చేయండి'' అన్నారు. ''జూన్ 23న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని అనుకుంటున్నాం'' అన్నారు ఆర్‌కే గాంధీ. ''గాంధీగారు కష్టపడి మంచి అవుట్‌పుట్ తీసుకొచ్చారు'' అన్నారు కొండ్రాసి ఉపేందర్. ఈ చిత్రానికి కెమెరా: ఎం. నాగేంద్ర కుమార్, సంగీతం: ఘంటాడి కృష్ణ, ఎమ్ఎల్ రాజా, జయసూర్య బొంపెం.



వెంకట్, మణి సాయితేజ

దేశీ హంగామా



అమీజాక్సన్



'కాన్స్' ఉత్సవాల్లో మధుర్ భండార్కర్, ఖుష్బూ, విజయ్‌వర్మ, ఈషా గుప్తా

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 76వ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో భారత సినీ తారలు మెరుస్తున్నారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈ వేడుకలు 27 వరకు జరుగుతాయి. ఇప్పటికే కాన్స్ రెడ్ కార్పెట్‌పై సారా అలీ ఖాన్, ఈషా గుప్తా, ఊర్వశీ రౌతేలా క్యాట్ వాక్‌తో ఆకట్టుకున్నారు. తాజాగా ఆస్కార్ అవార్డు విన్నింగ్ ప్రొడ్యూసర్ గునీత్ మోంగా, ఖుష్బూ, అమీ జాక్సన్, దర్శక-రచయిత, నిర్మాత, నటుడు విఘ్నేష్ శివన్, దర్శక-నటుడు ప్రదీప్ రంగనాథన్‌లు పాల్గొన్నారు. ఇక మృణాల్ ఠాకూర్, ఐశ్వర్యా రాయ్ మరికొన్ని గంటల్లో ఈ రెడ్ కార్పెట్‌పై మెరవనున్నట్లు టాక్. మొత్తానికి కాన్స్‌లో దేశీ హంగామా బాగానే కనబడుతోంది.



మురుగన్, గునీత్ మోంగా

ప్రతీకారం మామూలుగా ఉండదు

'పోలీసాఫీసర్ భన్వర్ సింగ్ షెకావత్ (ఫహద్ ఫాజిల్) ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధం అయ్యారు.. ఈసారి ఆయన ప్రతీకారం మామూలుగా ఉండదు' అంటూ 'పుష్ప–2 ది రూల్' యూనిట్ పేర్కొంది. అల్లు అర్జున్, రష్మికా మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప: ది రైజ్' తొలి భాగం 2021 డిసెంబరు 17న విడుదలై పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప–2 ది రూల్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా 'పుష్ప: ది రైజ్'లో మలయాళ నటుడు ఫాహద్ ఫాజిల్ పోషించిన పోలీసాఫీసర్ భన్వర్ సింగ్ షెకావత్ పాత్ర ప్రేక్షకుల్ని అలరించింది. 'పుష్ప–2 ది రూల్'లోనూ ఆయన పాత్ర కీలకంగా ఉండబోతున్న సంగతి విదితమే. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఫాహద్ ఫాజిల్‌పై కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కించారు సుకుమార్. ఆ షెడ్యూల్ పూర్తవడంతో సుకుమార్, ఫాహద్ ఫాజిల్ సెట్‌లో ఉన్న వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్.



సుకుమార్, ఫాహద్ ఫాజిల్

సాక్షి బిజినెస్
శుక్రవారం
19-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	129	61,432
నిఫ్టీ ▽	52	18,130

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,612	△	111
డోజోన్స్	33,276	▽	145
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,742	△	19
డాక్స్	16,163	△	212
షాంఘై	3,297	△	13
నికాయ్	30,574	△	480

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో	ముంబై
బంగారం (99.9స్వచ్ఛత)	60,474
బంగారం (99.5స్వచ్ఛత)	60,232
వెండి (కేజీ)	71,496

ఇండిగోకు లాభాలు

క్యూ4లో రూ.919 కోట్లు



న్యూఢిల్లీ: ఇండిగో బ్రాండ్‌పై విమానయాన సేవలు అందించే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్చి త్రైమాసికంలో లాభాల్లోకి అడుగు పెట్టింది. రూ.919 కోట్ల లాభాన్ని ప్రకటించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఆర్జించిన రూ.253 కోట్లను మినహాయించి చూస్తే నికర లాభం రూ.664 కోట్లుగా ఉన్నట్టు అర్థం చేసుకోవచ్చు. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో ఇండిగో రూ.1682 కోట్ల నష్టాన్ని చూడడం గమనార్హం. మొత్తం ఆదాయం మార్చి త్రైమాసికంలో 78 శాతం పెరిగి రూ.14,600 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.8,207 కోట్లుగా ఉంది. ప్రయాణికుల టికెట్ల రూపంలో ఆదాయం 80 శాతం పెరిగి రూ.12,434 కోట్లుగా ఉంటే, యాన్సిలరీ ఆదాయం (బ్యాగేజీ, ఫుడ్ తదితర) 37 శాతం వృద్ధితో రూ.1,445 కోట్లుగా ఉన్నట్టు ఇండిగో ప్రకటించింది. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి విదేశీ మారకం ప్రభావాన్ని మినహాయించి చూస్తే రూ.2,654 కోట్ల లాభం సమకూరింది. కానీ, విదేశీ మారకం ప్రభావాన్ని కలిపి చూస్తే రూ.306 కోట్ల నష్టం సమకూరింది. రూ.44,854 కోట్ల నికర రుణ భారం ఉన్నట్టు కంపెనీ ప్రకటించింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో షేరు రెండు శాతం నష్టపోయి రూ.2,264 వద్ద క్లోజయింది.

జోయాలుక్కాస్ జ్యువెలరీ ఫెస్టివల్‌కు విశేష స్పందన

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్- జోయాలుక్కాస్ జ్యువెలరీ ఫెస్టివల్‌కు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. సంస్థ ప్రకటించిన ఈ సంవత్సరపు అతిపెద్ద జ్యువెలరీ ఫెస్టివల్‌లో మే 12 నుంచి గోల్డ్, డైమండ్స్, ప్రెషస్ స్టోన్స్, వెండి జ్యువెలరీపై పలు ఆఫర్లు అమలవుతున్నాయి. జూన్ 11 వరకూ ఈ ప్రత్యేక 'ఆభరణాల పండుగ' నిర్వహణ జరుగుతుంది. మజూరీ చార్జీలపై 50 శాతం వరకూ తగ్గింపు, ప్రతి కొనుగోలుపై కస్టమర్‌కు ఉచిత జీవితకాల నిర్వహణ, సంవత్సరంపాటు ఉచిత బీమా, బైబ్యాక్ హామీ వంటి ఎన్నో ఆఫర్లు ఇందులో భాగంగా ఉన్నాయి.



ఎస్‌బీఐ లాభం జూమ్

- 83 శాతం వృద్ధితో రూ.16,695 కోట్లు
- షేరుకు రూ.11.30 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ మార్చి త్రైమాసికానికి మెరుగైన పనితీరు చూపించింది. ఎన్‌పీఏలకు కేటాయింపులు తగ్గడంతో విశ్లేషకుల అంచనాలకు మించి ఫలితాలను ప్రకటించింది. స్టాండలోన్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 83 శాతం వృద్ధితో రూ.16,695 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.9,113 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 29 శాతం పెరిగి రూ.40,393 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి నికర వడ్డీ ఆదాయం రూ.31,198 కోట్లుగా ఉండడం గమనార్హం. ఒక్కో షేరుకు రూ.11.30 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. మొండి రుణాలకు (ఎన్‌పీఏలు) కేటాయింపులు, కంటింజెన్సీలు 54 శాతం తగ్గి రూ.3,316 కోట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో కేటాయింపులు రూ.7,237 కోట్లుగా ఉన్నాయి. ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 2.78 శాతానికి తగ్గాయి. ఇవి క్రితం ఏడాది ఇదే త్రైమాసికం నాటికి 3.97 శాతంగా ఉంటే, 2022 డిసెంబర్ చివరికి 3.14 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు 0.67 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం ఏడాది మార్చి చివరికి ఇవి 1.08 శాతం, 2022 డిసెంబర్ చివరికి 0.77 శాతంగా ఉండడం గమనార్హం. దేశీయ వ్యాపారంపై నికర వడ్డీ మార్జిన్ 3.84 శాతానికి పుంజుకుంది.



- మార్చి త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ నికర లాభం (అనుబంధ సంస్థలతో కలిపి) క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.9,994 కోట్ల నుంచి రూ.18,343 కోట్లకు వృద్ధి చెందింది. 90 శాతానికి పైగా పెరిగింది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,08,034 కోట్ల నుంచి, రూ.1,36,852 కోట్లకు పెరిగింది.
- మార్చి త్రైమాసికానికి నిర్వహణ లాభం 25 శాతం వృద్ధితో రూ.24,621 కోట్లకు చేరుకుంది.
- ప్రొవిజన్ కవరేజ్ రేషియో 1.35 శాతం మెరుగుపడి 76.39 శాతంగా ఉంది.
- రుణాల్లో 16 శాతం వృద్ధి నమోదైంది. మార్చి చివరికి రూ.32.69 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ రుణాలు వార్షికంగా 12 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలు 18 శాతం పెరిగాయి.
- డిపాజిట్లు 9 శాతం వృద్ధితో రూ.44.23 లక్షల కోట్లకు చేరాయి.
- 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ స్టాండలోన్ నికర లాభం రూ.50,232 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2021-22)తో పోలిస్తే 58 శాతం పెరిగింది. స్టాండలోన్ ఆదాయం రూ.1,06,912 కోట్లుగా నమోదైంది.
- 2022-23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కన్సాలిడేటెడ్ లాభం రూ.35,374 కోట్ల నుంచి రూ.56,558 కోట్లకు చేరింది. ఆదాయం రూ.4,06,973 కోట్ల నుంచి రూ.4,73,378 కోట్లకు చేరింది.
- బీఎస్‌ఈలో ఎస్‌బీఐ షేరు 2 శాతానికి పైగా నష్టపోయి రూ.574 వద్ద క్లోజ్ అయింది. ఇంట్రాడేలో రూ.571.40 కనిష్ట స్థాయిని చూసింది.

చివరికి నష్టాల్లో..



మార్కెట్లు వరుసగా మూడో రోజు డౌన్

ముంబై: దిగ్గజ సంస్థలు ఐటీసీ, ఎస్‌బీఐ ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లను మెప్పించలేకపోవడం తదితర అంశాల కారణంగా దేశీ మార్కెట్లు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. గురువారం దాదాపు రోజంతా లాభాల్లోనే ట్రేడయినప్పటికీ ఆఖర్లో సెన్సెక్స్ 129 పాయింట్లు కోల్పోయి 61,432 వద్ద, నిఫ్టీ 52 పాయింట్ల నష్టంతో 18,130 వద్ద క్లోజయ్యాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 61,956-61,349 పాయింట్ల గరిష్ట, కనిష్ట స్థాయిలో తిరుగాడింది. అంతర్జాతీయంగా సానుకూల ధోరణులు నెలకొన్నప్పటికీ, ఆరంభ లాభాలను కోల్పోయి నిఫ్టీ వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ విభాగం హెడ్ దీపక్ జసానీ తెలిపారు. వారాంతపు ఎక్స్‌పైరీ రోజున మార్కెట్లు ఒడిదుడుకుల్లో ట్రేడయినట్లు, నిర్దిష్ట స్టాక్స్‌లో లాభాల స్వీకరణతో సూచీలు నష్టాల్లో ముగిసినట్లు రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో టైటాన్, పవర్ గ్రిడ్, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్ మొదలైనవి నష్టపోయాయి. ఐటీసీ 2%, ఎస్‌బీఐ 1.77% క్షీణించాయి. బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ మొదలైనవి లాభపడ్డాయి. మిడ్‌క్యాప్ సూచీ 0.67%, స్మాల్‌క్యాప్ 0.26% క్షీణించాయి. ఇతర సూచీల్లో రియల్టీ 2.29%, సర్వీసెస్ 1.60%, పవర్ 1.43% తగ్గాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకెక్స్ లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లు చూస్తే.. దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

25 పైసలు తగ్గిన రూపాయి..

విదేశీ మార్కెట్లలో డాలరు బలపడటం, దేశీ ఈక్విటీల్లో బలహీన ట్రెండ్‌తో దేశీ కరెన్సీ రూపాయి మారకం విలువ గురువారం 25 పైసలు క్షీణించింది. డాలరుతో పోలిస్తే 82.62 వద్ద క్లోజయ్యింది.

టైమెక్స్ చేతికి జస్ట్ వాచెస్

న్యూఢిల్లీ: గడియారాల తయారీలో ఉన్న యూఎస్ కంపెనీ టైమెక్స్ గ్రూప్ తాజాగా ప్రీమియం వాచ్ రిటైల్ బ్రాండ్ జస్ట్ వాచెస్‌ను కొనుగోలు చేసింది. డీల్ విలువను కంపెనీ వెల్లడించలేదు. ఈ డీల్ ద్వారా టైమెక్స్ ఇండియా చేతికి జస్ట్ వాచెస్ స్టోర్లు, ఈ-కామర్స్ పోర్టల్ అయిన జస్ట్‌వాచెస్.కామ్ వచ్చి చేరాయి. 'మా భవిష్యత్ వృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా ఈ కొనుగోలు ఉంటుంది. రెండు బ్రాండ్‌ల కలయిక మధ్య ఒక కచ్చితమైన సహకారం తెస్తుంది. వినియోగదారులకు విస్తృత స్థాయిలో వాచెస్‌ను ఎంపిక చేసుకునేందుకు వీలు కల్పిస్తుందని విశ్వసిస్తున్నాము' అని టైమెక్స్ గ్రూప్ తెలిపింది. జస్ట్ వాచెస్‌ను దక్కించుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా కస్టమర్ల సంఖ్యను పెంచుకోవడానికి సన్నద్ధం అయ్యామని టైమెక్స్ ఇండియా ఎండీ దీపక్ ఛబ్రా అన్నారు. టైమెక్స్ వరల్డ్ పేరుతో టైమెక్స్ ఇండియా దేశవ్యాప్తంగా 35 ఎక్స్‌క్లూజివ్ ఫ్రాంచైజీ స్టోర్లను నిర్వహిస్తోంది.



ఐటీసీ లాభం భళా

- మార్చి క్వార్టర్‌లో రూ.5,225 కోట్లు
- ఎఫ్‌ఎంసీజీలో బలమైన వృద్ధి
- ఒక్కో షేరుకు రూ.9.5 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ, హోటళ్లు, పేపర్ తదితర వ్యాపారాల్లోని ఐటీసీ లిమిటెడ్ మార్చి త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూసినప్పుడు 23 శాతం వృద్ధితో రూ.5,225 కోట్లుగా నమోదైంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 7 శాతం వృద్ధితో రూ.18,799 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.4,260 కోట్లు, ఆదాయం రూ.17,754 కోట్లు చొప్పున ఉంది. కంపెనీ వ్యయాలను సమర్థవంతంగా అదుపు చేసింది. కేవలం 2 శాతమే పెరిగి రూ.12,901 కోట్లుగా ఉన్నాయి. అన్ని విభాగాల్లోనూ బలమైన వృద్ధిని కొనసాగించినట్టు ఐటీసీ లిమిటెడ్ తెలిపింది. 2022-23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఐటీసీ కన్సాలిడేటెడ్‌గా రూ.19,428 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం (2021-22)లో లాభం రూ.15,486 కోట్లతో పోలిస్తే 25 శాతం వృద్ధి చెందింది. ఆదాయం క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 17 శాతానికి పైగా పెరిగి రూ.75,826 కోట్లకు చేరుకుంది. ఐటీసీ నిర్వహణ ఆదాయం రూ.75,000 కోట్లు దాటడం ఇదే మొదటిసారి.

విభాగాల వారీగా..

మార్చి త్రైమాసికంలో ఎఫ్‌ఎంసీజీ విభాగం (సిగరెట్లు సహా) ఆదాయం 15 శాతం పెరిగి రూ.13,033 కోట్లుగా ఉంది. ఇందులో సిగరెట్ల ఆదాయం వరకే చూస్తే 13 శాతం వృద్ధితో రూ.8,082 కోట్లుగా ఉంది. చట్టవిరుద్ధమైన మార్గాల్లో సిగరెట్ల సరఫరాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ తీసుకున్న చర్యలు ఫలితమిచ్చినట్టు ఐటీసీ తెలిపింది. సిగరెట్లు కాకుండా ఇతర ఎఫ్‌ఎంసీజీ ఆదాయం వరకే చూస్తే 19 శాతానికి పైగా పెరిగి రూ.4,951 కోట్లుగా ఉంది. పేపర్‌బోర్డ్స్, ప్యాకేజింగ్ ఆదాయం 2% పెరిగి రూ.2,221 కోట్లుగా ఉంది. షేరుకి తుది డివిడెండ్ కింద రూ.6.75, ప్రత్యేక డివిడెండ్ కింద రూ.2.75 (మొత్తం రూ.9.5) చొప్పున ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

భారత్‌లో రూ. 1.05 లక్షల కోట్ల పెట్టుబడులు

2030 నాటికి క్లౌడ్ ఇన్‌ఫ్రాపై అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రణాళికలు

న్యూఢిల్లీ: భారత్‌లో క్లౌడ్ సేవలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. 2030 నాటికి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై 12.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,05,600 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 2016-2022 మధ్య కాలంలో చేసిన 3.7 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 30,900 కోట్లు) కూడా కలిపితే దీర్ఘకాలంలో 2030 నాటికి తమ పెట్టుబడులు 16.4 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 1,36,500 కోట్లు) చేరినట్లవుతుందని ఏడబ్ల్యూఎస్ పేర్కొంది. డేటా సెంటర్ మౌలిక సదుపాయాలపై కొత్త ప్రతిపాదిత పెట్టుబడులతో భారతీయ వ్యాపార సంస్థల్లో ఏటా సగటున 1,31,700 పూర్తి స్థాయి కొలువులకు సరిసమానమైన ఉద్యోగాల కల్పన జరగగలదని వివరించింది. నిర్మాణం, ఫెసిలిటీ మెయింటెనెన్స్, ఇంజినీరింగ్, టెలికమ్యూనికేషన్స్ మొదలైన విభాగాల్లో ఇవి ఉండగలవని ఏడబ్ల్యూఎస్ పేర్కొంది.



రెండు డేటా సెంటర్లు..

ఏడబ్ల్యూఎస్‌కు భారత్‌లో రెండు డేటా సెంటర్ ఇన్‌ఫ్రా రీజియన్లు ఉన్నాయి. ఏడబ్ల్యూఎస్ ఏషియా పసిఫిక్ రీజియన్‌లను 2016లో ముంబైలో ఒకటి, 2022లో హైదరాబాద్‌లో మరొకటి ప్రారంభించింది. వ్యయాలు తగ్గించుకునేందుకు, నవకల్పనలను వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు, మార్కెట్‌ను సత్వరం అందిపుచ్చుకునేందుకు దేశీయంగా వేలకొద్దీ క్లయింట్లు తమ సేవలను ఉపయోగిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మొదలుకుని అశోక్ లేల్యాండ్, యాక్సిస్ బ్యాంక్ వంటి దిగ్గజాలు, ఇతరత్రా స్టార్టప్‌లు మొదలైనవెన్నో వీటిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

యువర్స్

● గేమింగ్

అదిగో...ఆ బంకర్‌లోనే!



ఈ నెలలో విడుదల అనుకున్న ఫస్ట్ పర్సన్ హారర్ గేమ్ 'అమ్నేసియా: ది బంకర్' జూన్ 6న విడుదల కానుంది. అమ్నేసియా సిరీస్‌లో భాగంగా వస్తున్న నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఈ గేమ్‌లో ప్లేయర్స్ ఫ్రెంచ్ సైనికుడు హెన్రీ క్లైమెంట్ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయాలి. సేఫ్ ప్లేస్ ఏమిటో తెలుసుకోవాలి. ఒక బంకర్ మిస్టరీని ఛేదించాలి.
జానర్స్: అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్
ఇంజిన్: హెచ్‌పీఎల్ ఇంజిన్, హెచ్‌పీఎల్ ఇంజిన్ 3.5 **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సీరీస్ ఎక్స్ అండ్ సీరీస్ ఎస్

అవును... ఇది నిజమే!



క్వీన్ విక్టోరియన్ శకం (బ్రిటన్)లో పువ్వుల భాష 'ఫ్లోరియోగ్రఫీ'గా ప్రసిద్ధి పొందింది. వ్యక్తులు తమ భావాలు, సెంటిమెంట్లను ఇతరులతో పంచుకోవడానికి రకరకాల పువ్వులను ఉపయోగించేవారు. ప్రతి పువ్వుకు సింబాలిక్ మీనింగ్ ఉండేది. ఉదా: రెడ్ రోజ్-స్వచ్ఛమైన ప్రేమ, ఎల్లో రోజ్-స్నేహం, పింక్ రోజ్-ఆరాధన, సన్‌ఫ్లవర్-నమ్మకం, విశ్వాసం. కలర్స్, అరేంజ్‌మెంట్స్ అనేవి 'రహస్య సందేశం'లో కీలకపాత్ర పోషించేవి. ఒక్కో పువ్వుకు మాత్రమే కాకుండా పువ్వుల సముదాయానికి కూడా ప్రత్యేక అర్థాలు ఉండేవి. ఆ కాలంలో ప్రేమవ్యక్తీకరణకు అంతగా స్వేచ్ఛ లేకపోవడంతో ఈ పువ్వుల భాషను ఉపయోగించేవారు.

అడవి రాసిన కవిత్వం

అమ్మ... తియ్యనైన పదం. అమ్మ భాష... మృదుమధురం. అడవిలో పుట్టిన సంస్కృతి... అడవి పురుడు పోసిన సాహిత్యం. నాగరకత దాడికి లోనవుతుంటే... అడవి బిడ్డ గుండె కన్నీరవుతోంది. అమ్మ భాష కోసం కలం పట్టాడు... అందమైన గ్రంథరూపమిస్తున్నాడు. కొలామ్ భాష కోసం ఆత్రం మోతీరామ్ చేస్తున్న సాహిత్య సేవ ఇది.

● మోతీరామ్ సాహితీయజ్ఞం

తెలంగాణ రాష్ట్రం, కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా(ఉమ్మడి ఆదిలాబాద్) వాంకిడి మండలంలోని నగర్‌గుట్టలో పుట్టాడు ఆత్రం మోతీరామ్. కొలామ్ తెగకు చెందిన మోతీరామ్ తమ భాషలో పుట్టిన అచ్చమైన స్వచ్ఛమైన పదాలు అంతరించిపోతున్నాయని తెలుసుకుని ఆవేదన చెందాడు. గ్రంథస్థం చేయడమే పరిష్కారం అని భావించి మౌఖికంగా ఉన్న అడవి పదాలు, పాటలను అక్షరబద్ధం చేస్తున్నాడు. తన అనుభవాలు, అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నాడీ యువకుడు.


ఆత్రం మోతీరామ్

అడవి నేర్పిన అక్షరాలు

''మా ఊరి పాఠశాలలో రెండోతరగతి చదివాను. ఆ తరవాత చొపన్‌గూడ శాటిలైట్ సెంటర్ ఆశ్రమ పాఠశాలలో చేర్చేటప్పుడు మళ్లీ ఒకటో తరగతిలో చేర్చాడు మా నాన్న. నాలుగవ తరగతి తర్వాత ఆసిఫాబాద్ పీటీజీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాను. ఉట్నూరు గవర్నమెంట్ కాలేజీలో బీఎస్సీ, ఐటీడీఏ శిక్షణ కళాశాలలో బీఈడీ చేశాను. ఇప్పుడు కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య విధానంలో ఎం.ఏ తెలుగు చేస్తున్నాను.


మోతీరామ్ రచనలు

బొమ్మల సాహిత్యం

నా సాహిత్య ప్రస్థానం గురించి చెప్పాలంటే... అది చిత్రలేఖనంతో మొదలైంది. మా నాన్న వ్యవసాయంతోపాటు వడ్రంగం కూడా చేసేవాడు. తలుపుల మీద నెమలి, పూలు, చెట్లు, పండ్లు... ఇలా రకరకాలు చిత్రించేవాడు. వాటిని పరిశీలనగా చూసి నేనూ బొమ్మలు వేసేవాడిని. గురుకుల పాఠశాలలో చిత్రలేఖనం పోటీల్లో కూడా పాల్గొన్నాను. ఎనిమిదవ తరగతికి వచ్చినప్పటి నుంచి నేను వేసిన బొమ్మలకు చిన్న వ్యాఖ్యానం రాయడం మొదలుపెట్టాను. నాకు పెద్ద పెద్ద విషయాలు తెలిసి కాదు, నా మనసుకు అనిపించిన విషయాన్ని అచ్చంగా అలాగే రాసేవాడిని. మా సత్యనారాయణ సార్ నేను రాసిన వ్యాఖ్యానంలో అక్షరదోషాలు, వ్యాకరణ దోషాలను దిద్దేవారు. నేను వ్యక్తం చేసిన భావాలనే వాక్యాలుగా రాస్తే అదే కవిత్వం అవుతుందని, కవిత్వం రాయడంలో మెళకువలు నేర్పించారు.

తొలి పుస్తకం కుమ్రుం సూరు

కవిత్వం రాయడంలో ఒడుపు తెలిసిన తర్వాత ఇక నేను వెనుదిరిగి చూడలేదు. నా తొలి పుస్తకం కుమ్రుం సూరు జీవిత చరిత్ర. ఆత్రం భీమ్‌రావు అనే మా కొలామ్ నాయకుడు సూరు జీవితాన్ని మౌఖికంగా చెప్పడంతో నేను అక్షరబద్ధం చేశాను. ఆ తర్వాత దండారి కైతికాలు అని దండారి నృత్యం గురించి రాశాను. మా కొలామ్‌ల ఆరాధ్యదైవం దంతన్‌పల్లి భీమయ్యక్ మహాత్మ్యం రాసిన తర్వాత మా నాన్న కోసం మోతీరామ్ శతకం రాశాను. మానవుడు ఎలాంటి వాడు అనేది కథాంశం. ఇవన్నీ తెలుగు లిపిలోనే రాశాను. ఎందుకంటే మా కొలామ్ భాషకు లిపి లేదు. కవిత్వం కూడా కొలామ్ భాషలోనే తెలుగు లిపితో రాశాను. కొన్ని కవితలు తెలుగులోనూ రాశాను.

అముద్రితం

ఉట్నూరుకు వచ్చిన తర్వాత నా అక్షరాల ఆకలి తీరిందని చెప్పాలి. అక్కడ 'ఉట్నూరు సాహితీ వేదిక'లో ప్రతి నెలా తొలి ఆదివారం కవి సమ్మేళనం జరిగేది. ప్రతి కవి సమ్మేళనంలోనూ నా కవిత ఉండాలని నిర్వాహకులు నన్ను బాగా ప్రోత్సహించారు. అలాగే రాశాను. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిలో ఉంది. ఉద్యమం కోసం ఒక పుస్తకం రాశాను. అది ప్రచురణకు నోచుకునే లోపు తెలంగాణ రావడంతో అది చేతిరాత ప్రతిగానే ఉండిపోయింది.

ఆకాశవాణిలో కొలామీ కవిత్వం

కొలామీ భాషలో రాసిన కవిత్వం ఆకాశవాణిలో ప్రసారమైంది. అలాగే 2021లో విజయవాడలో జరిగిన గిరిజన సాహిత్య సదస్సులో పాల్గొని మా భాషలో కవిత చదివాను. ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ రవీంద్రభారతిలో 'దక్షిణ భారత కవుల కలయిక'లోనూ అవకాశం వచ్చింది. కొలామీలో కవిత, దానికి తెలుగు అనువాదం కూడా చేశాను. ఒడిశా రాష్ట్రం, భువనేశ్వర్‌లో జరిగిన 'అఖిల భారత గోండ్వానా సాహిత్య సభలు'కు ఆహ్వానం వచ్చింది. కానీ పరీక్షల కారణంగా వెళ్లలేకపోయాను. ఈ సాహిత్య ప్రస్థానంలో నా ఆకాంక్ష ఒక్కటే... మా కొలామీ భాషను అంతరించి పోనివ్వకుండా కాపాడుకోవడం. ఇప్పటికే చాలా నష్టం జరిగింది. ఈ తరం చిన్న పిల్లలు చాలా పదాలను మర్చిపోయారు. తల, దేహం, ఉడుత, చిలుక వంటి పదాలను తెలుగులో చెప్తున్నారు తప్ప కొలామీలో చెప్పడం మర్చిపోయారు. అందుకే అలాంటివి కనుమరుగు కాకుండా అక్షరాల్లో, ఆడియోల్లోనూ రికార్డ్ చేయాలనేదే నా ఆకాంక్ష.

మౌఖిక సాహిత్యం అక్షరాల్లోకి...

మా కొలామీ భాష మధ్య ద్రావిడ భాష. దీనికి లిపి లేదు. కానీ విస్తృతమైన సాహిత్యం ఉంది. బాల సాహిత్యం, పొడుపు కథలు, భీమయ్యక్ పాటలు, దేవుడి పాటలు, పెళ్లి, ఇతర వేడుకల పాటలన్నీ మౌఖికంగా ఒక తరం నుంచి మరొక తరానికి ప్రసారం అవుతున్నాయి. ఇప్పుడు వస్తున్న మార్పులతో ఈ తరం పిల్లలు మా పాటలను మర్చిపోతే ఇక ఈ తరంలోనే మా సాహిత్యం కూడా అంతర్ధానమైపోతుంది. అందుకే ఈ పని మొదలుపెట్టాను. ప్రతి పదాన్ని పొల్లుపోకుండా గ్రంథస్థం చేస్తాను.
- ఆత్రం మోతీరామ్

– వాకా మంజులారెడ్డి,
ఫొటోలు: ఆత్రం జగదీశ్, సాక్షి, ఇంద్రవెల్లి

● టెక్... టాక్

రియల్ మీ నార్జో ఎన్53



డిస్‌ప్లే: 6.72 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 8-మెగా పిక్సెల్
ర్యామ్: 4జీబి 6జీబి **స్టోరేజ్:** 64 జీబి 128జీబి **బ్యాటరీ:** 5000 ఎంఏహెచ్ **ఓఎస్:** ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 2400×1080 పిక్సెల్స్ **రిఫ్రెష్ రేట్:** 90 హెచ్‌జడ్ **కలర్స్:** బ్లాక్ అండ్ గోల్డ్

గూగుల్ 'ఎబౌట్ దిజ్ ఇమేజ్' టూల్



గూగుల్ 'ఎబౌట్ దిజ్ ఇమేజ్' అనే టూల్‌ని తీసుకు రానుంది. దీని ద్వారా ఒక ఇమేజ్ లేదా సిమిలర్ ఇమేజ్ గూగుల్‌లో మొదటిసారిగా ఎప్పుడు కనిపించిందో తెలుసుకోవచ్చు. ఇమేజ్ తాలూకు కంటెంట్, కాంటెక్స్‌లను బాగా అర్థం చేసుకోవచ్చు. బ్యాక్‌గ్రౌండ్ ఇన్‌ఫర్మేషన్ మరింతగా తెలుసుకోవచ్చు. ఒక ఇమేజ్‌కు సంబంధించిన విశ్వసనీయత (సహజమైన ఇమేజా? ఏఐ ఇమేజా?)పై స్పష్టత వస్తుంది.

ఫెయిర్‌బడ్స్ ఎక్స్‌ఎల్ హెడ్‌ఫోన్స్



ఫెయిర్‌ఫోన్ 'ఫెయిర్‌బడ్స్ ఎక్స్‌ఎల్' పేరుతో హెడ్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఇది మాడ్యూలర్ మరియు రిపేర్ ఫ్రెండ్లీ హెడ్‌ఫోన్. ఇయర్ కుషన్‌ను సులభంగా రీప్లేస్ చేసుకోవచ్చు. **బ్యాటరీ:** 800 ఎంఏహెచ్ (ఈజీ-టు-రీప్లేస్ బ్యాటరీ) ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 40ఎంఎం డ్రైవర్స్ ● **బ్లూటూత్:** 5.1

గెలాక్సీ వాచ్ 5 ప్రో



ట్రెక్కింగ్, మౌంటెన్ క్లైంబింగ్‌లాంటి ఔట్‌డోర్ యాక్టివిటీలకు సౌకర్యంగా ఉండేలా శాంసంగ్ గెలాక్సీ వాచ్‌ను డిజైన్ చేశారు.
డిస్‌ప్లే: 1.4 అంగుళాలు **కలర్స్:** బ్లాక్ అండ్ గ్రే
● కోర్నింగ్ గోరిల్లా గ్లాస్ ● బ్లూటూత్ కాలింగ్
ఫీచర్: చెకింగ్ నోటిఫికేషన్స్, సెట్టింగ్ టైమర్స్...మొదలైనవి. ● డ్యూయల్-కోర్ ప్రాసెసర్
● 1.5జీబి ర్యామ్ ప్లస్ 16జీబి ఇంటర్నల్ స్టోరేజ్ **ధర:**
● ₹44,999 (రెగ్యులర్ బ్లూటూత్ మోడల్) ● ₹49,999 (ఎల్‌టీఈ వేరియంట్)

కెనాన్ పవర్ షాట్



కెనాన్ 'పవర్ షాట్ వీ10' పేరుతో కొత్త వ్లోగింగ్ కెమెరాను లాంచ్ చేసింది. తేలికగా ఉండే ఈ కెమెరాను సులభంగా పాకెట్‌లో పెట్టుకోవచ్చు. క్రౌడ్ ప్లేసెస్‌లో కంఫర్టబుల్‌గా రికార్డ్ చేయడానికి వ్లాగర్స్‌కు ఉపయోగపడుతుంది. సింగిల్ హ్యాండ్‌తో దీన్ని ఆపరేట్ చేయవచ్చు. ● 2.0 అంగుళాల ఎల్‌సీడీ టచ్‌స్క్రీన్
● హెచ్‌డీఎంఐ, యుఎస్బీ పోర్ట్ ● **ధర:** ₹39,995

ఆర్ట్ అండ్ కల్చర్

ముందైతే నీళ్లు తాగు నాయనా!



టర్కీ కార్టూనిస్ట్ మూస గుమ్‌స్ గీసిన ఈ కార్టూన్ చూసి చిన్న కథ చెప్పమంటే ఇలా చెప్పవచ్చు... దారిన పోయే దానయ్య దారి తప్పాడు. ఎటెటో వెళుతున్నాడు. ఎండకు విపరీతమైన దాహం వేస్తోంది. నిర్జన ప్రాంతంలో చుక్క నీరు కనిపించడం లేదు. దాహంతో కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. అప్పుడే ఏదో మెరుపు మెరిసింది. చూస్తే....అల్లావుద్దీన్ అద్భుత దీపం!

దాన్ని టచ్ చేయగానే 'ఏం కావాలో కోరుకో నాయనా. ఒకటే ఛాన్సు అని గుర్తుంచుకో' అన్నది జీన్నీ భూతం.'లెక్క లేనన్ని వజ్రవైఢూర్యాలు కావాలి. వాటిని తీసుకెళ్లడానికి గుర్రపుబండ్లు కావాలి' అని అడిగాడు. అతడు కోరుకున్నవి వచ్చాయి. వజ్రవైఢూర్యాలను తీసుకువెళుతున్నప్పుడు దానయ్యలో దాహం పెరిగిపోయింది. 'ఈ దాహంతో చనిపోయేలా ఉన్నాను. చచ్చిన తరువాత ఈ వజ్రవైఢూర్యాలను ఏం చేసుకుంటాను. జీన్నీని గుక్కెడు నీళ్లు అడిగే ఉంటే బతికి ఉండేవాడిని కదా' అనుకుంటున్న సమయంలో జీన్నీ ప్రత్యక్షమై 'ముందైతే నీళ్లు తాగు నాయనా!' అని దయతలిచింది. 'విచక్షణ' అనేదాని గురించి వివరించి చెప్పింది. ఇక మూస గుమ్‌స్ విషయానికి వస్తే... బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్ చదువుకున్న మూస ఎన్నో పత్రికలలో పనిచేశాడు. పిల్లల పుస్తకాలకు బొమ్మలు వేశాడు. 'ఫన్నీ న్యూస్' అనే రేడియో ప్రోగ్రాం కోసం కలం పట్టాడు.

రేపు ఏపీ లాసెట్ ప్రవేశ పరీక్ష

- రాష్ట్ర వ్యాప్తంగా 84 ఆన్‌లైన్ కేంద్రాల్లో పరీక్షలు

ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయ శాస్త్ర కళాశాలల్లో 2023 విద్యా సంవత్సరంలో లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తోన్న ఏపీ లాసెట్ ఈ నెల 20న జరుగుతుందని సెట్ కన్వీనర్, ఏఎన్‌యూ అధ్యాపకుడు ఆచార్య బి.సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది సెట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఏఎన్‌యూలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 20న మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 నగరాల్లో 84 ఆన్‌లైన్ కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఫలితాలు జూన్ 15న ప్రకటించి ర్యాంకులు 16న విడుదల చేస్తామన్నారు. మొదటి విడత అడ్మిషన్లు ఆగస్టు 16–24 వరకు, రెండో విడత అడ్మిషన్లు అక్టోబర్ 1–7 వరకు, స్పాట్ అడ్మిషన్లు, కేటగిరీ–బి అడ్మిషన్లు అక్టోబర్ 15–22 వరకు జరుగుతాయన్నారు. తరగతులు అక్టోబర్ 11 నుంచి మొదలవుతాయని తెలిపారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సెట్ కో కన్వీనర్ ఆచార్య నాగరాజు, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘రేపు ఏపీఆర్‌జేసీ డీసీ సెట్, ఏపీఆర్ఎస్ క్యాట్’

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 20న నిర్వహించనున్న ఏపీఆర్‌జేసీ డీసీ సెట్–2023కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు చెప్పారు. గుంటూరు కొరిటెపాడులోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. డీసీ సెట్‌కు 295 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతితోపాటు 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు మొదటి సారిగా నిర్వహిస్తున్న ఏపీఆర్ఎస్ క్యాట్–2023కు రాష్ట్ర వ్యాప్తంగా 165 కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

మిలాన్.. మెరుపులు

- వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మిలాన్–2024 నిర్వహణకు ఏర్పాట్లు
- మరో అంతర్జాతీయ విన్యాసాలకు వేదికగా విశాఖ
- చరిత్రలో అతిపెద్ద మిలాన్‌గా రికార్డు తిరగరాయనున్న తూర్పు నౌకాదళం
- 50 దేశాలకు ఆహ్వానం పంపాలని నిర్ణయం



సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ విన్యాసాలకు మరోసారి వేదికగా నిలిచేందుకు విశాఖ సన్నద్ధమవుతోంది. 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూతో పాటు మిలాన్‌ను సైతం వరుసగా నిర్వహించి సత్తా చాటిన తూర్పు నౌకాదళం.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మరోసారి మిలాన్ విన్యాసాలకు ఆహ్వానం పలుకుతోంది. నౌకాదళ విభాగంలో కీలకమైన మిలాన్ కోసం భారీ ఏర్పాట్లు చేసేందుకు ఇండియన్ నేవీ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి గత రికార్డును తిరగరాసేలా.. భారత నౌకాదళం 50 దేశాలతో భారీ స్థాయిలో విన్యాసాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది.

సాహో.. విశాఖ!

2016లో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూను ఘనంగా నిర్వహించగా.. ‘సాహో విశాఖ’ అని ప్రపంచ దేశాలు కీర్తించాయి. 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూతో సత్తా చాటింది. నెల రోజుల వ్యవధిలోనే నౌకాదళ విన్యాసాల్లో కీలకమైన మిలాన్–2022ను నిర్వహించి.. ప్రపంచ దేశాలకు భారత రక్షణదళ సత్తాను చాటింది. ఇప్పుడు మరోసారి మిలాన్‌కు విశాఖ ఆతిథ్యమిచ్చేందుకు ముస్తాబవుతోంది. మిలాన్–2024 పేరుతో ఈ విన్యాసాల్ని ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రధాన స్థావరంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్నారు. 2018 అండమాన్ నికోబార్ దీవుల్లో జరిగిన విన్యాసాల్లో 17 దేశాలు పాల్గొనగా.. 2022లో విశాఖలో నిర్వహించిన మిలాన్‌లో 39 దేశాల నౌకాదళాలు పాల్గొని విన్యాసాలు నిర్వహించాయి. ఇదే అతిపెద్ద మిలాన్‌గా రికార్డు సృష్టించింది.

అతిపెద్ద మిలాన్‌గా రికార్డుకు అవకాశం

మిలాన్–2024ను 2022 నాటికంటే భారీగా నిర్వహించేలా తూర్పు నౌకాదళం సమాయత్తమవుతోంది. ఇప్పటికే భారత నౌకాదళం ఏయే దేశాలకు ఆహ్వానాలు పంపించాలనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. దక్షిణాసియా, ఆగ్నేయాసియా, ఆఫ్రికా, యూరప్ దేశాలకు ఆహ్వానాలు పంపించారు. భారత్‌తో పాటు యూఎస్‌ఏ, రష్యా, జపాన్, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, ఫ్రాన్స్, ఈజిప్ట్, శ్రీలంక, వియత్నాం, మొజాంబిక్, సూడాన్, ఇజ్రాయెల్, ఖతర్, థాయ్‌లాండ్, మలేషియా, సోమాలియా, కెన్యా, మయన్మార్, న్యూజిలాండ్, టాంజానియా, కొమరోస్, మాల్దీవులు, బ్రూనే, ఫిలిప్పీన్స్, సౌదీ అరేబియా, ఒమన్, కాంబోడియా, దక్షిణ కొరియా, కువైట్, ఇరాన్, మడగాస్కర్, బంగ్లాదేశ్, బహ్రెయిన్, యూఏఈ, జిబౌటీ, ఎరిత్రియా, మారిషస్, సీషెల్స్ మొదలైన 50 దేశాలకు ఆహ్వానం పంపించనుంది. మొత్తం అన్ని దేశాలు హాజరైతే అతి పెద్ద మిలాన్‌కు వేదికగా విశాఖ రికార్డు సృష్టించనుంది. ఇప్పటికే స్థానిక అధికారులతో తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా సమావేశమై.. ఏర్పాట్లు, భద్రతా అంశాలపై ప్రాథమికంగా చర్చించారు. మిలాన్–2024ను సీ ఫేజ్, హార్బర్ ఫేజ్‌లలో విన్యాసాలు నిర్వహించనున్నారు.

చురుగ్గా ‘ఆపరేషన్ కరుణ’

సింధియా (విశాఖ పశ్చిమ): అంతర్జాతీయ విపత్తు ప్రతిస్పందన కార్యకలాపాల్లో భాగంగా ఆపరేషన్ కరుణ పేరుతో నౌకాదళ సేవలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ మేరకు భారతీయ నౌకాదళ నౌకలు శివాలిక్, కమోర్తా, సావిత్రి సహాయ సామగ్రితో మయన్మార్‌లోని యాంగోన్‌కు చేరుకున్నాయి. భారతీయ నావికాదళం వృద్ధిని, భద్రతను నిర్ధారించడంతో మొదటి నౌకాదళ నౌకలుగా ఇవి పేరుగాంచాయి. విపత్తుల సమయంలో పొరుగువారికి సహాయాన్ని అందించడమే లక్ష్యంగా ఇవి పనిచేస్తున్నాయి.



సామగ్రితో మయన్మార్ చేరుకున్న భారతీయ నౌకాదళ నౌక శివాలిక్

డాలర్లు కురిపిస్తున్న జుట్టు

మానవ జుట్టుతో ఏటా రూ.50 వేల కోట్లు

- జుట్టు ఎగుమతుల్లో ప్రపంచంలో రెండో స్థానంలో భారత్
- విగ్గులు, బ్యూటీ నీడ్స్‌తో పాటు మందులు, ఎరువులు, సంగీత పరికరాల్లో వాడకం
- కోవిడ్ తర్వాత రెట్టింపైన ముడి వెంట్రుకల ఎగుమతులు
- జుట్టునూ స్మగ్లింగ్ చేస్తున్నారు



వెంట్రుకలను చాలా తేలిగ్గా తీసిపారేస్తాం. రాలిపోయిన జుట్టు మనకు వ్యర్థాలతో సమానం. కానీ.. దేశ, విదేశాల్లో దీనికి ఎంత డిమాండ్ ఉందో తెలుసా. దీని వెనుక ఓ వ్యాపార సామ్రాజ్యం.. పక్కనే మరో స్మగ్లింగ్ సామ్రాజ్యం సైతం ఉన్నాయంటే ఆశ్చర్యపోవాల్సిందే.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

దేశంలో ఏటా రూ.50 వేల కోట్లకు పైగా విలువైన మానవ వెంట్రుకల వ్యాపారం నడుస్తోంది. ప్రపంచంలో వెంట్రుకల ఎగుమతుల్లో హాంకాంగ్ మొదటి స్థానంలో ఉండగా.. భారత్‌ది రెండోస్థానం. విగ్గులు, దుస్తులతో పాటు మందులు, ఎరువులు, బొమ్మలు, బ్యూటీ తదితర రంగాల్లో మానవ జుట్టును వినియోగిస్తారు. ఈ కారణంగానే వెంట్రుకలకు ప్రపంచ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంది. భారత్‌లోని మానవ వెంట్రుకలు అత్యంత నాణ్యంగా ఉంటాయి. ప్రపంచంలోని మరే దేశంలో ఇంత నాణ్యమైన వెంట్రుకలు లేవు. ఇవి మంచి ఆకృతితో పాటు నల్లని రంగుతో ఉంటాయి. యూరోపియన్ దేశాలు, అమెరికా, కెనడా దేశాలు ఇండియన్ హెయిర్‌ను కొనుగోలు చేసేందుకు పోటీ పడతాయి.



కోవిడ్ తరువాత రెట్టింపు ఎగుమతులు

ఇండియా నుంచి రంగూన్‌కు ఎక్కువగా వెంట్రుకలు ఎగుమతి అవుతాయి. అక్కడ ప్రాసెసింగ్ చేసి విదేశాలకు తరలిస్తారు. రంగూన్‌లో విగ్గులు, హెయిర్ ఆధారిత ఉత్పత్తులు కూడా తయారు చేస్తారు. భారత్‌లో 2017 నుంచి ఏటా 260 నుంచి 300 మిలియన్ డాలర్ల విలువైన వెంట్రుకలు ఎగుమతి అయ్యేవి. కోవిడ్ కాలంలో 2020లో 263.83 మిలియన్ డాలర్లు, 2021లో 383.61 మిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరిగాయి. కోవిడ్ తర్వాత ఊహించిన విధంగా 2022లో ఏకంగా 770.26 మిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. ఈ డిమాండ్ నేపథ్యంలో కొందరు స్మగ్లింగ్ కూడా అలవాటుపడ్డారు. ఇండియాలో అరుణాచల్‌ప్రదేశ్, మయన్మార్‌లకు జుట్టును అక్రమ రవాణా చేసి అక్కడి నుంచి చైనాకు తరలిస్తున్నారు. చైనా దీన్ని ప్రపంచమార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటోంది. ఈ అక్రమ రవాణాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనిఖీలు నిర్వహించింది. దీంతో డీజీఎఫ్ఐ(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్) కట్టుదిట్టమైన నిబంధనలను తీసుకొచ్చింది.

తలనీలాలు సమర్పించడం అధికం!

ప్రపంచంలో భక్తిమార్గంలో ఉండే పెద్ద దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), వారణాసి, హరిద్వార్, అలహాబాద్‌తో పాటు దేశంలోని వందలాది ప్రముఖ క్షేత్రాలకు, వేల సంఖ్యలోని ఇతర పుణ్యక్షేత్రాలకు భక్తులు వెళుతుంటారు. ఆలయాలకు వెళ్లేవారిలో 37నుంచి 50 శాతం మంది మొక్కుల కారణంగా తలనీలాలు సమర్పిస్తారు. దీంతో ఇండియాలో జుట్టు లభ్యత కూడా ఎక్కువే. దేశంలో ఏటా 2,500 టన్నుల వెంట్రుకలను ఎగుమతి చేస్తారు. ఇందులో మహిళల వెంట్రుకలు ఒక టన్ను వరకు ఉంటాయి.

వైద్యరంగంలోనూ..

ఔషధ, వైద్య రంగంలో జుట్టు ఉపయోగం ప్రత్యేకమైంది. మానవ వెంట్రుకలో దాదాపు 20 అమినో ఆమ్లాలు ఉంటాయి. ఎల్–వాలిన్, ఎల్–ల్యూసిన్, ఎల్–సిస్టీన్, ఎల్–ఐసోల్యూసిన్ మానవ జుట్టు నుంచి ఉత్పత్తి అవుతాయి. ఇవి ఔషధాల తయారీకి ఉపయోగపడతాయి. ఆసియాలోని వెంట్రుకలు ఇతర దేశాల్లోని వెంట్రుకల కంటే ఎల్–సిస్టీన్ ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇందుకు ఇక్కడి జుట్టు ఎక్కువ నల్లగా ఉండటమే కారణం. ఎల్–సిస్టీన్ ఆమ్లాన్ని ఆహార పరిశ్రమలోనూ వినియోగిస్తారు. జుట్టులో నత్రజని కూడా ఉంటుంది. ఇది మొక్కలకు అద్భుత ఎరువుగా పనిచేస్తుంది. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో నేల నాణ్యత మెరుగుపరచడానికి, మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించడానికి జుట్టును సహజ ఎరువుగా ఉపయోగిస్తారు. బొమ్మలు, నగలు, అలంకరణ వంటి హస్తకళల్లోనూ కొన్ని డిజైన్లలో కళాకారులు జుట్టును వినియోగిస్తారు. వయొలిన్, గిటార్ లాంటి సంగీత వాయిద్యాల తీగలను జుట్టుతో రూపొందిస్తారు.

విగ్గులు, కనురెప్పల తయారీ

వెంట్రుకలను శుభ్రం చేసి విగ్గులు, కృత్రిమ గడ్డాలు, మీసాల తయారీకి ఉపయోగిస్తారు. తూర్పు దేశాల్లో వీటి వాడకం ఎక్కువ. సినిమా ఇండస్ట్రీ, మోడలింగ్‌తో పాటు ముఖ సౌందర్యాన్ని మెరుగుపరిచేందుకు కనురెప్పలను కూడా జుట్టుతో తయారు చేస్తారు. కాస్మోటిక్ మేకప్ బ్రష్‌లు కూడా వీటితో తయారు చేస్తారు. వెంట్రుకలు సిల్కీగా, సాగే గుణంతో మెత్తగా ఉంటాయి. థర్మల్ ఇన్సులేషన్ గుణాలు ఉంటాయి. అందుకే విలువైన బొమ్మల తయారీ, హెయిర్‌పిన్ కుషన్, గృహోపకరణాలలో వినియోగిస్తారు. చాలా దేశాల్లో పరుపులు, జాకెట్ల తయారీలోనూ వాడతారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో బట్టల తయారీలో కలుపుతారు. పానిపట్‌లో దుప్పట్ల తయారీలో జంతువుల జుట్టుతో మిళితం చేస్తారు.

తలనీలాల ద్వారా భారీ ఆదాయం


శ్రీశైలంలో టికెట్లు, హుండీ తర్వాత అత్యధిక ఆదాయం తలనీలాల ద్వారా వస్తుంది. ఏటా టెండర్లు నిర్వహిస్తాం. 2021లో రూ.7.30 కోట్ల ఆదాయం వచ్చింది. భక్తుల సంఖ్య, తలనీలాలు ఇవ్వడం పెరిగింది. ఈ దఫా టెండర్ల ద్వారా భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

– ఎస్.లవన్న, ఈవో, శ్రీశైలం

నాలుగేళ్లలో ఎంఎస్ఎంఈల రైజింగ్ లక్ష్యంగా ముందడుగు

వరల్డ్ బ్యాంక్ సహకారంతో రాష్ట్రంలో ర్యాంప్ ప్రోగ్రాం

- 2026–27 వరకు అమల్లో ర్యాంప్ ప్రోగ్రాం
- త్వరలో కేంద్రానికి స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రాం
- దీనిని పరిశీలించి నిధులివ్వనున్న కేంద్రం
- అత్యధిక నిధులు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక
- ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈల సమస్యల గుర్తింపు
- నెలాఖరులోగా అన్ని జిల్లాల ఎంఎస్ఎంఈలతో సమావేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలకు) పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. కరోనా సంక్షోభ సమయంలోనూ వాటికి చేయూతనిచ్చి, తిరిగి జీవం పోసుకొనేలా చేసింది రాష్ట్ర ప్రభుత్వం. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు, వాటి వ్యాపారాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం వరల్డ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్ ప్రోగ్రాం)ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఎంఎస్ఎంఈలకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అదుబాటులోకి తేవడం, మార్కెటింగ్, రుణ సదుపాయం, ఎగుమతుల అవకాశాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చెల్లింపుల్లో జాప్యం నివారించడం, ఎంఎస్ఎంఈల్లో స్త్రీల భాగస్వామ్యం పెంచడం వంటివి ఈ ర్యాంప్ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశం. కోవిడ్ వల్ల దెబ్బతిన్న ఎంఎస్ఎంఈ రంగాన్ని ఆదుకునే ఉద్దేశంతో 2022–23 నుంచి 2026–27 కాలానికి రూ.6,062.45 కోట్లతో ర్యాంప్ ప్రోగ్రాంని కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టింది. ఇందులో రూ. 3,750 కోట్లు ప్రపంచ బ్యాంకు రుణంగా ఇస్తుంది. మిగిలిన రూ.2,312.45 కోట్లు కేంద్రం సమకూరుస్తుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఒక స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ పోగ్రాంను (సిప్) రూపొందించాలి. దీనిని కేంద్రం పరిశీలించి ఆమోదం తెలిపిన తర్వాత నిధులు మంజూరు చేస్తుంది. ఇందులో అత్యధిక నిధులను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందుకోసం రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి చైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో స్టేట్ ర్యాంప్ ప్రోగ్రాం కమిటీని ఏర్పాటు చేసింది. ర్యాంప్ నోడల్ ఏజెన్సీగా ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నోడల్ అధికారిగా పరిశ్రమల శాఖ కమిషనర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

సమస్యల పరిష్కారానికి ప్రాంతీయ సదస్సులు

రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల సమస్యలను తెలుసుకొని వాటికి చక్కటి పరిష్కార మార్గాలను సూచిస్తూ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రాంను జూన్ 15లోగా కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం పంపించాల్సి ఉంది. ఇందు కోసం రాష్ట్ర పరిశ్రమల శాఖ రాష్ట్రవ్యాప్తంగా వర్క్‌షాపులు నిర్వహిస్తోంది. ర్యాంప్ కార్యక్రమంపై అధికారులకు అవగాహన కల్పించడం కోసం తాజాగా పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌లో ఏటా అత్యధిక మొత్తం పొందేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల సమస్యలను తెలుసుకోవడానికి ఈ నెలాఖరులోగా 5 పట్టణాల్లో వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ పట్టణానికి దగ్గరగా ఉండే జిల్లాలకు చెందిన ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, అసోసియేషన్లు సమావేశంలో పాల్గొని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటికి పరిష్కార మార్గాలను సూచిస్తూ సిప్‌ను రూపొందిస్తామన్నారు.

ప్రాంతీయ వర్క్‌షాప్ షెడ్యూల్

తేదీ	పట్టణం	పాల్గొనే జిల్లాలు
19-05-23	విశాఖపట్నం	విశాఖ, ఏఎస్ఆర్, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, కాకినాడ, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి
23-05-23	గుంటూరు	గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం,
25-05-23	తిరుపతి	తిరుపతి, చిత్తూరు, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, అన్నమయ్య, వైఎస్ఆర్
27-05-23	కర్నూలు	కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి
30-05-23	విజయవాడ	కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి

తెలంగాణ

తెలంగాణలో 111 జీవో ఎత్తివేత

- జీవో పరిధిలోని 84 గ్రామాల్లో ఆంక్షలన్నీ తొలగింపు
- ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు
- తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: ఒకప్పుడు హైదరాబాద్ నగర దాహార్తిని తీర్చిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల పరిరక్షణ కోసం వాటి ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్టీఎల్) నుంచి 10 కిలో మీటర్ల పరిధి వరకు అన్ని రకాల నిర్మాణాలను నిషేధిస్తూ గతంలో జారీ చేసిన 111 జీవోను పూర్తిగా ఎత్తివేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 111 జీవో పరిధిలోని 84 గ్రామాల్లో ఎలాంటి ఆంక్షలు ఉండవని ప్రకటించింది. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. నూతన సచివాలయంలో ఇదే తొలి మంత్రివర్గ సమావేశ. సమావేశం వివరాలను రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు కలుషితం కాకుండా చుట్టూ రింగ్ మెయిన్‌తో పాటు ఎస్టీపీల నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని మంత్రివర్గం ఆదేశించిందన్నారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి కాళేశ్వరం (గోదావరి) జలాలతో మూసీ, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను అనుసంధానించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం 10వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను 21 రోజులపాటు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. అకాల వర్షాలు కారణంగా ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో.. రాష్ట్రంలో పంట కాలాన్ని నెల రోజులు ముందుకు జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు.

అవసరమైతే ఆత్మాహుతి దాడులకూ ప్లాన్!

- హైదరాబాద్–భోపాల్ మాడ్యుల్స్‌ను రెచ్చగొట్టిన గుర్తు తెలియని వ్యక్తి
- సలీమ్, యాసిర్ ఫోన్ల నుంచి సదరు ప్రసంగాల ఆడియోలు రికవరీ
- వాటిలో ఫిదాయీన్ దాడులకు సంబంధించిన పలు అంశాలు
- పంపింది ఎవరో గుర్తించే పనిలో కేంద్ర నిఘా వర్గాలు

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) ఇటీవల హైదరాబాద్–భోపాల్‌లలో అరెస్టు చేసిన 16 మంది ఉగ్రవాదుల కేసులో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు చేయడానికి ఈ మాడ్యూల్స్ సిద్ధమయ్యాయని, వీటికి విదేశాల నుంచి ఆదేశాలు అందుతున్నాయని ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఇందులో కీలకంగా వ్యవహరించిన మహ్మద్ సలీం, యాసిర్ ఖాన్ సహా ముగ్గురి నుంచి రికవరీ చేసిన ఫోన్లను ఏటీఎస్ అధికారులు విశ్లేషించారు. అవసరమైతే ఆత్మాహుతి దాడులకు సిద్ధం కావాలంటూ ఓ వ్యక్తి నుంచి వీరికి ఆదేశాలు అందినట్లు గుర్తించారు.

ఫోన్ల నుంచి ఆడియోలు రికవరీ

ఏటీఎస్ అధికారులు అరెస్టు చేసిన 16 మందిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఉగ్రవాదులు సమాచార మార్పిడి కోసం రాకెట్ చాట్, త్రీమా యాప్స్ వినియోగించారని.. ఎప్పటికప్పుడు డేటాను డిలీట్ చేయడం వల్ల కీలకమైన సమాచారమేదీ లభించలేదని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా 50 ఆడియో ఫైళ్లను రికవరీ చేసినట్లు సమాచారం. ఈ ఆడియోల్లో ప్రసంగించిన వ్యక్తి.. ఒకేసారి అనేక మందిని చంపడం (మాస్ కిల్లింగ్), సాబోటేజ్ (విధ్వంసాలు సృష్టించడం), ఎంపిక చేసుకున్న వ్యక్తులను హతమార్చడం (టార్గెట్ కిల్లింగ్)తోపాటు ఆత్మాహుతి (ఫిదాయీన్) దాడులకు సిద్ధంగా ఉండాలని సూచించినట్లు తేల్చారు. ఈ ఆడియోలతోపాటు వీరికి అందిన ఆదేశాలు, సూచనల సందేశాలూ రికవరీ అయ్యాయి. ఇక ఈ ఫోన్లకు పాకిస్తాన్ నంబర్ల నుంచి కాల్స్ వచ్చాయని, కాంటాక్ట్స్ లిస్టులోనూ ఆ దేశ నంబర్లు ఉన్నాయని గుర్తించారు. ఆ ఫోన్ నంబర్లు ఎవరివి, ఆడియోల్లోని వ్యక్తి ఎవరు అనేది గుర్తించేందుకు కేంద్ర నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి.

కొన్ని ఆడియోల్లో కఫీల్ అహ్మద్ ప్రస్తావన

ఫోన్ల నుంచి రిట్రీవ్ చేసిన ఆడియోల్లో లండన్‌లోని గ్లాస్గో విమానాశ్రయంపై 2007లో మానవ బాంబు దాడికి ప్రయత్నించిన బెంగళూరు వాసి, వృత్తిరీత్యా డాక్టర్ అయిన కఫీల్ అహ్మద్ ప్రస్తావన ఉన్నట్లు ఏటీఎస్ గుర్తించింది. ఇతను హిజ్బ్ ఉత్ తెహరీర్ (హెచ్‌యూటీ) సంస్థ తరఫునే మానవ బాంబుగా మారాడు. హైదరాబాద్– భోపాల్ మాడ్యుల్ ఉగ్రవాదులూ తొలినాళ్లలో ఇదే ఉగ్రవాద సంస్థ తరఫున పనిచేశారు. ఈ క్రమంలో ఫోన్లలోని ఆడియోలు హెచ్‌యూటీ హ్యాండ్లర్‌విగా భావిస్తున్నారు. ఇక ఏటీఎస్ విచారిస్తున్న 16 మంది పోలీసు కస్టడీ శుక్రవారంతో ముగియనుంది. మరో 5 రోజులు కస్టడీ కోరాలని ఏటీఎస్ భావిస్తోంది. ఈ కేసులో మరో ముగ్గురు హైదరాబాద్ వాసులను సాక్షులుగా చేరుస్తున్నారు. వీరి నుంచి వాంగ్మూలాలు నమోదు చేయనున్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా

మధురానగర్ (విజయవాడసెంట్రల్): ఎన్నికల ప్రక్రియను సజావుగా, సక్రమంగా నిర్వహించేలా ఎన్నికల కమిషన్ నిర్దేశిస్తున్న విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. ఆయన గురువారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఈవోలు, ఏఆర్వో, ఈఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. ఎన్నికలు ఎలా నిర్వహించాలి, ఎన్నికల ప్రక్రియలో ఎలక్ట్రోరల్ రోల్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, ప్లానింగ్, పోలింగ్ సిబ్బంది, నామినేషన్లు తదితర అంశాలపై కలెక్టర్లు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలోని కలెక్టర్ విడిది కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు నామినేషన్ ప్రక్రియపై మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు. వీటిలో భాగంగా నామినేషన్ ఫారం, నామినేషన్ రిజిస్టర్, ఎలక్ట్రోరల్ రోల్, ఓత్‌ఫారాలు, ఆర్వో హ్యాండ్‌బుక్, వివిధ దరఖాస్తులు, ఫార్మాట్లు, రిజిస్టర్లు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. భౌతికంగా రిటర్నింగ్ అధికారి చాంబర్, ఇండికేషన్ బోర్డు, ఫ్లెక్సీలు, ఫర్నిచర్, సీసీటీవీ, వీడియోగ్రఫీ, 100 మీటర్ల మార్కింగ్, కంప్యూటర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నామినేషన్లు స్వీకరించిన అనంతరం పరిశీలన, తుది అభ్యర్థుల జాబితా ప్రచురణ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాస్, ఆర్డీవోలు రవీంద్రరావు, వై.వి.ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

తెలంగాణ

జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై మహాధర్నా

కవాడిగూడ/సాక్షి, హైదరాబాద్: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కాంగ్రెస్, వైఎస్ఆర్‌టీపీ, సీపీఎం, టీజేఎస్ మద్దతు తెలిపాయి. ఆయా పార్టీలకు చెందిన నేతలు హాజరై మహాధర్నాకు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్యలపై సీఎం హామీ ఇచ్చినా నేటికీ అమలుకు నోచుకోకపోవడం బాధాకరమని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. నాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం 70 ఎకరాల స్థలం కేటాయిస్తే సాంకేతిక కారణాలు చూపుతూ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. టీడబ్ల్యూజేఎఫ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పిల్లి రాంచందర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో టీపీసీసీ అధికార ప్రతినిధి శ్యామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఫెడరేషన్ నేతలు రాజశేఖర్, రఘు, హెచ్‌యుజే అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, జగదీశ్, నవీన్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు చెప్పినా ఇవ్వరా?

వేల ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముతున్న కేసీఆర్ ప్రభుత్వం.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా వేధిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం జరిగిన మహాధర్నాకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. సుప్రీంకోర్టు కేసు క్లియర్ అయిన తర్వాత కూడా హైదరాబాద్‌లో కేటాయించిన స్థలాలను జర్నలిస్టులకు ఇవ్వడం లేదని విచారం వ్యక్తంచేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943